
Deccan Land

Deccan

OCT | OCT 2025



PRGI Regn. No. TELTEL/2012/46784

₹ 30

సంపుటి : 14

సంచిక : 2

# దక్కన్ ల్యాండ్


సామాజిక రాజకీయ మాసపత్రిక

అక్టోబర్ - 2025

DECCAN LAND, HYDERABAD

158

OCTOBER - 2025




VOL 14వ వసంతంలో

158 ISSUES నూట యాభై ఎనిమిదవ సంచిక

పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



- పర్యావరణ సామ్యవాదం!
- అరుదైన ఆలయ పునాదులు
- గండికోట అభివృద్ధిలో కడప ఇంటాక్ కృషి
- గాంధీ మహాత్ముడు బయలుదేరగా..



# CENTRAL BOOK SHOP


**ABIDS**
5-9-186,Behind SBH(H.O)
Gunfoundry,Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service
CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- SCHOOL BOOKS
- GENERAL BOOKS
- STATIONARY & GIFTS






## UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2025

**Serial Nomination for Chausath Yogini Temples in State, Province or Region India:**

**Category: Cultural**

## చౌసత్ యోగిని ఆలయాలు

దేశంలోని పురాతన ఆలయాల్లో యోగిని ఆలయాలకు ఓ ప్రత్యేకత ఉంది. అందుకే భారత్‌లోని వివిధ రాష్ట్రాల్లో నెలకొని ఉన్న యోగిని ఆలయాలను సీరియల్‌గా పరిగణిస్తూ వాటిని యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సెంటర్‌కు సంబంధించి 2025 మార్చి 7న భారత తాత్కాలిక జాబితాలో చేర్చింది. చౌసత్ యోగిని దేవాలయాలలో యోగినిల 64 శిల్పాలు ఆ యోగినుల వ్యక్తిగత గదులలో ఉంటాయి. మందిరంలో వృత్తాకారంగా అమర్చబడిన క్లిష్టమైన రాతి శిల్పాలతో ఉంటాయి. ఈ దేవాలయాలు ఎక్కువగా కొండలపై ఉన్నాయి. యోగిని అనేది యోగ సాధన చేసే స్త్రీని సూచిస్తుంది. వారంతా అడవుల్లోని ఆత్మలు, మాతృ దేవతల సమూహం. తాంత్రిక శక్తులకి భయపడేవారిచే, వాటి కోసం సాధన చేసే వారిచే చౌసత్ యోగినిలు పూజలందు కుంటారు.

*ప్రత్యేక వ్యాసం : 27వ పేజీలో*

TRC
TELANGANA RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## సమాజాన్ని చైతన్య పరుస్తున్న దక్కన్‌ల్యాండ్

తెలంగాణ సమాజాన్ని చైతన్య పరిచే విధంగా తమ ఉనికిని నిలబెట్టేలా సామాజిక, రాజకీయపరంగా తెలంగాణ సంస్కృతి వారసత్వాన్ని తెలియజేస్తున్న 'దక్కన్ ల్యాండ్' మాసపత్రిక సమాజానికి తండ్రి లాంటిది అయితే... రేపటి భావి భారత నిర్మాణానికి పునాదులు వేస్తూ బాలల సంపూర్ణ మూర్తిమత్వానికి, మనోవికాసానికి దోహదపడుతూ.. బాల సాహిత్యానికి 'బాల చెలిమి' పిల్లల వికాస మాస పత్రిక తల్లి లాంటిది. రెండు మ్యాగజైన్లను ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి సమాజానికి అందిస్తున్న సంపాదకులు శ్రీ మణికొండ వేదకుమార్ గారు తెలంగాణ సమాజం గర్వించదగ్గ వ్యక్తి. వారికి హృదయ పూర్వక అభినందనలు.

**–కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,**
నల్గొండ

❖ ❖ ❖

## విందు భోజనం లాంటిది దక్కన్‌ల్యాండ్

నమస్కారములు. దక్కన్ ల్యాండ్ ఆగష్టు 25 సంచిక చదివాను. షడ్రసోపేతమైన విందు భోజనం ఆరగించినట్లు అనిపించింది.

మన 'దేశపు తొలి 'హరితీ' కంచు బొమ్మ నందించిన తెలంగాణా' వ్యాసం, ఎన్నో క్రొత్త విషయాలను తెలిపింది. నాందేడ్ పరిసరాలలోను, మరాఠీ ప్రభావం ఉన్న తెలంగాణ ప్రాంతంలోను ఒక దేవత ఉంది, ఆమె పేరు "సట్వాయి". ఈమె, అప్పుడే పుట్టిన చిన్న పిల్లలను తినేస్తుంది. ఈమెను సరియైన పద్ధతిలో పూజిస్తే ఈమె మన పిల్లలకు హాని చేయదు.

పర్యావరణం, సుందర్‌లాల్ బహుగుణల గురించి చక్కటి వ్యాసం, సీతారామారావుగారు రాశారు. ఇస్రో గురించి, ముబారిజుద్దౌలా గురించిన వ్యాసాలు, మరాఠా సైనికుల గురించి, సోనభద్ర గురించి వ్యాసం, పైగా టూంబ్స్ గురించిన ఫోటోలతో కూడిన వ్యాసాలు చక్కగా చరిత్రలను వివరించాయి. చందుపట్ల విద్దేశ్వరాలయం ఒక ఫుల్ మీల్స్ లాంటి చరిత్ర వ్యాసం.

వేములవాడ చాళుక్యులు విద్యావ్యవస్థ-సంస్థలు, డా. సందేవేని రాసిన వ్యాసం, ఎంతో వివరణాత్మకంగా ఉంది. నానుండి ఒక చిన్న సవరణ 'చాళుక్యులు' సా.శ 753 నుండి 955 వరకు 200 సంll బోధన్ రాజధానిగా ఈ ప్రాంతాన్ని పాలించారు. సుమారు 50 సంll మాత్రమే గంగాధర, వేములవాడలు రాజధానిగా పాలించారు. నాడు బోధన్ తర్వాత వేములవాడ ఒక పుణ్యక్షేత్రం కాబట్టి అభివృద్ధి చేశారు అంతే. కష్ట కాలంలో వేములవాడలో తల దాచుకున్నారు. కాబట్టి వీరిని బోధన్ చాళుక్యులు అనాలని విన్నపం.

నేను చరిత్ర అభిమానిని. ఈ సంచికలో అన్ని చరిత్ర, సంబంధిత వ్యాసాలే వచ్చాయి. పండుగ చేసుకున్నాను. ఈ సంచిక అవిస్మరణీయ సంచిక.

**–కందకుర్తి ఆనంద్,** నిజామాబాద్
మొ: 9951939737

## చెట్టంత మనిషి వనజీవి రామయ్య

సుందర్‌లాల్ బహుగుణ లాగా మన తెలంగాణ వనజీవి రామయ్య పర్యావరణం కోసం పాటు పడ్డారు. సమాజానికి స్ఫూర్తి అందించే వ్యక్తులు అంటే సెలబ్రిటీలుగా భావించే వారు, సంచలనాత్మక విజయాలు సాధించినవారే అని నేటి సమాజం భావిస్తోంది. అలా కాకుండా క్షేత్రస్థాయిలో, సాధారణ జీవితం గడుపుతూ, ప్రజల మధ్యనే తమ సేవాచరణను అందించే అతి కొద్ది మంది వ్యక్తులలో మన వనజీవి రామయ్య ఒకరు. 'ఉద్వేగ' పూరిత ఆచరణ ఉన్న వారి వల్లనే, లోకంలోని చెడుకు ఎంతో కొంత విరుగుడు కుదురుతుంది. 'పిచ్చిపట్టినట్టు' పని చేసేవారి వల్లనే మంచిపనులు జరుగుతుంటాయి. దరిపెల్లి రామయ్య అందుకే ధన్యజీవి. అనేకానేక అవార్డులు, చివరగా పద్మశ్రీ పురస్కారం, అన్నీ రామయ్య ప్రస్థానంలో మైలురాళ్లే తప్ప, తల మీద ధరించిన 'వృక్ష రక్షతి రక్షితః' అన్న నినాదమే ఆయన ఆచరణకు అసలైన కిరీటం.

వీరి గురించి జిల్లా నరేష్ పుస్తకం వెలువరించడం అభినందనీయం. ఈ పుస్తకాన్ని చక్కగా, క్లుప్తంగా విశ్లేషించిన సీనియర్ జర్నలిస్టు కె. శ్రీనివాస్ గారికి ధన్యవాదాలు.

**–ఆర్. రాంమోహన్‌రావు,** కోదాడ ద

## పరిశోధకులకు శుభవార్త  దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com
**- ఎడిటర్**

ISSN 2581-3188

విషయసూచిక


# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 14 సంచిక : 2 పేజీలు : 60

అక్టోబర్ - 2025



సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్

**సయ్యద్ ఖైజర్ భాష**

9030626288

వాణిజ్య ప్రకటనలు

**కె. సచిన్**

86866 64949

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**

కవర్‌పేజీ

**చౌసత్ యోగిని ఆలయాలు**



layout - Composing & Printed @

DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020

Mobile: 90599 50055

deccanpress.hyd@gmail.com



కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,

Himayatnagar, Hyderabad - 500 029

TELANGANA

Mobile: 9030626288

Fax: 040-27635644

E-mail: desk.deccan@gmail.com

website : www.deccanland.com



**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.


## లోపలి పేజీల్లో...




కవర్ స్టోరీ

28వ పేజీలో

నైసార్ మిషన్



రాయపోలు అనే రాజనగరంలో




దాశరథి రంగాచార్య ప్రజా జీవిత పోరాటం ............ డా॥ కె. ఎల్లప్ప ............ 6

పర్యావరణ సంక్షోభం - పరిష్కారాలు..... (ఎడిటోరియల్) ............ వేదకుమార్. యం ............ 7

తృణకాంత మణి అంబర్ ............ చకిలం వేణుగోపాలరావు ............ 9

భాగ్యదాయిని బతుకమ్మ ............ ఎసికె. శ్రీహరి ............ 12

"స్వంత కథ" ............ పరవస్తు లోకేశ్వర్ ............ 13

అరుదైన ఆలయ పునాదులు ............ ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ............ 15

చెడుపై మంచి గెలిచిన రోజు ............ కె. సత్యప్రసన్న ............ 16

పర్యావరణ సామ్యవాదం! ............ డా॥ ఆర్. సీతారామారావు ............ 17

నైసార్ మిషన్ ............ పుట్టా పెద్ద ఓబులేసు ............ 19

అతిపెద్ద కోటల్లో గండికోట ............ పంతుల పవన్ కుమార్ ............ 23

గండికోట అభివృద్ధిలో ఇంటాక్ కృషి ............ కంభం చిన్నపరెడ్డి ............ 26

చౌసత్ యోగిని ఆలయాలు ............ వంశీ మోహన్ నర్ల ............ 28

చెక్కబొమ్మలాట ............ కట్టా ప్రభాకర్ ............ 32

ఉమ్మడి కర్నూలు జిల్లా శిలా & ఖనిజ సంపద ............ కమతం మహేందర్‌రెడ్డి ............ 33

వారసత్వ సంపద పెంబర్తి హస్తకళ ............ సువేగా ............ 35

అశోకుడు బౌద్ధ స్వీకరణ ప్రథమ శాసనం ............ డా॥ జి.యస్. రామయ్య ............ 38

గాంధీ మహాత్ముడు బయలుదేరగా.. ............ డా॥ నాగసూరి వేణుగోపాల్ ............ 40

జమానత్ కథ వెనుక కథ ............ మంగారి రాజేందర్ (జింబో) ............ 43

రాయపోలు అనే రాజనగరంలో ............ శ్రీరామోజు హరగోపాల్ ............ 45

మహా చింతచెట్టు క్రింద స్మారక సభ ............ ఖైజర్ ............ 48

లోకాయపల్లి సంస్థానం ............ డా॥ కోడోజు కృష్ణమూర్తి ............ 49

బతుకమ్మ సారూప్యత ఛట్ పూజ ............ దక్కన్ న్యూస్ ............ 52

ఇంజనీరింగ్‌కు దీటుగా డిగ్రీ ............ కొత్వాల్ సచిన్ ............ 53

సింగరేణి గనులకు అవార్డులు ............ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ............ 54

తెలంగాణలో వరి ఓవర్‌లోడ్ ............ జి. రామ్‌మోహన్ ............ 55

పూటకూళ్ళవ్వ (కథ) ............ మాదారపు వాణిశ్రీ ............ 57




**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిద్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

## దాశరథి రంగాచార్య మోదుగుపూలు నవలలో

# ప్రజా జీవితం పోరాటం

నవలా సాహిత్యంలో దాశరథి రంగాచార్యులు సుప్రసిద్ధులు. ఈయన రచించిన నవలల్లో తెలంగాణ జీవన విధానం, గ్రామీణ జీవన చిత్రణ, రజాకర్ల దుశ్చర్య, హైదరాబాద్ రాష్ట్ర పరిస్థితులు, జమిందారి వ్యవస్థ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కరణాలు పట్వారిల పెద్దరికం, అనాటి ప్రభుత్వ అధికారుల వద్ద ప్రజల వెట్టిచాకిరి, భూ సమస్య పోరాటం, ప్రజల్లో చైతన్యం మొదలగు అంశాలు వివరించబడ్డాయి. రంగాచార్య చిల్లర దేవుళ్ళు, మోదుగు పూలు, జనపదం, మాయా జలతారు, రానున్నది ఏది నిజం, పావని, మానవత, శరతల్పం, అమృతంగమయ్య నవలలను రచించాడు. వచన రచనకు దాశరథి రంగాచార్య ప్రసిద్ధి. అందులో నవలా రచనకు ఆయనకు అందవేసిన చేయి అని చెప్పవచ్చు. మోదుగు పూలు నవలలోని ప్రజా జీవన పోరాటాన్ని పరిశీలిద్దాం.



దాశరథి రంగాచార్య గార్లలో నడిపిన ఉద్యమం ఇతివృత్తంగా "మోదుగుపూలు" నవలను రచించాడు. "ప్రగతి"లో "మోదుగు పూలు'' ధారావాహికగా వచ్చింది. 1971లోనే విశాలాంధ్ర ప్రచురణాలయం వారు పుస్తకంగా ముద్రించారు. మోదుగుపూలు 1984లో రేడియోలో నాటకంగా ప్రసారం అయింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో "మోదుగపూలు"పై పి.ఎస్. ప్రకాశ్ పరిశోధన చేసి ఎం.ఫిల్ డిగ్రీ పొందారు.

"మోదుగుపూలు"లో 1938 నుంచి 1948 వరకు, అంటే హైదరాబాద్ సంస్థానంపై పోలీస్ చర్య జరిగే దాక తెలంగాణా ప్రజా జీవితం, ప్రజా పోరాటానికి ప్రజలు సిద్ధమైన తీరు చిత్రించబడింది. రంగాచార్య "మోదుగుపూలు"లో ఒక జాగీర్ను కథా వస్తువుగా తీసుకున్నారు. దీని పరిధి విస్తృతం. కొన్ని గ్రామాలు ఏకమై చైతన్యంతో తిరుగుబాటు చేయడం ఇక్కడ కనిపిస్తుంది. జాగీర్దార్ ఎక్కడో పట్నంలో ఉంటాడు. అతడికి పరిపాలన, ప్రజల క్షేమం పట్టదు. పాలన అంతా తాసిల్దార్ చేతిలో ఉంటుంది. అతనే జాగీర్కు "సర్వతంత్ర స్వతంత్రుడైన" ప్రభువు. అక్కడ ఒక శాసనమంటూ ఏమీ ఉండదు. "దండించడమే" శాసనం.

**ఉదాహణకు ఒక సంఘటనను చూద్దాం.**

జాగీర్లో పేపర్ చదవడం నిషేధం. అలాంటి జాగీర్లోకి పట్నంలో చదువుకున్న రఘు పేపర్తో దిగుతాడు. జాగీర్లోకి పేపర్ తెచ్చినందుకు అమీన్చేత చెంప దెబ్బతింటారు. రఘు. అమీన్పై పగ తీర్చుకుంటానంటాడు. రఘు మామ వీరయ్య అప్పుడు రఘు, "వ్యక్తిని అని ఏమి ప్రయోజనం, వ్యవస్థ అటువంటిది" దాన్ని మార్చాలంటాడు. "తాసిల్దార్ గుడ్ల గూబ. ప్రజల అజ్ఞానం చీకటి. ఈ చీకటి ఉన్నంత సేపే తాసిల్దార్ ఆటలు సాగుతాయి. అజ్ఞానం అనే చీకటి పోయి విజ్ఞానం అనే వెలుగు వస్తే తాసిల్దార్ గుడ్డివాడై పోతాడు" (పే. 32) అంటాడు రఘు.

ఇక్కడ ప్రజా చైతన్యానికి రఘు నాయకుడిగా ఉండడానికి మామ వీరయ్య మాటలు స్ఫూర్తినిస్తాయి. ఈ మాటలను రఘు తన ఉద్యమానికి పునాదులు వేసుకుంటాడు. ప్రజలకు "ప్రపంచ జ్ఞానం" కలిగించాలనుకుంటాడు. ఆ ఉద్యమానికి రఘు మేనమామ వీరయ్య, ఆయన కూతురు జానకి, అదే జాగీర్కు చెందిన నగేశ్ సహకరిస్తారు. నగేశ్ హింసావాది. రఘు అహింసావాది. శాంతమూర్తి.

రఘు మంగలివాళ్లచేత సమ్మె చేయించి, వారి భూమి తిరిగి వచ్చేలా చేస్తాడు. రఘు "పోరాటానికి మంగలి రావడు పూర్తి సహకారాన్ని అందిస్తాడు. తాను చదువు నేర్చుకుని, తమ వారికి చెబుతాడు. వడ్డెర పీరయ్య, పీరమ్మ మృతితో వడ్డెర్లలో చైతన్యం రగిలిస్తారు. రఘు, జానకి, నగేశ్లు. అప్పటిదాక తిరుగుబోతుగా ఉన్న పీరయ్య కొడుకు. భీముడు రఘు ఉద్యమంలో చేరతాడు. వెట్టి చాకిరి నిర్మూలన: తాసిల్దార్ బంగ్లాకు వెట్టికి రాళ్లు కొట్టమని, కూలీ ఇవ్వాలని అడుగుతారు. విజయం సాధిస్తారు. నవలలో మరో ప్రధాన విషయం కోయలు. నాగరికతకు దూరంగా అడవుల్లో ఉండే కోయలు తాసిల్దార్కి ఎట్టి చేయాల్సిందే. అలాంటి వారిలో

(తరువాయి 8వ పేజీలో)

# పర్యావరణ సంక్షోభం - పరిష్కారాలు

ప్రకృతి ఎప్పుడూ ఒకే స్థితిలో ఉండదు. ఆరు ఋతువులూ ప్రభావితం చేస్తాయి. ఆకురాలడం నుంచి చివురు చిగురించి పరిఢవిల్లుతుంది. ఆరు ఋతువుల చక్రభ్రమణంలోని విభిన్న వాతావరణాల్లోంచి వివిధ ప్రయోజనాలూ, మనుగడకు అవసరమైన స్థితులూ ప్రజలకు అందుతాయి. విలక్షణతలతో విలసిల్లడం ప్రకృతి సహజలక్షణం. ప్రకృతిలోని ఈ విలక్షతలకు భంగం కలిగించడం వల్లనే పర్యావరణ సంక్షోభం సంభవిస్తుంది. ప్రజల నిత్య జీవితాలకు భద్రత లేకుండా పోతుంది.

ప్రకృతి విలక్షణతలకు భంగం కలిగించే అంశాలు బహుముఖీనమైనవి. ప్రకృతి విచ్ఛిన్నతకు మానవ తప్పిదాలే కారణమవడం పాక్షిక సత్యమే. వారు నిర్మించుకున్న సామాజిక వ్యవస్థలు అనుసరిస్తున్న విధానాలు కారణం. ప్రజల బాగోగులు చూడటానికి ఆ వ్యవస్థలు కొన్ని విధానాలకు రూపకల్పన చేసి ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తాయి. ఆ విధానాల రూపకల్పనలోనూ, వాటి అమలులోనూ విశాల ప్రజానీకపు అవసరాలు, వారి మనుగడకు, సుస్థిరతకు యిచ్చే ప్రాధాన్యతను బట్టి ఆ సమాజపు అభివృద్ధి, నాగరికత ఆధారపడి వుంటుంది.



ఇవాళ ప్రపంచ దేశాలన్నీ ఈ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. వాతావరణ మార్పులు, నీటికొరత, గాలి, భూమి కాలుష్యం, అరణ్యాల క్షీణత, జీవవైవిధ్యం వంటి సమస్యలు, పర్యావరణాన్నే కాదు, ప్రజల జీవనాధారాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

ప్రస్తుత ఉత్పత్తి విధానాలు లాభాలకోసం ప్రకృతిని వాణిజ్యీకరించి, వస్తువులుగా మార్చి, మనుషులను కేవలం వినియోగదారులుగా మారుస్తున్నాయనీ, పర్యావరణ సంక్షోభాలకూ, ఆర్థిక సంక్షోభాలకూ లాభాపేక్షే లక్ష్యంగా రూపొందిన విధానాలే కారణమని ప్రపంచ ఆర్థిక వేత్తలు, మేధావులూ అభిప్రాయపడుతున్నారు.

పర్యావరణ పరిరక్షణతో సామాజిక న్యాయతత్వాన్ని అనుసంధానించిన భావన ఎకో సోషలిజం. నీరు, గాలి, భూమి, అరణ్యాల వంటి సమస్త ప్రకృతి వనరులూ సమాజానికి చెందినవి కావాలి. ప్రతి ఒక్కరినీ భాగస్వామిగా చూడాలి. సమాజన్యాయం, వనరుల సమగ్ర వినియోగం, సుస్థిర అభివృద్ధి దీని ప్రధాన లక్ష్యాలు. ప్రజాస్వామ్య పర్యావరణ న్యాయం అవసరం.

ఉత్పత్తి - వినియోగం అనేది ప్రకృతి వనరుల సహజత్వాన్ని దెబ్బతీసి పర్యావరణానికి నష్టం కలిగించకుండా నూతన ఆర్థిక, సామాజిక వ్యూహాలు రచించాలి. గ్రామీణ ప్రజల భాగస్వామ్యం, సహజవనరుల సామూహిక నిర్వహణ, సహజవనరులపై ఆధారపడ్డ పేదప్రజల, రైతుల, కూలీల, అరణ్య ఆధారిత ఆదివాసీల హక్కుల రక్షణకు కృషి చేయాలి.

భవిష్యత్ తరాల సుస్థిరతను దృష్టిలో వుంచుకొని ప్రణాళికలు తయారు చేయాలి. సమాజంలో సమానత్వం, సహజ వనరుల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ లేకుండా పర్యావరణ సంక్షోభాన్ని అధిగమించలేము. దీర్ఘకాలిక పరిష్కారం కోసం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాల్లో మనమూ భాగస్వామ్యం కావాలి.



(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

రఘు చైతన్యం నింపుతాడు.

వార్తాపత్రిక చదవడం నిషిద్ధమైన జాగిరిలో వార్తాపత్రిక తెచ్చి ప్రజల చేత చదివిస్తాడు రఘు. ప్రజల సహకారంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి నాయకులను పిలిపించి సభలు నిర్వహించి రాత్రి పాఠశాలలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తాడు.




మోదుగు పువ్వులు నవలలో నిజాం సంస్థానంలోని జాగిర్ల పుట్టుపూర్వోత్తరాలను రచయిత వివరించాడు. అలాగే వారి పరిపాలన విధానాన్ని వివరించాడు. వాటితో పాటు జాగిర్దారుల జలసాలు, తాసిల్దార్ల అరాచకాలు వివరించాడు.

తాసిల్దార్, గిర్దావర్, అమీన్, సాహుకారులు నాటి సమాజంలో ప్రజలను ఎలా పీడించారో వివరంగా చిత్రించారీ నవలలో రచయిత. ప్రజలు భూమి శిస్తు కాకుండా వందల రకాల పన్నులు చెల్లించాల్సి వచ్చేంది. ఆ సుంకంతోపాటు ఊరంతా వెట్టి చేయాల్సి వచ్చేది. జాగీర్దార్ వేట కోసం వచ్చినప్పుడు ప్రజల నుంచి వేట సుంకం వసూలు చేస్తారు. సుంకం ఇవ్వడమే కాకుండా, వెట్టి చేయాల్సిందే. “జాగీర్దార్ దిగకముందే ఏర్పాట్లు సాగాయి. గొండ్లు తాటాకు కొట్టారు. కోయలు వాసాలు కొట్టి తెచ్చారు. బండ్లు ఎట్టికి కట్టారు రైతులు. వ్యాపారస్తులు బిర్యానీకి, పొలావుకు అయిన సామాగ్రి ఉచితంగా ఇవ్వాలి. గొల్లవారు గొర్రెలు ఇవ్వాలి. మంగళ్లు మసాలాలు నూరాలి. చాకళ్లు మేనాలు మోయాలి. ఊరంతా వెట్టి చేయాలి. అధికారుల తప్ప అధికారులకు అది పండుగ”. పుట 39

సాహుకారుల దోపిడి, పీడన, అరాచకత్వం ఎలా ఉంటుందో ఈ నవలలో చిత్రీకరించబడింది. నిజాం రాజ్యంలో సాహుకార్ల దోపిడీని వెంకయ్య పాత్ర చిత్రీకరిస్తుంది. వెంకయ్య జాగీరికే పెద్ద సాహుకారు. “అందరి గింజలతో అతని గరిసెలు నిండుతాయి. అందరి కుండలూ అతని గింజలతోనే ఉడుకుతాయి” (పే.45) మంగలిరావడి తండ్రికి నూరు రూపాయాలు అప్పుగా ఇచ్చి ఉంటాడు. ఆ బాకీ కిందికి మంగలిపని, వైద్యమూ, బాజా ఉచితంగా చేయాలి. ఈ విధానాన్ని మంగలి వాడు ఎదిరిస్తాడు. అతనికి పొలం ఉంది కాబట్టే తన మాట వినడంలేదు అనుకుంటాడు. భూమి కాజేయాలనుకంటాడు. అమీన్ మంగలి రావడిని హింసించి, బాకీ కిందకి భూమి ఇచ్చేందుకు ఒప్పిస్తాడు.

వేట సందర్భంలోనే పులికి బదులు కోయవాడిని కొట్టమంటుంది బేగం. జాగీర్దార్ తుపాకీతో కోయవాడిని కొడతాడు. ఆ కోయవాడు విలవిల్లాడి చనిపోతాడు. అతను ఎవరికీ పట్టడు. అందరూ జాగీర్దార్ గురిని మెచ్చుకుంటారు. ఇలాంటి ఉదంతాలు నాటి ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థకు చిహ్నాలు. అమాయక ప్రజలలో వచ్చిన మార్పును, తిరుగుబాటును మనం ఈ నవలలో గమనించవచ్చు.

**ఆధార గ్రంథాలు**

1. మోదుగుపూలు – దాశరథి రంగాచార్య

–డా॥ కె.ఎల్లప్ప, m : 9866819522
e: yellappa333@gmail.com

# దాశరథి కమల కన్నుమూత



సుప్రసిద్ధ రచయిత డాక్టర్ దాశరథి రంగాచార్య సతీమణి దాశరథి కమల (92) మంగళవారం (23.09.2025) కన్నుమూశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అశ్రు నయనాల నడుమ మారేడుపల్లిలోని హిందూ శ్మశాన వాటికలో ఆమె భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. దాశరథి దంపతులకు కుమారుడు విరించి, ఇద్దరు కుమార్తెలు సుధ, ఉదయశ్రీ ఉన్నారు. దాశరథి రంగాచార్య సాహితీ ప్రస్థానంలో కమల కీలక పాత్ర పోషించారు.


ఆయన రచనలకు కమల వెన్నెముకగా నిలిచారని సాహిత్య లోకం గుర్తుచేసుకుంటోంది. దాశరథి కమల ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు రచయితలు, సాహితీ అభిమానులు ఆకాంక్షించారు. ఆమె మరణం సాహిత్య లోకానికి తీరని లోటు అని వ్యాఖ్యానించారు. సికింద్రాబాద్ మున్సిపాలిటీ చివరి కమిషనర్‌గా పనిచేసిన దాశరథి పదవీ విరమణ అనంతరం ఈస్ట్ మారేడుపల్లిలో స్థిరపడ్డారు. 2015 జూన్ 7న ఆయన మరణించారు.

# తృణకాంత మణి అంబర్

అంబర్ ఎంతో విశిష్టతకలిగిన రత్నం. ఇది చెట్టుజిగురు కాలక్రమంలో గట్టిపడి, శిలాజీకరణం చెందటంవల్ల ఏర్పడుతుంది. అందువల్ల ఇది ఖనిజం కాదు. Mineraloid మాత్రమే. రత్నంగా, శిలాజంగా, ఆయుర్వేద ఔషధంగా దీనికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. భూవిజ్ఞానశాస్త్రపరమైన పరిశోధనలకు అనువైన గతాన్ని తనలో భద్రపరచుకున్న విలువైన సాధనం.

దీని భౌతిక లక్షణాలను పరిశీలిస్తే మృదువైన, పెళుసుగా ఉండే గాజువంటి పారదర్శక పదార్థం. తేనెవన్నె పసుపురంగులో ఉంటుంది. తక్కువ కాఠిన్యం (2.5–3) కలిగిన రత్నం అవటంతో ఆభరణాలలో పొదగటానికి సులువుగా ఉంటుంది.

ఈ జిగురు గట్టిపడకముందు అందులో చిక్కుకున్న కీటకాలు, ఇతర జీవులుకూడా ఈ జిగురుతో పాటు కాలక్రమంలో శిలాజాలుగా మారుతాయి.



**అంబర్ అనే పేరు:**

అంబర్ అనేపేరు అరబిక్ పదం anbar నుండి వచ్చింది. ఈ పదం నిజానికి వేరొక వస్తువును సూచించేది. అంబర్‌గ్రిస్ అనేది స్పెర్మ్ వేల్స్ ద్వారా స్రవించే ఒక మైనపుపదార్థం, దీనిని పరిమళద్రవ్యాలలో ఉపయోగించడం కోసం చాలా విలువైనదిగా పరిగణించే వారు.

తరువాతి కాలంలో అంబర్, అంబర్‌గ్రిస్ రెండూ విలువైనవిగానూ, తరచూ సముద్రతీరాలలో కనుక ఈ పేరు శిలాజ వృక్షపు బంకకు కూడా వర్తించింది. అంబర్‌గ్రిస్ వాడకం తగ్గుముఖం పట్టడంతో, యాంబర్ అనే పేరు ప్రధానంగా శిలాజ వృక్షపు జిగురుకు మాత్రమే పరిమితమైంది.

**అంబర్ ఇతర సాంకేతికపదాలు :**

**సుచ్చినిట్ (Succinite):** బాల్టిక్ యాంబర్‌ను ప్రత్యేకంగా సూచిస్తుంది, ఇందులో అధికస్థాయిలో సక్సినిక్ ఆమ్లం ఉంటుంది.

**రెటినైట్ (Retinite):** సక్సినిక్ ఆమ్లం లేని శిలాజ జిగురు.

**కోపాల్ (Copal):** ఇది నిజమైన యాంబర్ కంటే చాలా తక్కువ వయస్సుగల, పూర్తిగా శిలాజంగా మారకముందు ఉన్న జిగురు. దీని వయస్సు సాధారణంగా ఒక మిలియన్ సంవత్సరాల కంటే తక్కువగా ఉంటుంది. కోపాల్‌ను తరచుగా అగరబత్తుల తయారీకోసం సేకరిస్తారు.

**ఎలక్ట్రాన్ (Elektron):** యాంబర్‌కు ప్రాచీన గ్రీకుపేరు. రాపిడికి గురైనప్పుడు స్టాటిక్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే దాని సామర్థ్యం ఆధారంగా ఈ పేరు వచ్చింది.

**బెర్న్‌స్టీన్ (Bernstein):** యాంబర్‌కు జర్మన్ పదం. దీని అర్థం "మండేరాయి". తృణస్ఫటికం అని కూడా దీనిని అంటారు.

**మన సాహిత్యంలో అంబర్:**

సంస్కృతంలో 'తృణ' అంటే గడ్డి, 'కాంత' అంటే ఆకర్షించేది అని అర్థం. ఈ మణికి గడ్డి లేదా చిన్న వస్తువులను ఆకర్షించే లక్షణం ఉండడం వల్ల అంబర్‌కు 'తృణకాంతమణి' అనే పేరు వచ్చింది.

ఆయుర్వేద గ్రంథాలలో తృణకాంత మణిని 'ఉపరత్న' వర్గంలో చేర్చారు. ఇది గుండెకు బలాన్నిచ్చే (హృద్య), ఇంద్రియాలను ప్రశాంతపరిచే (ఇంద్రియ ప్రసాదన), రక్తస్రావాన్ని అరికట్టే (రక్తస్తంభక) గుణాలను కలిగి ఉంటుంది. ముఖ్యంగా, రక్తస్రావానికి సంబంధించిన వ్యాధులలో (రక్త అతిసార, రక్తార్శ), అధిక రక్తస్రావం అయ్యే రుతుస్రావ సమస్యలలో (అత్యర్తవ) దీనిని ఔషధంగా ఉపయోగిస్తారు.

**బౌద్ధ సాహిత్యంలో:**

క్రీ.శ. 2వ శతాబ్దానికి చెందిన బౌద్ధ గ్రంథం మహాప్రజ్ఞాపార మితశాస్త్రంలో తృణమణి గురించి ప్రస్తావన ఉంది. ఇందులో బౌద్ధుడి మహిమవల్ల ఈ రత్నం ద్వారా విశ్వాన్ని మార్చగల సామర్థ్యం గురించి ప్రస్తావించారు.

**రసశాస్త్రంలో:**

ఆయుర్వేదంలోని రసశాస్త్ర విభాగంలో తృణకాంత మణిని శుద్ధిచేసి (శోధన) 'తృణకాంతమణి పిష్టి' అనే ఔషధం తయారు చేస్తారు.

**రసశాస్త్ర గ్రంథాల ప్రకారం:**

"తృణగ్రహీతి తస్య చ యతః తృణం ఆకర్షతి" అని



పేర్కొనబడింది.

తృణకాంత మణిని పట్టువస్త్రంతో రుద్దినప్పుడు చిన్న గడ్డిపోచలు, కాగితపుముక్కలు వంటివాటిని ఆకర్షిస్తుంది.

సంస్కృత గ్రంథాలలో దీనికి తృణకాంత, తృణగ్రాహి, వంటి పర్యాయపదాలు ఉన్నాయి. కహరుబా కూడా గడ్డిని ఆకర్షించేది అనే అర్థంకల పర్షియన్ పదం.

**అంబర్ శిలాజాలు:**

రాళ్లలో దొరికే సాధారణ శిలాజాలతో పోలిస్తే, అంబర్‌లో లభించే శిలాజాలకు కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. అవి చాలా అరుదైన ప్రాచీనకాలంనాటి జీవాలను చెక్కుచెదరకుండా వాటి మృదువైన కణజాలం, రంగు ఇతర సహజ లక్షణాలను పదిలంగా భద్రపరుస్తాయి.

సాధారణ శిలాజాల్లో, కేవలం ఎముకలు లేదా గట్టి భాగాలు మాత్రమే రాయిగా మారతాయి. కానీ అంబర్‌లో కీటకాల రెక్కలు, కేశాలు లేదా ఈకలులాంటి సున్నితమైన భాగాలు కూడా చక్కగా భద్రపరచబడతాయి.

**వివరాల సంరక్షణ:**

అంబర్, పురాతన జీవుల సూక్ష్మ వివరాలను వాటి రంగుతో సహా సంరక్షిస్తుంది. దీని వల్ల పరిశోధకులకు ఇవి చాలా ఉపయోగపడుతాయి. అంబర్ శిలాజాలు కొన్నిసార్లు ఒక క్షణకాలపు జీవనదృశ్యాలను (Snapshots) శాశ్వతం చేస్తాయి. ఉదాహరణకు, ఒక సాలెపురుగు తన గూడు అల్లుతుండగా, లేదా ఒక కీటకం ఒక పువ్వుపై వాలుతుండగా శిలాజంగా మారి ఉండవచ్చు. ఈ రకమైన ఆనవాళ్లు శిలాజాల రికార్డుల్లో చాలా అరుదుగా లభిస్తాయి,

**అరుదైన జీవుల లభ్యత:**

చెట్లజిగురులో చిక్కుకునే అవకాశం ఎక్కువగా ఉన్న చిన్నజీవులు అంబర్‌లో కనిపిస్తాయి. వీటిలో కీటకాలు, సాలె పురుగులు, పురుగులు, పుట్టగొడుగులు మరియు అప్పుడప్పుడు బల్లి, చిన్నపక్షిఈకలు వంటివి కూడా ఉంటాయి.

**జురాసిక్ పార్క్:**

అంబర్‌లో నిక్షేపితమైన జీవి, దానిచుట్టూ ఉన్న ఆక్సిజన్ రహిత వాతావరణం కారణంగా కుళ్ళిపోకుండా నిరోధించ బడుతుంది. అయినప్పటికీ, జురాసిక్ పార్క్ సినిమాలో చూపించినట్లుగా, అంబర్ శిలాజాలలో భద్రపరచబడిన డిఎన్ఏ కాలక్రమేణా క్షీణించిపోతుంది. కాబట్టి ఆ జీవులను క్లోనింగ్ చేయడం అసాధ్యం. అంబర్‌లో కొన్ని అరుదైన, ప్రత్యేకమైన శిలాజాలు లభించాయి.

**ప్రత్యేకమైన శిలాజాలు:**

సుమారు 99 మిలియన్ల సంవత్సరాలనాటి ఈకలతో కూడిన డైనోసార్ తోక ఒకటి మయన్మార్‌లో దొరికిన అంబర్‌లో కనుగొనబడింది. దీనివల్ల చాలా డైనోసార్లకు పక్షివలె ఈకలు ఉండేవని తెలిసింది. 99 మిలియన్ల సంవత్సరాల రెక్కలున్న ఒక పక్షిశిలాజం చాలా అద్భుతమైన వివరాలతో అంబర్‌లో లభించింది.

అంబర్‌లో దొరికిన అత్యంత అరుదైన జీవులలో చేపపిల్ల, అమ్మోనైట్లు ఉన్నాయి. ఇవి సముద్రపు జీవులు కాబట్టి, సముద్రానికి దగ్గరగా ఉన్న అడవిలో చెట్టుజిగురు వాటిపై పడి ఉంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.


100 మిలియన్ల సంవత్సరాల క్రితం ఒక సాలీడు కందిరీగపై దాడి చేస్తూ, రెండూ జిగురులో చిక్కుకుపోయాయి. ఈ శిలాజం సహజచరిత్రలోని ఒక నిర్దిష్టక్షణాన్ని అద్భుతంగా భద్రపరిచింది.

దాదాపు 35 మిలియన్ల సంవత్సరాల పురాతనమైన ఒక మాంసాహారమొక్క ఆకులు అంబర్‌లో కనుగొనబడ్డాయి. 20 మిలియన్ల సంవత్సరాల క్రితం, ఒక పేనులో ప్లేగువ్యాధికి సంబంధించిన ప్రాచీన బ్యాక్టీరియా లభించింది. డొమినికన్ అంబర్‌లో సుమారు 15–20 మిలియన్ల సంవత్సరాలనాటి అంతరించిపోయిన జాతికి చెందిన ఒక గెక్కోశిలాజం లభించింది. 100 మిలియన్ల సంవత్సరాల క్రితం, ఒక కీటకం తన గుడ్లను సంరక్షిస్తున్న దృశ్యం అంబర్‌లో లభించింది.

**అంబర్ లభ్యత:**

**బాల్టిక్ ప్రాంతం:**

ప్రపంచంలో లభించే అంబర్‌లో 90% వరకు ఈ ప్రాంతం నుండి వస్తుంది. రష్యా (కాలినింగ్రాడ్), పోలాండ్, లిథువేనియా, లాట్వియా మరియు ఎస్టోనియాలో దొరుకుతుంది



ఇది సుమారు 44-54 మిలియన్ సంవత్సరాలనాటిది, ఇందులో సుసినిక్ ఆమ్లం ఉంటుంది కాబట్టి సుసినిటైట్ అని అంటారు. దీనిలో అనేక రంగులు ఉంటాయి. పోలాండ్‌లోని గ్డాన్స్క్ "అంబర్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్"గా ప్రసిద్ధి చెందింది.

**డొమినికన్ రిపబ్లిక్:**

ఇక్కడ లభించే అంబర్ దాని అసాధారణ స్పష్టత మరియు అరుదైన నీలిరంగుకు ప్రసిద్ధి చెందింది. ఇది సుమారు 15-20 మిలియన్ సంవత్సరాల నాటిది. ఇందులో కీటకాల, ఇతరజీవుల శిలాజాలు ఉంటాయి.

**మయన్మార్ (బర్మా):**

ఇక్కడి అంబర్‌ను "బర్మైట్" అని అంటారు.

**భారత దేశం:**

గుజరాత్ రాష్ట్రంలో లిగ్నైట్ గనుల్లో అంబర్ దొరికింది.

**ఉపయోగాలు:**

అంబర్ లోని జీవుల అవశేషాలు పరిశోధనకోసం ఉపయోగ పడుతాయి. నగలు అలంకార సామాగ్రిలో ఉపయోగిస్తారు. ఆయుర్వేద ఔషధంగా దీనికి ఉపయోగాలు ఉన్నాయి. ఆధ్యాత్మిక ఉపయోగాలు కూడా ఉన్నాయి. అంబర్‌ను పరిమళ ద్రవ్యాల తయారీలో ఇంకా జ్వలనశీల పదార్థంగా ఉపయోగిస్తారు.

-చకిలం వేణుగోపాలరావు
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e: venugopal.chakilam1@gmail.com

- శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

**చందా వివరాలు :**

విడి ప్రతి : రూ.40
వార్షిక చందా : రూ.400
2 సం11లకు : రూ.750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందా చెల్లించవచ్చు.

**Account Details:**

Bank Name : Canara Bank
A/c No. : 30101010003714
BracnH : Ashoknaar, Hyderabad
IFSC Code : CNRB0013010



చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో, మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో 1990 మరియు 1991 సంవత్సరములలో వెలువడిన 'బాలచెలిమి' పిల్లల వికాస పత్రిక మంచి ఆదరణ పొందినది. బాలల్లో సృజనాత్మకతను పెంచి విజ్ఞాన వినోదాలను అందించాలన్న లక్ష్యంతో 'బాలచెలిమి' జనవరి 2024 ఆకర్షణీయమైన రంగులతో, ఎక్కువ (52) పేజీలతో పత్రికను పునరుద్ధరించామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

**మా చిరునామా :**

బాలచెలిమి
'చంద్రం' 3-6-712/2,
స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029,
తెలంగాణ.
Mobile : 9030626288
Email:
desk.chelimi@gmail.com
website :
www.balachelimi.com

# భాగ్యదాయిని బతుకమ్మ



**బ**తుకమ్మ పండుగ తెలంగాణ మహిళల గౌరవం, ఐక్యత, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా తొమ్మిది రోజులు పూలతో ఘనంగా జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఇంటిని పూలతో నింపి.. మహిళ గుండెల్లో గర్వాన్ని, ఆనందాన్ని కలిగించే పండుగ బతుకమ్మ. భాద్రపద మాసంలో మొదలై తొమ్మిది రోజుల పాటు సాగే ఈ వేడుక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. రంగురంగుల పూలను పేర్చి అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ స్త్రీలు వలయంగా తిరుగుతూ చప్పట్లు కొడుతూ పాటలు పాడుతారు. మహిళల ఆనందం, ఆధ్యాత్మికత, సాంస్కృతిక వైభవం కలిసిన ఈ పండుగను వెయ్యి ఏళ్ల నుంచే జరుపుకుంటున్నారని పండితులు చెబుతున్నారు.

బతుకమ్మ పండుగ భూమి, నీరు మరియు జీవుల మధ్య సంబంధాన్ని సూచించే పండుగ. బతుకమ్మల తయారీలో ఉపయోగించే పువ్వులు జలచరాల పెరుగుదలను సుసంపన్నం చేస్తాయి. అంతేకాకుండా, ఈ పువ్వులు నీటి వనరులను శుభ్రపరచడం మరియు రిఫ్రెష్ చేయడంలో, కాలుష్యాన్ని తగ్గించడంలో, ఎక్కువ నీటిని నిలుపుకోవడానికి సరస్సులు, చెరువులను బలోపేతం చేయడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. సహజ మంచినీరు తగ్గిపోయి అంతరించిపోతున్న కాలంలో, తెలంగాణ ప్రజలు దానిని సంరక్షించడానికి వారి స్వంత మార్గాన్ని కలిగి ఉన్నారు. ఇది నిజంగా తెలంగాణ ప్రజలు గర్వించే విషయం. కాలుష్యం నుండి నీటిని ఆదా చేసే ప్రక్రియను వారు స్వాభావికంగా తెలుసుకుంటారు. దానిని ఆనందదాయకంగా చేస్తారు.

బతుకమ్మ పండుగ తెలంగాణకు అస్తిత్వ చిహ్నంగా మారింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పండుగ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర పండుగగా అధికారిక గుర్తింపు పొంది అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. ఒకప్పుడు గ్రామాల్లో మహిళలతో ప్రారంభమైన ఈ వేడుక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ప్రజలు ఉన్న ప్రతి చోటా ఘనంగా నిర్వహిస్తున్నారు.

**బతుకమ్మ పండుగ విధానము**

తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పండుగను జరుపుకుంటారు. ప్రతి రోజు ప్రత్యేక నైవేద్యం చేసి గౌరీ దేవికి సమర్పిస్తారు.

మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ,

రెండో రోజు అటుకుల బతుకమ్మ,

మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ,

నాలుగో రోజు నాన బియ్యం బతుకమ్మ,

ఐదో రోజు అట్ల బతుకమ్మ,

ఆరో రోజు అలిగిన బతుకమ్మ,

ఏడో రోజు వేపకాయల బతుకమ్మ,

ఎనిమిదో రోజు వెన్న ముద్ద బతుకమ్మ,

తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ జరుపుకుంటారు.

ఎనిమిది రోజులు ప్రత్యేక నైవేద్యాలు చేస్తారు.

కానీ అలిగిన బతుకమ్మ రోజు మాత్రం ఎటువంటి సంబరాలు జరగవు. నైవేద్యం పెట్టరు. ఎందుకంటే ఆరోజు అమ్మవారు అలిగారని నమ్ముతారు.

– ఎసికె. శ్రీహరి

m : 9849930145

e : ackvs08@gmail.com

# "స్వంత కథ"

(గత సంచిక తరువాయి

ఒక హైద్రాబాదీగా, భూమి పుత్రుడిగా హైద్రాబాద్ చరిత్రపై రచనలు చేయాలని నిర్ణయించుకున్నాను. ఫలితంగా 2006లో "షహర్‌నామా" (హైద్రాబాద్ వీధులు - గాథలు) పుస్తకం వచ్చింది. నగర వీధుల పేర్ల వెనుక చరిత్ర, బస్తీలు, అప్పటి మనుషుల గురించి "కథలు, కథలుగా" కథలల్లినాను. ఇది రెండు ముద్రణలకు నోచుకుంది. పుస్తకం కంటె ముందు వారం వారం సీరియల్‌గా 25 వారాల పాటు నమస్తే తెలంగాణా దినపత్రిక ఆదివారం సంచికలో ప్రచురించబడి పాఠకుల మన్ననలను పొందింది.



ఆ తర్వాత "హైద్రాబాద్ జన జీవితంలో ఉర్దూ సామెతలు" పుస్తకం వచ్చింది. ఒకప్పుడు చెలామణీలో ఉండి ఇప్పుడు మరచిపోయిన ఉర్దూ సామెతలను మళ్లీ గుర్తుచేసినట్లయ్యింది. లడ్డూల మధ్యన కిస్‌మిస్‌ల లాగా తెలుగుభాష మాట్లాడుతూనే మధ్యమధ్యన ఉర్దూ సామెతలను వాడటం తెలంగాణీయుల సంస్కృతి.

2007లో "ప్రపంచ పాదయాత్రికుడు" అనే వ్యక్తిచిత్రాల వ్యాసాలను పునరుద్ధరించి, మరికొన్ని చేర్పులతో ముద్రించాను. కొన్ని స్వంత కథలు, మరికొన్ని అనువాద కథలు (ఇంగ్లీష్ నుండి) వివిధ పత్రికలలో వచ్చినవి అన్నీ కలిపి "ఒక హిజ్రా కథ' అన్న పేరుతో అనువాద కథలని 2007లో ప్రచురించటం జరిగింది. అనువాద కథలన్నీ ఒరిజినల్ కథల్లాగ ఉన్నాయని పాఠకుల పశంసలను పొందాను.

2008లో "1857 హైద్రాబాదు తిరుగుబాటు గాథలను" ప్రచురించాను. ఇవన్నీ గత చరిత్ర నుండి తీసుకుని "సువర్ణానికి సుగంధంలా" నా కల్పనా శక్తిని జోడించాను. 1857 విప్లవం 150 సం॥లు పూర్తయిన సందర్భంగా కోఠీలోని ఆ అమరవీరుల స్థూపం వద్ద ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి వారికే అంకితమివ్వటం ఒక మరుపురాని మధురఘట్టం.

2009 జూన్ 30న నేను ఎదిరి చూసిన నా పదవీ విరమణ తేదీ. "మనిషి స్వేచ్ఛగా జన్మించాడు కాని ప్రతిచోటా సంకెళ్లలో బంధింపబడి ఉన్నాడు" అన్న రూసో కొటేషన్‌ను నేను నమ్మినందున పదవీ విరమణ నాకు చాలా సంతోషకరమైన దినం. అంతకు 3 నెలల ముందే ఒక మిత్రుడితో కలిసి నా స్కూటర్‌పై 12 రోజులు చత్తీస్‌ఘడ్ దండకారణ్య పర్యటనకు వెళ్లాను. జన సంచారం లేని, సిమెంటు రహదారులు లేని అరణ్యాలలో ప్రకృతిని, గిరిజన ప్రదేశాలను చూసి రావాలని మా లక్ష్యం. ఖర్చుకు బెదరక బోలెడన్ని రంగుల ఫోటోలతో "చత్తీస్‌ఘడ్ స్కూటర్ యాత్ర" పుస్తకాన్ని 2009లో ప్రచురించాను. ఇది నా మొదటి యాత్రా సాహిత్య గ్రంథం. ఇది పాఠకులకు ఎంతగా నచ్చిందంటే ఐదు ముద్రణలు పొందింది. నాకు, యాత్రా రచయితగా పేరును సంపాదించి పెట్టింది.

2010-12 రెండు సంవత్సరాల కాలంలో ఒక వైపు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం చురుకుగా పనిచేస్తునే "ఎవరిదీ హైద్రాబాదు?" తెలంగాణా వ్యాసాలు, 1948 పోలీస్ యాక్షన్ (నిజాంపై నిప్పులు కురిపించిన విప్లవ వీరులు) మొదలగు పుస్తకాలు ప్రచురించాను. ఒక సామాజిక శాస్త్ర అధ్యయన విద్యార్థిగా ప్రతి వ్యాసం కొత్త కోణాలతో రాసి ఉద్యమ ఔన్నత్యాన్ని పెంచాను.

ముందే చెప్పినట్లుగా నా పదహారు సంవత్సరాల వయస్సులో తెన్నేటి సూరి నవల "చంఘీజ్‌ఖాన్" చదివి ఎప్పుడో ఒకప్పుడు గోబీ ఎడారి సందర్శించాలని నిర్ణయించుకున్నాను. ఆ తర్వాత నేను చదివిన రష్యన్ సాహిత్యం, చైనీస్ సాహిత్యం, ముఖ్యంగా చెంఘీజ్ ఐత్ మాతోవ్ నవలలు నన్ను కలల ప్రపంచంలోకి నెట్టివేసాయి. తర్వాత్తర్వాత చరిత్ర, రాజకీయ పుస్తకాలు నాకు "సిల్కురూట్"ను పరిచయం చేసాయి. సిల్కురూట్‌కు సంబంధించిన ఇంగ్లీష్ యాత్రాసాహిత్యం నా యాత్రా కాంక్షను పెంచి పోషించాయి.

2009లో పదవీ విరమణ తర్వాత సిల్కురూట్ యాత్రకు కాలు కదిపాను. టూరిస్టుగా కాదు ట్రావెలర్‌గా, అంటే సాధారణ యాత్రికుడిగా. మార్కోపోలో, షాహియాన్, హ్యుయాన్‌త్సంగ్, ఇబాన్‌బటూటా, రాహుల్ సాంకృత్యాయన్, సంజీవ్‌దేవ్‌లు నాకు ఆదర్శమూర్తులు. అప్పుడు నా వయస్సు 62 సం॥లు దేశం కాని దేశాలు. మూడు మధ్యాసియా దేశాలు, నాల్గవది చైనా. తాష్కెంటు నుండి బీజింగ్ వరకు "సిల్కురూట్" దారులలో నా ప్రయాణం. బాషలు పెద్ద అడ్డంకి. ఆ దేశాల వారికి ఇంగ్లీష్ రాదు. తిండి, గిండి మనది కాదు. బస విషయంలో ఎటువంటి ముందస్తు ప్లాను లేదు. "మంజిల్ కహాఀ కహాఀ రుఖ్‌నాహై, ఊపర్ వాలా జానే" పాటలాగే నా పరిస్థితి. పదవీ విరమణ వల్ల వచ్చిన మూడున్నర లక్షలు మూటకట్టుకుని, రెండు నెలల ప్రయాణానికి నడుం కట్టాను. నా అర్ధాంగి శోభ అనుమతి అడిగాను. "వెళ్లు నీ చిరకాల కలను నెరవేర్చుకో" అని ప్రోత్సహ మిచ్చింది. మా కొడుకు ఇంకా విద్యార్థిగానే ఉన్నాడు. నా నెత్తిమీది బాధ్యతలన్నీ ఆమె నెత్తిమీదికి నెట్టివేసి యాత్రకు సిద్ధమయ్యాను. సంజీవ్‌దేవ్ మాట నాకు నిత్య స్మరణీయమైంది "సాహసం సమక్షంలో మృత్యువు ఒక లెక్కకాదు", మా పూర్వీకుల సంచార తత్వం, సంచార రక్తం, నా జ్ఞాన పిపాస నన్ను ముందుకు నడిపించాయి.

అపూర్వమైన నా అనుభవాల నన్నింటిని గ్రంధస్తం చేసాను. దాని పేరు "సిల్కురూట్‌లో సాహస యాత్ర". ఇంటికి తిరిగి వస్తానన్న నమ్మకం నాకు లేనపుడు, అక్కడ ఏదైనా జరిగితే ఇంటికి నా శవం కూడా వస్తదన్న నమ్మకం లేని పరిస్థితులలో, తెగించి బౌద్ధమత ప్రచారానికి మన దేశం నుండి చైనాకు వెళ్లిన బౌద్ధభిక్షువులలాగా

నేను సంచారానికి వెళ్లటం సాహసం కాదా? ఆ పేరు పెట్టటం సమంజసం కాదా? విజ్ఞులైన పాఠకులే నిర్ణయించాలి. 2012లో ఆ పుస్తకం వెలుగులోకి వచ్చి వందలాది మంది అభిమానులను నాకు సంపాదించి పెట్టింది. వారి ప్రశంసలే నాకు అవార్డులు, రివార్డులుగా మారాయి. ఆ పుస్తకం అనేక పునర్ముద్రణలను పొందింది.

2014లో సతీసమేతంగా యూరపుదేశాల పర్యటన, ఆ తర్వాత ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలు కూడా చేసాము. 2016లో మేమిద్దరం చేసిన నల్లమల, ఎర్రమల ప్రాంతాల పర్యటన విశేషాలతో యాత్రా గ్రంథాల రచన చేసాను. అవి కూడా పాఠకుల ప్రశంసలను పొందాయి.

"దక్కన్ ల్యాండ్" మాసపత్రికలో నెలనెలా "చార్మినార్ కథలు" రాసాను. అవన్నీ అదే పేరుతో పుస్తకంగా 2023లో వచ్చింది. డెబ్బై సంవత్సరాల క్రిందటి పాత హైద్రాబాదును, అప్పటి మనుషులను, వారి జీవితాలను యాస భాషలను, ఆ "గంగాజమునా తెహజీబ్"ను ఆ కథలలో చిత్రించాను. ఏది రాసినా నా ఆత్మ పాత హైద్రాబాద్ చుట్టే తిరుగుతుంది కావున ఒక భూమిపుత్రుడిగా ఎంతోకొంత పాత నగరం రుణం తీర్చుకున్నానని భావిస్తున్నాను.

ప్రస్తుతం అదే మాస పత్రికలో నెలనెలా "శాలిబండ కథలను" రాస్తున్నాను. రచన అంటే నన్ను నేను ఆవిష్కరించుకోవటమే కదా! నా ఆత్మకు ప్రతిబింబమే కదా!!

**డాక్టర్ మన్మోహన్‌సింగ్‌ను "ఆక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్" అంటారు. నేను కూడా యాదృచ్ఛికంగా రచయితను అయ్యాను.**

సమకాలీన కాలంలో ఇతర రచయితలు, కవులు చేయలేని మరో పని చేసి "అది" సాధ్యమే అని నిరూపించాను. నా పుస్తకాలను నేనే నా డబ్బులతో ప్రచురించి ఎక్కడ పుస్తక ప్రదర్శనలు, సభలు జరిగినా అక్కడికి వెళ్లి నేనే స్వయంగా నిలబడి అమ్మటం. ఈ పని వెనుక నాకు స్ఫూర్తినిచ్చింది గతంలో నడిచిన గ్రంథాలయోద్యమం. వట్టికోట ఆళ్వారుస్వామి నాకు ఆదర్శం. చాలా మంది కవి మిత్రులు చాలా కష్టపడి స్వంత ఖర్చులతో తమ కవిత్వ పుస్తకాలను అచ్చేసి కలిసిన ప్రతి వారికి ఉచితంగా ప్రసాదం లాగా పంచి పెట్టటం, ఉచితంగా పుచ్చుకున్న వారు వాటిని చదవక పోవటం నాకు బాగా తెలుసు. నిజమైన సాహిత్యాభిమానులు, పాఠకులు తప్పకుండా కొని చదువుతారని కూడా గమనించాను. వారే పుస్తకాలను గుర్తించి, గౌరవిస్తారు. నేనెప్పుడూ "ఏటికి ఎదురీదే రకం" కావున వరుసగా ఆరేడు సంవత్సరాలు ఎక్కడ సభలు జరిగినా, పుస్తక ప్రదర్శనలు జరిగినా ఒంటరిగానే వెళ్లి "దుకాణాలు" తెరిచాను. ఈ పనిని ముందు కొంత మంది రచయితలు, కవులు గౌరవమైన పని కాదని విడ్డూరంగా చూసినా, భావించినా తర్వాత కొంతమంది నా దారిని అనుసరించారు. అటువంటి వారిని నేను మనసారా ప్రోత్సహించాను. నా వరకు నాకు పుస్తకాల ప్రచురణపై నేను పెట్టిన పెట్టుబడీ రావటమే గాక ఇంకా కొన్ని రూకలు నా జేబులోకి అదనంగా వచ్చాయి, మళ్లీ కొత్త పుస్తకాలు వేసుకోవటానికి. ఇంతేగాక ప్రతి పుస్తక ప్రదర్శనలో నా అభిమానులు నన్ను కలుసుకుని నా రచనలను మెచ్చుకోవటంతో "కుంటివానికి ఏనుగు ఎక్కినంత సంతోషం" నాకు దక్కింది. ఆ రోజుల్లో ఆంధ్రజ్యోతి దినపత్రిక "వివిధ"లో నా అనుభవాలను తెలుపుతూ వివరంగా ఒక వ్యాసం కూడా రాసాను. పుస్తకాల విక్రయ విషయంలో నేనొక "ట్రెండ్ సెట్టర్"గా మారినందున నన్ను చూసి మరికొంతమంది మిత్రులు నా పద్ధతిని అనుసరించారు.

పుస్తకాలను అందరూ చదువుతారు కాని చదివిన అక్షరాల వెంబడి ప్రయాణించి ఆయా ప్రాంతాలను, విశేషాలను సందర్శించటం కొంతమంది మాత్రమే చేస్తారు. అక్షరాల వెంబడి ప్రయాణించే యాత్రికుడిని నేను. రాహుల్ సాంకృత్యాయన్‌కు ఏకలవ్య శిష్యుడిగా డార్జిలింగ్‌లోని ఆయన సమాధిని, చెంఘీజ్ ఐత్‌మాతోవ్ అభిమానిగా కిర్గీజ్‌స్థాన్ రాజధాని, బిష్కెక్‌లోని ఆయన సమాధిని, చైర్మన్ మావో అభిమానిగా బీజింగ్‌లోని ఆయన మసోలియంను సురపురంలో మెడాన్ టేలర్ బంగళాన్ని, రాజా వెంకటప్ప నాయక్ కోటను, హిమాలయాలలో నివసించే యోగి స్వామీ సుందరానంద్‌ను, చత్తీస్‌ఘడ్‌లో కార్మిక నాయకుడు శంకర్ గుహ నియోగీ సమాధిని, దేశ చరిత్ర గతిని మార్చిన నక్సల్‌బరీ గ్రామన్ని సందర్శిచటం నా సంచార జిజ్ఞాసకు కొన్ని ఉదాహరణలు. "జ్ఞాని లోకసంచారి" అన్న సూత్రాన్ని నమ్ముతాను. వేదాలలోని "చరైవేతి చరైవేతి" ఆదర్శాన్ని ఆచరిస్తాను.

డాక్టర్ మన్మోహన్‌సింగ్‌ను "ఆక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్" అంటారు. నేను కూడా యాదృచ్ఛికంగా యాభై సంవత్సరాలకు పెన్ను పట్టి అనుకోకుండా నా జీవితంలోని ఖాళీలను పూరించుకోవటానికి రచయితను అయ్యాను. ఉద్దేశపూర్వకంగా కాదు. "కాలం కత్తుల వంతెన" మీద ప్రయాణిస్తూంటే ఏవేవో తెలియని చోదకశక్తులు నాచే పెన్నును పట్టించాయి. అంతా యాదృచ్ఛికం. అసలు జీవితమే యాదృచ్ఛిక సంఘటనల సమాహారం కదా!

అవార్డులకు, రివార్డులకు, సన్మానాలకూ, సత్కారాలకు ఎదురు చూసింది ఎప్పుడూ లేదు. అయినా కాకతాళీయంగానే "సలాం హైద్రాబాద్" నవలకు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం దాని రెండవ భాగమైన నవల "కల్లోల కలల కాలానికి" తెలంగాణా సారస్వత పరిషత్తు వారి పురస్కారం లభించింది.

యువ రచయితలకు ప్రత్యేకంగా చెప్పేదేమీలేదు. ఎక్కువగా చదివి తక్కువగా రాయాలి. మన జీవితాన్ని మనమే అనేక ప్రయోగాలకు గురిచేయాలి. Experiments with Truth అన్నమాట. ఒక్క జీవితంలో అనేక జీవితాల అనుభవాలను పొందాలి. "జన్మమెత్తితిరా అనుభవించితిరా" అన్నట్లు జీవించాలి. కష్టాల కొలిమిలో కాలి బూడిదై నూతన మానవుడిగా అగ్ని పునీత సీతలాగా కొత్త జన్మఎత్తి కలం పడితే ఆ రచన పుటం పెట్టిన బంగారంలా ధగధగలాడుతుంది. జీవితం "నిలువనీరులా" ఒకే చోట స్థిరంగా గుంట్రాయిలా, గుదిబండలా ఉండకుండా ఈ స్థావర జంగమాత్మక ప్రపంచంలో నిరంతరం సంచరిస్తూ ఉండాలి. ఈ అండపిండ బ్రహ్మాండ విశ్వంలో ప్రతిదీ చలిస్తూనే ఉంది. సంచరిస్తూనే ఉంది. ప్రకృతిలోని గాలి, నీరు, నింగీ, నేలా, చెట్టూ, పుట్టా అన్నీ "గతితర్కం" సూత్రానుసారం పరిభ్రమిస్తూనే ఉన్నాయి. మనిషి కూడా అంతే.

"చల్ నా జీవన్ కీ కహానీ,
రుఖ్‌నా మౌత్ కీ నిశానీ"

నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు తెలంగాణా సారస్వత పరిషత్తువారికి కృతజ్ఞతలు. వందనాలు.


**–పరవస్తు లోకేశ్వర్,** m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

# అరుదైన ఆలయ పునాదులు

## (ఇదొక ఇంజనీరింగ్ అద్భుతం)

బాదామీ చాళుక్యుల కాలంలో, ఇప్పటి జోగులాంబ-గద్వాల జిల్లాలో, కృష్ణానది, తుంగభద్రానదితో కలిసే కూడలి సంగమేశ్వరంలో, దేవాలయ పునాదులకు సంబంధించి మనదేశంలోనే అరుదైన ఆధారాలు వెలుగుచూశాయి. అలంపూర్‌లోని నవబ్రహ్మేశ్వరాలయాల మాదిరిగనే సంగమేశ్వరాలయం, రేఖానాగర ప్రాసాదశైలిలో నిర్మించబడింది. గర్భాలయం, అర్ధమండపం, మహామండపం, అన్ని కట్టడభాగాలపైన అనేక దేవతామూర్తుల శిల్పాలు సా.శ.7-8 శతాబ్దాల నాటి బాదామీ చాళుక్య ఆలయ వాస్తుశిల్పానికి అద్దం పడుతున్నాయి.

నదికి ఆ వైపు నుంచి తెచ్చిన ఎర్రఇసుక రాతితో నిర్మించిన కూడలి సంగమేశ్వరాలయం, శ్రీశైల జలాశయ ముంపుకు గురైంది. అద్భుత శిల్పకళాఖండాలున్న ఈ ఆలయాన్ని భావితరాలకు అందించటానికి, కేంద్రపురావస్తుశాఖ, ఈ ఆలయాన్ని ఊడదీసి 18 కి.మీ. దూరంలో నున్న అలంపూర్‌కు తరలించి యధాతథంగా పునర్నిర్మించింది. ఇదొక అద్భుత చారిత్రక ఘట్టం.




15 మీ. ఎత్తుగల విమానం (కప్పు పైనున్న కట్టడం), ఇంకా ఆలయ అధిష్ఠానం, గోడలు, కప్పు రాళ్ల బరువు నంతటినీ తట్టుకొనేలా, భూమట్టం నుంచి కిందికి 10 మీటర్ల లోతు పునాది గుంటను తవ్వి, అడుగున సంప్రదాయ బద్ధంగా, పుట్టమట్టితో నింపి, దిమ్మెసకొట్టి, దానిపై రాళ్లు, పైన మళ్లీ పుట్టమట్టి, రాళ్లతో 7 మీటర్ల ఎత్తు వరకూ నింపారు.

భూమట్టం నుంచి కిందికి 10 మీ. పునాదులను ఏర్పాటు చేయటం మనదేశ ఆలయాల చరిత్రలో వెలువడిన తొలి ఆధారం. ఈ ఘట్టం తెలంగాణకే కాదు, మొత్తం తెలుగునేలకే గర్వకారణం. ఆలయ నిర్మాణ కౌశలంలో ఇదొక మైలురాయి.

(డా. ఐ.కె. శర్మగారికి ధన్యవాదాలతో..)

-ఈమని శివనాగిరెడ్డి-స్థపతి,
m : 9848598446
e : nagireddy@malaxmi.in

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

## దుర్గమ్మ ఆకాశలక్ష్మిగా.. బతుకమ్మ భూదేవిగా

# చెడుపై మంచి గెలిచిన రోజు

దేశమంతటా వైభవంగా జరిగే తొమ్మిదిరోజుల వేడుకలను దేవీనవరాత్రులనీ, శరదృతువులో వస్తాయి. కనుక శరన్నవరాత్రులనీ అంటారు. మన దగ్గర మరింత వైవిధ్యంగా ఉంటాయివి. అంటే ఒకవైపు అమ్మవారి ఆరాధనలు, మరోవైపు బతుకమ్మ సంబురాలు. దుర్గామాతది- మార్మికపథం. బతుకమ్మది- పూలరథం. లలితా సహస్రంలోని 'ప్రాణదా' అనే నామానికి బతుకునిచ్చేది, జీవం పోసేదని అర్థం. 'బతుకు-బతకనివ్వు' అనేది బతుకమ్మ సందేశం. పండుగలనేవి మనుషుల్ని కలపడం కోసమే! 'భూసతికిం (భూదేవికి) దివంబునకు (స్వర్గలోకానికి) పొల్పు ఎసగంగ శరత్ సమాగమంబు ఆసకల ప్రమోదకరమై విలసిల్లె... శరదృతువు కలయిక ఎల్లెడలా ఆనందాన్ని నింపుతుంది' అన్నాడు నన్నయ.



దుర్గమ్మను ఆకాశలక్ష్మిగా, బతుకమ్మను భూదేవిగా భావన చేస్తే- శరత్ సమాగమం అంటే ఏంటో అర్థమవుతుంది. అపురూప సమైక్య జీవన సరాగ మాలిక గుండెల్లో వెన్నెల పూయిస్తోంది. 'సర్వేజనాః సుఖినోభవన్తు' అనే వైదిక ఆకాంక్షలోను, 'అమ్మల అవ్వల చేయుచు కాయుచు, బిడ్డల తల్లుల చేయుచు సాకుచు బతకమ్మా! బ్రతుకు' అనే కవి కాళోజీ కాంక్షలోను స్రవించేది ఒకే జీవధారగా గుర్తించాలంటే ఆ వెన్నెల వికాసం మనకో అవకాశం.

నేడు విజయదశమి! 'అనిమిషారాతి (మహిషాసురుడు) విల్లెత్త- నగజ(దుర్గ) త్రుంచె, శూలమెత్తిన- ఖండించె నీలవేణి' అంటూ కాశీఖండంలో శ్రీనాథుడు మహిషాసురమర్దిని పరాక్రమ వైభవాన్ని పలువిధాల వర్ణించాడు. 'అభీల ఖడ్గ విద్యా కుశలత్వంబు మెరయ రాక్షసకోటి నరకి నరకి'న అమ్మ రాక్షస సంహారక్రీడా నైపుణ్యాన్ని మారనకవి చెప్పాడు. తొమ్మిది రోజులుగా దుర్గాదేవి దుష్టశిక్షణ పూర్తిచేసి విజయోత్సాహంతో వేడుక జరుపుకొనే పదోరోజు విజయదశమి అయ్యింది. నిజానికీ పురాణ గాథలన్నీ ప్రతీకాత్మకాలు. 'నరకుడనువాడు ఎక్కడో నక్కి లేడు' అన్నట్లుగా ఈ రక్కసి మూకలన్నీ మన మధ్యనే సంచరిస్తుంటాయి. దైవాన్ని అమ్మరూపంలో ఆరాధించే మన సమాజంలో ఆడబిడ్డలపై కామాంధుల రూపాల్లో హత్యాచారాలకు సైతం తెగబడే మూకలన్నీ రాక్షస సంతతికి చెందినవే. అంటే ఆ అసురుల ఆకారాలే తప్ప స్వభావాలు మారనేలేదు. స్త్రీలు దుర్గామాతలై వారి బారినుంచి, చెరనుంచి రక్షణ పొందగల రోజులు వస్తే- అది నిజమైన విజయదశమి!

తెలంగాణలో ఈ తొమ్మిది రోజులు అమావాస్య నుంచి నవమి వరకు బతుకమ్మ ఆడుతారు. విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణునిపై గెలిచిన సందర్భమే కాక... పాండవులు అజ్ఞాత వాసం ముగిసిన తర్వాత జమ్మి చెట్టు మీద నుంచి తమ ఆయుధాలు తీసుకున్నరోజు కూడా! ఈ సందర్భంగా 'రావణ వధ', జమ్మి ఆకుల పూజ వంటివి చేయటం ఆచారం. జగన్మాత అయిన దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసునితో తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి అతనిని వధించి విజయాన్ని పొందినందుకు 10వ రోజు ప్రజలంతా సంతోషంతో పండగ జరుపుకొంటారు.


తెలంగాణలో పాలపిట్టను చూసిన తర్వాత జమ్మి చెట్టు వద్దకు పోయి పూజలు చేసి జమ్మి ఆకులు (బంగారం) పెద్ద వాళ్లకు ఇస్తూ వారి దీవెనలు తీసుకుంటారు. ఒకరినొకరు 'అలాయ్ బలాయ్' చేసుకుంటూ మురిసిపోతుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణలో దసరా ఒక మహోన్నతమైన పర్వదినం.

- కె. సత్యప్రసన్న,
e:desk.deccan@gmail.com

DECCAN
దక్కన్
CHANNEL

# పర్యావరణ సామ్యవాదం!

మానవులు జీవనచక్రాన్ని విచ్ఛిన్న పరచుకున్నారు. ఈ విచ్ఛిన్నం వారి దైవిక అవసరాల కోసం జరిగింది కాదు. ప్రకృతిని జయించుకునేందుకు వారు ఏర్పరచుకున్న సామాజిక సంస్థ వల్ల జరిగింది. సంపదను పెంపొందించుకోవటం కోసం చాలా వాటిని అతిక్రమించారు. గౌరవించాల్సిన వాటిని గౌరవించలేదు. పాటించవలసిన వాటిని పట్టించుకోలేదు. ఫలితంగా ఒక వైషమ్యం ఏర్పడింది. ప్రకృతి నియమాలను దాటి ప్రవర్తించడం వల్ల ఇటువంటి వైషమ్యం పుడుతుంది. కాబట్టే పర్యావరణ సంక్షోభం. ఈ సంక్షోభం ప్రకృతి, పర్యావరణాలకే కాదు. అంతిమంగా అది మానవ మనుగడ కోసం జరుగుతున్న సంక్షోభం. ఏ జీవన చక్రాన్ని మనిషి విధ్వంసం చేశాడో ఇప్పుడు తిరిగి దానిని ఏర్పచుకోవాలి. ఆ జీవన చక్రం బ్రద్ధలైంది.




ఈ భూమండలాన్ని ఇంతగా దుస్థితికి తెచ్చిన ఖ్యాతి అంతిమంగా పెట్టుబడికే దక్కుతుంది. పెట్టుబడి మనలను మనుషులుగా కాకుండా వినియోగదారులుగా చూస్తుంది. పెట్టుబడి దృష్టిలో భూమాతకు వేరే ఉనికి లేదు. అదొక ఖనిజాల పుట్ట. ముడి ఖనిజాల గుట్ట. నిజానికి ప్రపంచంలో ఇన్ని రకాల అసమతుల్యతలకు కారణం కాపిటలిజమే. పెట్టుబడి సౌఖ్యాలను ఉద్భవింపజేస్తుంది. ఆ సౌఖ్యాల పట్ల ఆకర్షణను పెంచుతుంది. అది అందివజూపే సుఖ, సౌఖ్యాల సకల సౌకర్యాలకు మానవులను బానిసలను చేస్తుంది. పైగా అది ఆడంబరాలను కూడా నేర్పుతుంది. అది తక్కువ మంది సౌఖ్యాల కొరకు ఎక్కువమందిని అన్న వస్త్రాలు, కనీస సౌకర్యాలు కూడా లేని వారిగా మిగులుస్తుంది. దుబారాను పెంచిపోషిస్తుంది. ఒకవైపు మిలియన్ల కొద్దీ ప్రజలు ఆకలికై అలమటిస్తుంటే, అల్పసంఖ్యాకులను భోగవంతులుగా మారమని ప్రలోభపెడుతుంది.

పెట్టుబడిదారీ వాదం చేతిలో ప్రతిదీ సరుకే. క్రయ, విక్రయ చర్యల మధ్య దాని జిహ్వ లాభాన్ని మాత్రమే కోరుతుంది. అది నీటిని, గాలిని, నేలను అమ్ముతుంది. వారసత్వ, ప్రాచీన సంస్కృతులను, న్యాయాన్ని, నైతికతను, చావును కూడా సరుకుగానే ప్రమోట్ చేస్తుంది. అంటే ప్రతి దానినీ పెట్టుబడి అధీనంలోకి తేగలదు. అమ్మేయగలదు. చివరకు 'వాతావరణ మార్పు' అంశాన్ని కూడా వ్యాపారంగా మార్చివేసిందనే విమర్శకూడా ఉంది. ఇయాన్ యాంగస్ తన 'రెడ్డర్ షేడ్ ఆఫ్ గ్రీన్' అన్న రచనలో కటువుగానే విమర్శకు పెట్టాడు ఈ ధోరణిని.

అయితే తన వాదన ఏమంటే 'వాతావరణ మార్పు' అనేది సమస్త మానవాళిముందు రెండు గొప్ప అవకాశాలను పెట్టింది. ఒకటి కాపిటలిజం నడిచిన మార్గంలో, మృత్యుదారిలో కొనసాగుతూ ఉండటం ఒకటైతే, రెండవది జీవితం పట్ల గౌరవాన్ని కలిగి ఉండి ప్రకృతితో సామరస్యపూర్వక దారిలో నడిచేందుకు సమాయత్తం కావటం. ఈ రెంటిలో ఏది ఎంచుకోవాలనేది వ్యక్తుల పర్యావరణ స్పృహ, చైతన్యాలతో పాటుగా భవిష్యత్తుపట్ల ఎటువంటి ఎరుకను బాధ్యతను మనం కలిగి ఉంటామనే దానిపై ఆధారపడి ఉంటుంది.

వాస్తవానికి అర్ధశతాబ్దం క్రిందటే బ్యారీ కామనర్ తన రచనల్లో ఈ అంశం చర్చించాడు. సోషలిజం, సైన్స్‌లు సంయుక్త ప్రయాణం చేయాల్సిన అవసరం ఉందని ప్రతిపాదించాడు. ఏ శాస్త్ర రచనల వెలుగులైనా పెట్టుబడి స్వాధీనంలో ఉండి పోతాయి. విశ్వశ్రేయస్సు లోకకల్యాణం లాంటివి గానీ, బహుజన సంక్షేమంకానీ పెట్టుబడికి పట్టని విషయాలు. మానవ సమాజాలకు మిగిలిన ప్రాకృతిక వ్యవస్థలకూ మధ్య సాధారణ జీవక్రియ విషయంగా పెరుగుతూ వస్తున్న అంతరాన్ని కామనర్ గుర్తించాడు. ఒక హెచ్చరిక కూడా చేశాడు. 'వర్తమాన ఉత్పత్తి విధాన వ్యవస్థ ఆత్మవిధ్వంసకం' అన్నాడు. అంతే కాకుండా 'మానవ నాగరికతా వికాస క్రమం ఆత్మాహత్యా సదృశ్యం' అని వ్యాఖ్యానించాడు.

పరిమిత వనరులకు, అనంత లాభాపేక్షగల పెట్టుబడికి మధ్యగల నిరవధిక ఘర్షణతోనే ప్రపంచం నడుస్తున్నది. భూమిని ఎంతగా మనం అఖండమైనదనుకున్నా, అది పరిమితమైనదే. వాతావరణం, సముద్రాలు, అరణ్యాలు ఎంత విశాలమైనవని మనం భావించినా అవీ పరిమితమైనవే. పెట్టుబడి మనం కలిగి ఉన్న పరిమిత వనరులపై వత్తిడిని పెంచుతున్నది. మనం ఎంతగా కోరుకున్నప్పటికీ భూమికి గల పునరుత్పాదక సామర్థ్యం మన కోరికల మేరకు పెరగదు. ప్రజలు ఎంతగా వనరులు వృధాకు పాల్పడుతున్నారో, ఆ వేగానికి తగినట్లుగా వృధాను వనరుగా మార్చే శక్తి భూమికి క్షీణిస్తున్నది. వృదా అవుతున్న వేగానికి సరిసమానంగా వ్యర్థాలు వనరులుగా మారే ప్రక్రియా వేగం తక్కువవుతున్నదని

శాస్త్రవేత్తలు పలు నివేదికలు ఘోషిస్తున్నాయి.

ఇలా ఉంటే 20వ శతాబ్దపు ఆర్థికవేత్తలు, ముఖ్యంగా అభివృద్ధిని విశ్వసించిన అర్థశాస్త్రవేత్తలు ఆర్థిక కార్యకలాపాలను విస్తృతపరచటం ద్వారా పేదరిక నిర్మూలన జరిగిపోతుందని భావించారు. దానినే ప్రోత్సహించారు. ఇక జీవ శాస్త్రవేత్తలు జీవన ప్రమాణాలను పెంచడం ద్వారా సాంక్రమిక వ్యాధులను నిర్మూలించగలమనే అచంచల విశ్వాసం కనబరిచారు. తీరా యిప్పుడు పునరాలోచిస్తే ఈ రెండు శిబిరాలూ తప్పేనని తేలుతుంది. ఎందుకంటే మన మధ్య యింకా ఆకలి, దారిద్ర్యం, క్షామం, కరువు, కాటకాలు తాండవం చేస్తున్నాయి. 20 శతాబ్దం ఉత్తరార్థం నుంచి మలేరియా, కలరా, ఎయిడ్స్ లాంటి వ్యాధులూ ప్రబలాయి. భయంకరమైన వ్యాధులను వైరస్‌లు, ఇతర సూక్ష్మజీవులు కలుగజేస్తున్నాయి. అంటే దీనర్థం పెట్టుబడిదారీవాదం అటు పేదరికాన్ని అంతం చేయటంలో కానీ, ఇటు వ్యాధులను నిర్మూలనపరచటంలోగానీ అశక్తమైందని తెలుస్తున్నది. ఆర్థికాభివృద్ధి ఒక్కటే సకల సమస్యలను పరిష్కరించదు. సమతూకంతో కూడిన సుస్థిరాభివృద్ధికి యింకేదో ప్రత్యామ్నాయం కావాలి. ఆ ప్రత్యామ్నాయమే ఇకో సోషలిజం. పర్యావరణ సామ్యవాదం. ఆ దిశగా మహాజనవాళి ఆలోచనసాగాలి. ఆచరణ కూడా కావాలి.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

# దీపావళి వెనకున్న పురాణ కథలు

దీపావళి అంటేనే వెలుగుల పండుగ. అమావాస్య చీకట్లను చీల్చుతూ ఎటుచూసినా దీపాల సొబగులే.. అంబరాన్నంటే సంబరాలే. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా హిందువులంతా ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకొనే ఈ దీపావళి వేడుక.



ఆశ్వీయుజ త్రయోదశి, చతుర్దశి, అమావాస్య.. ఈ మూడు రోజులకు అత్యంత ప్రాధాన్యం ఉంది. సనాతన ధర్మంలో అశ్వీయుజ మాస కృష్ణపక్ష త్రయోదశి మొదలు మూడు రోజుల్లో ప్రదోష సమయాన (సాయంకాలం వేళ) దీపాలను ఇంటి వద్ద, ఆలయాల వద్ద, గోశాల వద్ద వెలిగించడం లక్ష్మీప్రదం. అలాగే, భాద్రపదంలో మొదలయ్యే పితృదేవతారాధనకు ఈ దీపావళితో దీపాల ద్వారా వీడ్కోలు వలకడం జరుగుతుంది. నరక చతుర్దశి రోజు సూర్యుడు తుల రాశిలో, చంద్రుడు స్వాతి నక్షత్రంలో.. రవిచంద్రులిద్దరూ తుల రాశిలోనే ఉండటం జ్యోతిష శాస్త్రం ప్రకారం అత్యంత విశేషమైనది. దీపావళి రోజు ఎవరైతే తెల్లవారు జామున తలస్నానం ఆచరిస్తారో వాళ్లకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయని జ్యోతిష శాస్త్రం చెబుతోంది. తులరాశిలో సూర్యుడు సంచరించే సమయంలో నదుల్లోని నీటిలో శక్తి దాగి ఉంటుందనీ.. ఆ నదీ ప్రవాహంలో గానీ, సముద్రంలో గానీ తలస్నానమాచరించిన వారికి ఆరోగ్యం సిద్ధిస్తుందని పేర్కొంటోంది. అందువల్ల నరక చతుర్దశి / దీపావళి రోజున తలస్నాన మాచరించడం సనాతనంగా వస్తున్న ధర్మం.

**చీకటి నుంచి వెలుగు వైపు..**


చీకటి అజ్ఞానానికి, నిరాశకు ప్రతీక. కాంతి.. ఆనందానికి సూచిక. దీపం ఐశ్వర్యం.. అంధకారం దారిద్ర్యం. అజ్ఞానమనే చీకటి నుంచి విజ్ఞానమనే వెలుగులోకి పయనింపజేయడమే దీపావళి పండుగ ఉద్దేశం. దీపం ఉన్న చోట జ్ఞాన సంపద ఉన్నదని.. దీపం సాక్షాత్తు లక్ష్మీదేవి అని మన శాస్త్రాలు చెబుతున్నాయి. దీపం జ్ఞానానికి, త్రిమూర్తులకు ప్రతీక. అందుకే సనాతన ధర్మంలో ప్రతీ శుభకార్యంలో దీపాన్ని వెలిగిస్తారు. పురాణాల ప్రకారం.. దీపావళితో నరకాసుర సంహార గాథ, బలి చక్రవర్తి రాజ్య దానం, విక్రమార్కుని పట్టాభిషేకం ముడిపడి ఉన్నాయి. ఆశ్వీయుజ చతుర్దశి రోజు నరకాసురుడిని శ్రీకృష్ణుడు సత్యభామా సమేతుడై సంహరించడం వల్ల దీపావళి ఏర్పడిందని పురాణాలు చెబుతున్నాయి. బలి చక్రవర్తి మహా విష్ణువుకు రాజ్యదానం చేసింది ఈ సమయంలోనే. అలాగే, విక్రమార్కుడికి పట్టాభిషేకం జరిగిన సమయం కూడా ఇదేనని పురాణాలు పేర్కొంటున్నాయి.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

# చీమ చిటుక్కుమన్నా... చిటికెలో పసిగడుతుంది...

# @ నైసార్ మిషన్..!!

ఒక్కోసారి మన కళ్ళముందు జరిగే మార్పులను కూడా మనం సరిగా గుర్తించలేం. కానీ అంతరిక్షం నుండి నేలపై ఏదైనా, ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఒక్క అంగుళమంత చిన్న తేడా వచ్చినా పసిగట్టడం సాధ్యమేనా అంటే... నిస్సందేహంగా సాధ్యమేనంటున్నారు శాస్త్రవేత్తలు. ఇండియా, అమెరికాల సంయుక్త భాగ స్వామ్యంతో గత జులై 30న ప్రయోగించిన నైసార్ శాటిలైట్‌కు ఇలాంటి సామర్థ్యాలు మెండుగా ఉన్నాయని, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించిన కారణంగా **నైసార్ ప్రపంచ ఉపగ్రహ చరిత్రలోనే ఒక మైలురాయిగా** నిలవనున్నదని వారు నొక్కి వక్కానిస్తున్నారు. మరోవైపు వైజ్ఞానిక శాస్త్ర ఔత్సాహికులు అబ్బో... చీమల కదలికలను కూడా చిటికెలో పసిగడుతుందే.. అని అబ్బురపడుతున్నారు. ఈ నేపథ్యంలో నైసార్ విశేషాలేంటో మనమూ తెలుసుకుందాం..!!




### అసలు NISAR (నైసార్) అంటే..?

NASA (నాసా), ISRO (ఇస్రో) సింథటిక్ అపెర్చర్ రాడార్‌కు సంక్షిప్త రూపమే నైసార్. **తొలిసారిగా ఇండియా, అమెరికా అంతరిక్ష సంస్థలు నాసా, ఇస్రోలు సంయుక్తంగా ఈ ఉపగ్రహాన్ని నిర్మించాయి.** ఈ ఉపగ్రహ జీవిత కాలం 5 సంవత్సరాలు (2025-30). ప్రాజెక్ట్ వ్యయం దాదాపు 1.5 బిలియన్ డాలర్లు. భూమికి 747 కి.మీ ఎత్తులో ఉన్న సన్‌సింక్రోనస్ పోలార్ ఆర్బిట్‌లో గత జులై 30న తిరుపతి జిల్లాలోని సతీశ్‌ధావన్ స్పేస్‌సెంటర్ నుండి జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ నైసార్‌ను విజయవంతంగా ప్రవేశపెట్టింది.

### మరి SAR (సార్) అంటే..??

సింథటిక్ అపెర్చర్ రాడార్‌ను SAR (సార్) అని అంటారు. సాధారణంగా రాడార్లు పరిమాణంలో పెద్దగా ఉన్న డిష్ యాంటెన్నాల ద్వారా మైక్రో తరంగాలు లేదా రేడియో తరంగాల రూపంలో సంకేతాలను బయటికి విడుదల చేస్తాయి. ఆ తరంగాలు పరావర్తనం చెంది అదే డిష్ యాంటెన్నాల ద్వారా తిరిగి రాడార్లను చేరుతాయి. రాడార్లు వాటిని స్వీకరించి, విశ్లేషించడం ద్వారా ఆ తరంగాలు ఏ వస్తువు మీదైతే పడ్డాయో ఆ వస్తువు రాడార్ నుండి ఎంత దూరంలో ఉంది, దాని నిర్మాణం, ఆకృతి, ఒక వేళ ఆ వస్తువు కదులుతూ ఉన్నట్లయితే దాని వేగాన్ని కూడా ఖచ్చితంగా నిర్ధారిస్తాయి.

SAR అనేది ఒక ప్రత్యేకమైన ఇమేజింగ్ రాడార్. మరీ పెద్ద పరిమాణంలో ఉన్న యాంటెన్నా లాంటి నిర్మాణాలను అంతరిక్షంలోకి పంపడం సాధ్యపడనపుడు, SAR లను ఉపయోగిస్తారు. దీనిలో అధునాతన సాంకేతికత, అల్గారిథమ్స్, గ్రౌండ్ బేస్డ్ రాడార్‌ను అనుసరిస్తూ, వాటికన్నా మెరుగైన పనితీరును ప్రదర్శిస్తూ స్పష్టమైన చిత్రాలను తీసి గ్రౌండ్ స్టేషన్‌కు పంపిస్తాయి.

### నైసార్ - లక్ష్యాలు

i) భూకంపాలు, అగ్నిపర్వతాలు, కొండచరియలు విరిగిపడడం లాంటి భూ ఉపరితల మార్పులను నిరంతరం పరిశీలించడం.

ii) హిమానీనదాలు మరియు ధ్రువపు మంచు పలకల ద్రవీభవనం ద్వారా సముద్ర మట్టం పెరుగుదలను పర్యవేక్షించడం

సాంప్రదాయ రాడార్ మరియు SARల మధ్య భేదాలను ఈ క్రింది పట్టికలో చూడవచ్చు.

| వ.స. | లక్షణం | సాంప్రదాయ రాడార్ | సింథటిక్ అపెర్చర్ రాడార్ |
|---|---|---|---|
| 1 | యాంటెన్నా పరిమాణం | పరిమాణంలో పెద్దగా డిష్ యాంటెన్నా లాగా ఉంటుంది | చిన్నగా, ఉపగ్రహాలలో వినియోగించేందుకు వీలుగా ఉంటుంది |
| 2 | పనిచేసే తరంగదైర్ఘ్యం | మైక్రో/రేడియో తరంగాలు | మైక్రో/రేడియో తరంగాలు |
| 3 | స్పష్టత (Resolution) | యాంటెన్నా పరిమాణంపైన ఆధారపడి ఉంటుంది | సింథసిస్/ప్రాసెసింగ్ ద్వారా మెరుగైన స్పష్టత |
| 4 | ప్రధాన వినియోగం | భూమి / విమాన గమనాల పరిశీలన | భూమి మరియు అంతరిక్ష పరిశీలన |
| 5 | చిత్రీకరణ సామర్థ్యం (Imaging Capability) | యాంటెన్నా పరిమాణాన్ని బట్టి ఉంటుంది | స్మాల్ ప్లాట్ ఫామ్స్ ద్వారానైనా అధిక స్పష్టతతో కూడిన చిత్రాలు తీస్తుంది. |

iii) అటవీ విస్తీర్ణంలో మార్పులను గుర్తించడం

iv) పంటవిస్తీర్ణం మరియు పంటలలో సంభవించే మార్పులు నేలలో కలిగే మార్పులు నిరంతరం పరిశీలించడం ద్వారా వ్యవసాయ ప్రణాళిక మరియు ఆహార భద్రతకు తోడ్పాటునందించడం.

v) చిత్తడి భూములలో కాలానుగుణంగా సంభవించే మార్పులు, పర్యావరణ స్థితిగతులను నిరంతరం పరిశీలించడం.

**నైసార్ – విశిష్టతలు :**

**డ్యుయల్ ఫ్రీక్వెన్సీ సార్స్ (Dual Frequency SARS)**

i) నైసార్ ఉపగ్రహంలో రెండు రకాలైన సింథటిక్ అపెర్చర్ రాడార్లు వినియోగించబడ్డాయి. **గతంలో ఏ దేశ ఉపగ్రహాలలో కూడా ఇలా రెండు రకాల రాడార్లను వినియోగించలేదు.** అవి a) L–బ్యాండ్ SAR b) S–బ్యాండ్ SAR. ఈ రాడార్లను ఉపయోగించి ఒకే సమయంలో, ఒకే ప్రదేశం నుండి అనేక చిత్రాలు, అనుబంధ చిత్రాలను కూడా తీయవచ్చు. L–బ్యాండ్, S–బ్యాండ్ రాడార్లను వినియోగించి భూమిని అన్నిరకాల వాతావరణ పరిస్థితుల్లోనూ అనగా దట్టమైన మేఘాలు, పొగ, వర్షము మరియు పొగమంచు ఆవరించినపుడు కూడా రాత్రి, పగలూ స్పష్టంగా పరిశీలించవచ్చు. ఈ రెండు రాడార్లు విభిన్న తరంగదైర్ఘ్యాలతో పనిచేయడం వల్ల భూమి ఉపరితలంపై సంభవించే విభిన్న రకాల మార్పులను హైరిజల్యూషన్ సామర్థ్యంతో గుర్తించవచ్చు.



*జీఎస్ఎల్వీ– ఎఫ్16 వాహక నౌకలో ప్రయోగానికి సిద్ధంగా ఉన్న నైసార్ శాటిలైట్*

**a) L–బ్యాండ్ SAR:** ఈ రాడార్‌కు అధిక తరంగదైర్ఘ్యం ఉంటుంది (24 సెం.మీ). అందువల్ల ఈ రాడార్ నుండి వెలువడే మైక్రోతరంగాలు దట్టమైన అడవులు, ఇసుక, మంచులాంటి భౌతిక రాశులలోకి సులువుగా చొచ్చుకు వెళతాయి. అదేవిధంగా భూ ఉపరితలంలో సంభవించే అతిస్వల్ప కదలికలను కూడా ఇది గుర్తిస్తుంది. కిరణజన్యసంయోగక్రియ ద్వారా ఒక చెట్టుకాండంలో వాతావరణం నుండి గ్రహించబడిన కార్బన్ నిల్వచేయబడి ఉంటుంది. దీనినే **ట్రీ ట్రంక్ బయోమాస్** అంటారు. దీని ద్వారా భూమిమీద ఉన్న కార్బన్ స్టాక్‌ను అంచనావేయవచ్చు. ఈ ట్రీట్రంక్ బయోమాస్‌ను L–బ్యాండ్ సార్ ఖచ్చితంగా నిర్ధారిస్తుంది.



*నైసార్ అంతర్ చిత్రం*

**b) S–బ్యాండ్ SAR:** ఈ రాడార్‌కు స్వల్ప తరంగదైర్ఘ్యం (12 సెం.మీ) ఉంటుంది. అందువల్ల ఈ రాడార్ నుండి వెలువడే మైక్రో తరంగాలు ఎక్కువ లోతులోకి చొచ్చుకు పోలేవు. కానీ పంట పొలాలు, సముద్రాలు, నదులు, చెరువుల లాంటి విస్తృత పరిమాణంలో నీటినిల్వ కలిగిన ప్రదేశాలను ఇది స్పష్టంగా గుర్తించి ఫొటోలు తీస్తుంది. సోయాబీన్, మొక్కజొన్న మరియు చెరకులాంటి పంట మొక్కల పెరుగుదల మరియు వాటి ఎదుగుదల స్థాయిలను నిర్దిష్టంగా గుర్తిస్తుంది.

L–బ్యాండ్, S–బ్యాండ్ రాడార్లు సంయుక్తంగా పనిచేయడం వల్ల ఏదైనా ఒక నిర్దిష్టప్రదేశానికి చెందిన చిత్రాలను సమగ్రంగా తీయవచ్చు. L–బ్యాండ్, S–బ్యాండ్ రాడార్లను రెండు వేర్వేరు ఉపగ్రహాలలో వినియోగించి ఏదైనా ఒక ప్రాంతాన్ని ఒకే ప్రదేశం నుండి, ఒకే సమయంలో ఫోటోలు తీయలేము. ఆ ప్రదేశంలో తదుపరి ఏవైనా మార్పులు సంభవిస్తే ఆ మార్పులను ఈ రెండు వేర్వేరు ఉపగ్రహాలు పసిగట్టలేవు.

**ఒకే ఉపగ్రహంలో రెండు SARలను అమర్చడం ఒక సాంకేతిక సవాల్‌గా శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు.** అందుకే నైసార్ ఉపగ్రహ రూపకల్పనకు 10 సంవత్సరాల సమయం పట్టిందని వారు చెబుతున్నారు.

**ii) Sweep SAR మరియు wide swath imaging:**

Sweep అనగా విస్తృత పరిశీలన మరియు swath అనగా విశాల ప్రదేశం అని చెప్పవచ్చు. Sweep SAR అన్నది SAR లో వచ్చిన అధునాతన సాంకేతికతగా శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఈ సాంకేతికత ద్వారా ఉపగ్రహం 240 కిలోమీటర్ల విశాలమైన ప్రదేశాన్ని 3–10 మీ॥ నిడివితో స్పష్టమైన చిత్రాలను తీయవచ్చు. ఈ సామర్థ్యంతో భూ అంతర్భాగంలోని టెక్టానిక్ ప్లేట్ల కదలికలు, వరద ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పరిశీలించడం వల్ల విపత్తు నిర్వహణ, వాతావరణంలో వచ్చే అనూహ్య మార్పులను ఇట్టే పసిగట్టవచ్చు.

**iii) డిప్లాయబుల్ యాంటెన్నా:** మడతపెట్టడం, విప్పడం మరియు పరిస్థితులకనుగుణంగా స్వయం సర్దుబాటు చేసుకోగల సామర్థ్యం కల్గి, స్వల్ప పరిమాణం నుండి విస్తృత స్థాయికి మార్పులు చెందగలిగిన సామర్థ్యం ఈ యాంటెన్నాలకు ఉంటుంది. నైసార్‌లో కూడా 12 మీ॥ నిడివితో విప్పగలిగే యాంటెన్నా ఉంటుంది. దీనిని అంతరిక్షంలోకి ప్రయోగించినపుడు ఇది విస్తృత పరిమాణం కలిగిన రిఫ్లెక్టర్‌గా పనిచేస్తుంది. **బంగారు పూత కలిగి, బ్యాడ్మింటన్ కోర్టు అంత విశాలాన్ని కలిగి ఉంటుంది.** ఈ సమయంలో ఇది నిర్దిష్ట ప్రాంతం నుండి విభిన్న కోణాలలో, విభిన్న పదార్థాల నుండి కనిష్టీకరించిన ద్రవ్యరాశితో, ఉపగ్రహం పంపే సంకేతాలను స్వీకరించి, అత్యున్నత ఇంజనీరింగ్ నైపుణ్యంతో ఎలాంటి అవరోధాలు లేకుండా ఆ సంకేతాలను స్కాన్ చేస్తుంది. **ఒక ఉపగ్రహానికి ఇంత పెద్ద రిఫ్లెక్టర్‌ను అమర్చడం ప్రపంచంలో ఇదే మొదటిసారి అని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.**

**iv) ఆర్బిటల్ మెకానిక్స్ మరియు కవరేజ్ స్ట్రాటజీ:** నైసార్ భూమి నుండి 747 కి॥మీ. ఎత్తులో ఉన్న సన్ సింక్రోనస్ పోలార్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టబడింది. ఈ ఆర్బిట్ 98.4 డిగ్రీల వంపును కలిగి ఉంటుంది. ఈ వంపు అనేది ప్రతి 12 రోజుల కొకసారి భూమండలాన్ని పునఃపరిశీలిస్తూ స్పష్టమైన చిత్రాలు తీయడానికి కావలసిన వెలుతురు (Lighting)ను అందిస్తుంది. తద్వారా పంటల ఎదుగుదలలో వచ్చే కాలానుగుణ మార్పులు మరియు కొండ చరియలు విరిగిపడడం లాంటి స్వల్పకాలిక ప్రక్రియలను సులువుగా గుర్తించవచ్చు.

**నైసార్ రూపకల్పనలో ఇస్రో, నాసాల పాత్ర:**


భూ ఉపరితలంలో సంభవించే మార్పులను క్షుణ్ణంగా పరిశీలించి, ఆ మార్పులను విస్పష్టంగా చిత్రీకరించగల శాటిలైట్ వ్యవస్థ అవసరమని

నాసా భావించింది. దాని రూపకల్పనకు జర్మన్ ఏరోస్పేస్ సంస్థ డీఎల్ఆర్‌తో భాగస్వామ్యం వహించాలనుకుంది. అయితే జర్మన్ సంస్థకు బిజీ షెడ్యూల్ ఉండడంతో, నాసా సొంతంగానే ఉపగ్రహాన్ని రూపొందించుకోవాలనుకుంది. ఈ లోగా నాసా బడ్జెట్‌కు అమెరికా ప్రభుత్వం కోతపెట్టడంతో పునరాలోచనలో పడింది. “వెదకబోతున్న తీగ కాలికి తగిలిందన్నట్టు” తక్కువ ఖర్చుతో నాణ్యమైన ప్రయోగాలు చేస్తున్న ఇస్రో ఆ సంస్థకు ఎదురైంది. ఇస్రో 2008లో చంద్రయాన్-1, 2009లో రీశాట్-2 ఉపగ్రహాలను ప్రయోగించింది. ఈ రెండింటిలోనూ “సార్” పరికరాలు ఉన్నాయి. దీన్ని గమనించి నాసా ఇస్రో వైపు మొగ్గింది. అలా 2014లో నాసా, ఇస్రో భాగస్వామ్యంతో నైసార్ మిషన్‌కు అంకురార్పణ జరిగింది. నైసార్ రూపకల్పనలో నాసా, ఇస్రోలు కింది విధంగా కీలక పాత్ర పోషించాయి.

i) **నాసా:** L-బ్యాండ్ SAR, 12 మీ॥ యాంటెన్నా, జీపీయస్ కంట్రోలర్‌తో పాటు సాలిడ్ స్టేట్ రికార్డర్ మరియు టెలికామ్ సిస్టమ్ లాంటి ఇతర వ్యవస్థల రూపకల్పనలో నాసా కీలక పాత్ర పోషించింది.

ii) **ఇస్రో:** S-బ్యాండ్ SAR, శాటిలైట్‌బస్ (1-3K), జీఎస్ఎల్వీ ఎఫ్-16 లాంచర్, సోలార్ అర్రేస్ (Solar arrays), డేటా హ్యాండ్లింగ్ విభాగాల రూపకల్పనలో ఇస్రో ప్రధాన భూమిక వహించింది.

గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్ల ద్వారా మిషన్ ఆపరేషన్‌లో రెండు సంస్థలు ఇతోధిక పాత్ర పోషించాయి. ఉపగ్రహ రూపకల్పన, ప్రయోగంలో సమాన భాగస్వామ్యం ప్రాతిపదికన నైసార్ మిషన్‌ను నాసా, ఇస్రో చేపట్టాయి. ప్రాజెక్ట్ వ్యయం దాదాపు 1.5 బి॥ డాలర్లు కాగా, నాసా 1.19 బి॥ డాలర్లు ఖర్చు పెట్టింది. ఇస్రో తాను అనుసరించిన చౌక ఇంజనీరింగ్ విధానాలు కారణంగా కేవలం 90 మిలియన్లు మాత్రమే ఖర్చు చేసింది.




*నైసార్ శాటిలైట్- అందులోని భాగాలు*

**నైసార్ - ఎలా పనిచేస్తుంది:** ముందే చెప్పుకున్నట్లు నైసార్‌ను భూమి నుండి 747 కి॥మీ ఎత్తున్న సూర్య అనువర్తిత కక్ష్యలోకి గత జులై 30న ప్రయోగించారు. దీని బరువు 2392 కిలోలు. 90 రోజుల తరువాత పని ప్రారంభిస్తుంది. **ఇందులో తొలిసారిగా అధునాతన స్వీప్ సార్ పరిజ్ఞానాన్ని ఉపయోగించారు.** దీని వల్ల సంబంధిత ప్రాంతం మొత్తాన్ని వేగంగా త్రీడీలో పరిశీలించడం సాధ్యమవుతుంది. భూమిపైనున్న అన్ని ప్రాంతాలను 12 రోజులకొకసారి పరిశీలిస్తుంది. 97 ని॥ల కొకసారి భూమిని చుట్టేస్తుంది.

నైసార్ రోజుకు 80 టెరాబైట్ల డేటాను వెలువరిస్తుంది. ఈ లెక్కన ఒక రోజులు 512 గిగాబైట్ల సామర్థ్యమున్న 150 హార్డ్ డ్రైవ్‌లను ఇది నింపుతుంది. ఈ డేటా ప్రాసెసింగ్, నిల్వ, పంపిణీ మొత్తం క్లౌడ్ ద్వారా సాగుతుంది. దీన్ని ఉచితంగా ఎవరైనా పొందవచ్చు.

**అనువర్తనాలు:**

నైసార్‌లో అత్యుత్తమ పనితీరు గలిగిన డ్యుయల్ ఫ్రీక్వెన్సీ రాడార్లు ఉండడం, ప్రతి 12 రోజులకొకసారి భూమిని పునఃపరిశీలించే సౌలభ్యం కారణంగా భూగ్రహంపై శాస్త్రవేత్తలకున్న అంచనాల్లో సమూల మార్పులు వచ్చే అవకాశం ఉంది. శాస్త్రవేత్తలకు రియల్‌టైమ్ యాక్షనబుల్ డేటాను ఎప్పటికప్పుడు అందించడం వల్ల వాతావరణ మార్పులు, విపత్తు నిర్వహణలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉంటుంది.

**పర్యావరణ పరిరక్షణ:** L-బ్యాండ్ SAR, దట్టమైన అడవులలో సంభవించే మార్పులు, అటవీ నిర్మూలనను ట్రాక్ చేయడంలో అద్భుత పనితీరును ప్రదర్శిస్తుంది. తద్వారా UNREDD+ (Reducing Emissions from deforestation and forest degredation in developing courtries) కార్యక్రమం కింద ఇంటర్నేషనల్ కార్బన్ అకౌంటింగ్, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో సహాయపడుతుంది.

అదే విధంగా చిత్తడి భూముల మ్యాపింగ్, నీరు, వృక్ష సంపదలో వచ్చే కాలానుగుణ మార్పులను గ్రహించడం వల్ల వలస జాతులను (Migrated spices) కలిగి ఉన్న ఆవాసాల పర్యావరణ ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం, భూమివినియోగానికి సంబంధించిన విధాన నిర్ణయాలలో ప్రజోపయోగకరమైన నిర్ణయాలు తీసుకునేందుకు దోహదపడుతుంది.

**వాతావరణం మరియు క్రయోస్పియర్ (ధ్రువప్రాంతాల) పర్యవేక్షణ:**

హిమానీనదాలు మరియు ధ్రువ ప్రాంతాల మంచు పలకలలో సంభవించే మార్పులను అధిక ఖచ్చితత్వంతో నైసార్ గ్రహిస్తుంది. తద్వారా **గ్రీన్‌ల్యాండ్, అంటార్కిటికా, హిమాలయాల మంచు స్వరూపంలో** వచ్చే మార్పులను వేగంగా సంగ్రహించి, ప్రపంచ సముద్ర మట్టం పెరుగుదల లాంటి మార్పులను వాతావరణ విభాగాలకు చేరవేస్తుంది. అదేవిధంగా శాశ్వత మంచు (permafrost) కారణంగా ధ్రువప్రాంతాల భూకదలికలలో వచ్చే మార్పుల ద్వారా సంభవించే పెను విపత్తులను కూడా నైసార్ ముందే పసిగడుతుంది.

**ప్రకృతి వైపరీత్యాలు మరియు విపత్తు సంసిద్ధత:**

భూకంపాలు, అగ్నిపర్వతాలు, కొండచరియలు విరిగి పడడం మరియు హిమనదీయ సరస్సు విస్ఫోటనాలు Glacial lake outburst floods (GLOF) లాంటి వినాశకర విపత్తులు వేగంగా సంభవిస్తూ ఉంటాయి. నైసార్ అటువంటి విపత్తులు సంభవించడానికి కొన్ని రోజులు మరియు వారాల ముందే భూమిలోపల సంభవించే అతి చిన్న కదలికలను గుర్తించే సామర్థ్యం కలిగి ఉంది. **ఆగ్నేయ ఆసియా, పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ మరియు ఆండీస్ పర్వతాలు** లాంటి దుర్బల ప్రాంతాలలో ఈ ముందస్తు హెచ్చరికలు అక్కడి స్థానిక ప్రభుత్వాలు ముందు జాగ్రత్తలు తీసుకోవడానికి వీలు కల్పిస్తాయి.

**ఆహార భద్రత మరియు వ్యవసాయ ప్రణాళిక:**

నేలలోని తేమ స్థాయిలు, మొక్కల ఆరోగ్యస్థితి, నీటి పారుదల తీరుతెన్నుల ఆధారంగా నైసార్ నేల స్థితిగతులను నిర్ధారిస్తుంది. తద్వారా


పంటల ఎదుగుదల, నీటి వనరుల నిర్వహణకు అనుసరించాల్సిన ఖచ్చితమైన విధానాలకు నిర్దిష్టమైన సమాచారాన్ని అందిస్తుంది. వ్యవసాయ దిగుబడులకు వర్షపాతంపై ఆధారపడే దేశాలలో ఆహార సరఫరా గొలుసులు మరియు వాతావరణ ఆధారిత స్మార్ట్ వ్యవసాయంలో పెట్టుబడులకు సంబంధించి తగు నిర్ణయాలు తీసుకోవడంలో ఈ సమాచారం ఉపకరిస్తుంది.

**పట్టణ మౌలిక సదుపాయాలు మరియు ఆపత్సమయ నిర్వణ:**

ఉన్నట్టుండి భూమికుంగిపోవడం, డ్యాములు మరియు వంతెనలు తీవ్ర ఒత్తిడికి లోను కావడం, భూగర్భజలవనరులు వేగంగా క్షీణించడం వేగవంతమైన పట్టణీకరణకు తెరవెనుక నున్న చీకటి కోణాలు. నైసార్ యొక్క ఇంటర్ ఫెరోమెట్రీ నగరాలు, పట్టణాలలోని నిర్దిష్ట ప్రాంతంలోని నేల ఒక్క అంగుళం కుంగినా గుర్తించగలదు, డ్యాములు, వంతెనలలోని లోపాలను కూడా పసిగట్టగలదు. తద్వారా పట్టణ ప్రణాళిక నిపుణులకు సరైన నగర ప్రణాళికలను రూపొందించడంలో నైసార్ ద్వారా అందే సమాచారం చక్కగా ఉపయోగపడుతుంది.

**గ్లోబల్ సైన్స్ ప్రగతికి, డేటా ప్రజాస్వామ్యకరించడంలో:**

విలువైన, ఉపయోగకరమైన డేటాను అందించడంలో ప్రపంచ వ్యాప్తంగా అనేక పరిశోధనా సంస్థలు ఉన్నాయి. కానీ వాటి నుండి డేటాను స్వీకరించి, వినియోగించడం ఖర్చుతో కూడిన వ్యవహారం. కానీ నైసార్ అనేది ఓపెన్-యాక్సెస్ ఫ్లాట్ ఫామ్. తను సేకరించిన డేటాను విశ్లేషించి కొన్ని గంటల్లో శాస్త్రవేత్తల ప్రపంచానికి అందుబాటులో ఉంచుతుంది. ఈ రకమైన డేటా ప్రజాస్వామీకరణ, ప్రతి ఒక్కరూ పరిశోధనా ప్రక్రియలో సౌకర్యవంతంగా పాల్గొనడానికి వీలు కల్పిస్తుంది. **ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు అధునాతన జియోస్పేషియల్ డేటాను ఉపయోగించి**, నామ మాత్రపు ఖర్చుతో, మార్పులకు అనుగుణంగా, స్థిరమైన పర్యావరణ వ్యవస్థల రూపకల్పనకు మరియు ఎకో ఫ్రెండ్లీ విధానాలను అభివృద్ధిపరచడానికి తోడ్పడుతుంది.




నైసార్ శాటిలైట్ - సూక్ష్మనిర్మాణం

**వైజ్ఞానిక దౌత్యం మరియు ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదల:**

నైసార్ మిషన్, ఇండియా-అమెరికాల మధ్య స్పేస్ టెక్నాలజీ సహకారంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. **నైసార్‌ను సూర్యానువర్తిత కక్ష్యలో ప్రవేశపెట్టిన మొదటి రాకెట్‌గా జీఎస్ఎల్వీ-ఎఫ్16 చరిత్ర సృష్టించింది.** ఏతావాతా ఇండియా-అమెరికాల మధ్య వాతావరణ మార్పులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చి పుచ్చుకోవడం, ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు 'నైసార్' దారులు పరిచింది.

**అంతర్జాతీయ వాతావరణ విధానాల రూపకల్పన మరియు నాయకత్వం:**

నైసార్ నేల సమగ్రస్వరూపం, ధ్రువప్రాంతాలతోని మంచు కరుగుదల, నేల ఉపరితలంలోని తేమ స్థాయిలకు సంబంధించి అత్యంత ఖచ్చితమైన విశ్వసనీయ సమాచారం అందజేస్తుంది. ఈ సమాచారం **సుస్థిరాభివృద్ధి లక్ష్యాలతో భాగమైన వాతావరణ మెరుగుదల, ఆహారభద్రత, సుస్థిర పట్టణాల నిర్వహణకు తగు విధానాల రూపకల్పనలోనూ,** వాటికి నాయకత్వం వహించడంలోనూ ఉపకరిస్తుంది.

**భవిష్యత్ బహుపాక్షిక ఉపగ్రహ ప్రయోగాలకు నమూనా:**

డ్యుయల్ ఫ్రీక్వెన్సీ రాడార్లను ఒకే ఉపగ్రహంలో అమర్చి, పనిచేయించడం ద్వారా భవిష్యత్‌లో యూరోపియన్ యూనియన్, జపాన్, ఆఫ్రికన్ స్పేస్ సిస్టమ్స్ లాంటి సంస్థలతో బహుళ పాక్షిక అంతరిక్ష మిషన్‌లను ప్రయోగించడానికి నైసార్ ఒక నమూనాగా నిలుస్తుంది. తద్వారా మరింత సమగ్రమైన, సుస్థిరమైన ప్రపంచ వాతావరణాన్ని సృష్టించేందుకు తోడ్పడుతుంది.

**సవాళ్లు :**

**i) డేటా వాల్యూమ్ మరియు డేటా ప్రాసెసింగ్:** నైసార్ రోజుకు 80 టెరాబైట్ల డేటాను సృష్టిస్తుంది. దీనిని సంగ్రహించి నిల్వ చేసేందుకు అవసరమైన క్లౌడ్ ఆధారిత వ్యవస్థలను రూపొందించడం సవాలుతో కూడుకొన్నది.

**ii) స్థిరత్వం మరియు దీర్ఘకాలిక విలువ:** నైసార్ జీవితకాలం 5 సంవత్సరాలు. దీనిని స్థిరంగా కొనసాగించడానికి మరియు వాతావరణంలో విపరీత మార్పులు వచ్చే కొద్దీ దీనిలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని అనగా రాడార్ల సామర్థ్యం, మల్టీస్పెక్ట్రల్ లేదా ఏఐ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నతీకరించాల్సి వస్తుంది. తదుపరి మిషన్‌లకు కొనసాగింపుగా ఉండేందుకు ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసేందుకు వీలుగా మార్పులు చేయాల్సి రావడం సంక్లిష్టతలతో కూడిన వ్యవహారంగా చెప్పవచ్చు.

**iii) బహుళ పాక్షిక సహకారం:** నైసార్, ఇండియా - అమెరికాల మధ్య ఉన్నతస్థాయి సాంకేతిక సహకారానికి నమూనాగా నిలిచింది. అయితే ప్రస్తుత సంక్షోభిత ప్రపంచంలో దీనిని విభిన్న దేశాలు ఏ మేరకు అందిపుచ్చుకొని సుస్థిర అంతర్జాతీయ సమాజ రూపకల్పనకు సహకరిస్తాయనేది వేచి చూడాల్సి ఉంది.

**చివరగా:** ప్రస్తుతం ప్రపంచంలో ఏ రెండు దేశాల మధ్య చూసినా పరస్పర అపనమ్మకం, అవిశ్వాసాలతో సంఘర్షణా పూరిత వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సైన్స్ ద్వారా, అంతర్జాతీయ సవాళ్ళను ధీటుగా ఎదుర్కొని, దేశాల మధ్య సరిహద్దుల కతీతంగా **ప్రజాస్వామీకరణ, సహకారం, సుస్థిర ప్రగతి సాధనకు నైసార్ ఒక నమూనాగా నిలిచింది.** ఇండియా-అమెరికాల మధ్య చిగురించిన ఈ ఒరవడిని మిగిలిన ప్రపంచమంతా అందిపుచ్చుకొని **సంఘర్షణలు లేని వసుధైక జగతిని** ఆవిష్కరించడంలో నిర్మాణాత్మక పాత్ర పోషించాలని మనమూ ఆశిద్దాం.

**-పుట్టా పెద్ద ఓబులేసు,**
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప,
m : 9550290047



# అతిపెద్ద కోటల్లో గండికోట

గండికోటను చూడాలనుకోవడమే గొప్ప విశేషం. ఎందుకంటే ప్రపంచ స్థాయిలో అరుదైన ప్రదేశంగా గండికోట రెండవ స్థానంలో నిలుస్తుంది. దేశంలో ఇలాంటి గొప్ప పర్యాటక ప్రదేశం మరొకటి లేదు. 1000 సంవత్సరాల క్రితం నిర్మించిన కోట, వేల సంవత్సరాల క్రితం కొండను చీల్చుకుంటూ ప్రవహించిన పెన్నానది ప్రవాహం ఇంకెక్కడా లేని అరుదైన విశేషాలు. అసలు ఇలాంటి అద్భుతమైన పర్యాటక ప్రదేశం ఒకటుందనీ చాలా మందికి తెలియదు. తెలిస్తే మాత్రం చూడకుండా ఉండలేరు. చూస్తే ఎంతో ఆనందిస్తారు.

ప్రధాన ప్రవేశద్వారం దాటి లోపలికి వెళ్ళగానే మనకు బలమైన కోటగడోలు కనిపిస్తాయి. ఈ కోటను కట్టేందుకు ఎంత పెద్ద పెద్ద బలమైన రాళ్లు వాడారంటే ఒక్కొక్క రాయి 1000 కిలోల బరువు పైగానే ఉంటుంది. అరుదైన రాయిని అంత పైకి ఎలా చేర్చారో ఊహించలేము.



### చరిత్ర ఇది

గండికోట మహా దుర్గం జమ్మలమడుగు పట్టణానికి 14 కిలోమీటర్ల దూరంలో ఉంది. (కడప నుండి లేదా పొద్దుటూరు నుండి జమ్మలమడుగు వెళ్లి అక్కడ నుండి) గండికోట వెళ్ళవచ్చు. శాసనాలు, కైఫియత్‌లు, ఇతర చారిత్ర ఆధారాల ద్వారా తెలిసిన సమాచారం ఈ కోటను క్రీస్తు శకం 1123 జనవరి 9న కళ్యాణి చాళుక్య ప్రభువు త్రైలోక్య మల్లునికి సామంతుడైన కాక రాజు పేరుగల చిద్దనచోళ మహారాజు నిర్మించారు. కోటకు పడమర ఉత్తర దిశల్లో సహజ కందకంలా పెన్నా నది ప్రవహిస్తున్నది. ఎర్రమల కొండల మధ్య ఇది గండికోటను చుట్టేసినట్లు కనిపిస్తుంది. కాకతీయ చక్రవర్తి ప్రతాప రుద్రుని సేనాపతి పట్టణ సాంహిణినాయకుడు ఈ ప్రాంతపు రాజు కాయస్థ అంబదేవుడు కొంతకాలం గండికోటను పాలించాడు. తరువాత క్రీస్తు శకం 1308 నుంచి 1314 వరకు సోమయలెంక అనంతరం 1319 వరకు కాకతీయ పాలనలోనూ ఉండింది. తర్వాత గండికోట చరిత్ర మరుగున పడింది. అనంతరం విజయనగర రాజుల పాలనలోకి వచ్చింది. మొదటి బుక్క రాయలు ఆయన కుమారుడు ప్రౌఢదేవరాయలు పాలించారు. ఆ పరంపరలోనే ఈ కోట పెమ్మసాని వంశీకులకు లభించింది. వారు 300 సంవత్సరాలకు పైగా ఈ కోటను పాలించారు. తర్వాత గోల్కొండ నవాబు కులీకుతుబ్‌షా సైన్యాధికారి మీర్ జుమ్లా 1652 ఆగస్టు 255న నాటి గండికోట పాలకుడు పెమ్మసాని చిన్న తిమ్మానాయుడు నుంచి కోటను స్వాధీనం చేసుకున్నారు. మీర్ జుమ్లా తర్వాత గోల్కొండ సామంతులైన కడప నవాబులు పకీర్ ఖాన్ మహమ్మద్ ఖాన్ అనంతరం ఆసఫ్ జహీల ప్రతినిధి కవిదుల్లా ఖాన్ మోచామియా, ఆయన సతీమణి మదీనా బీబీ ఈ కోటను పాలించారు. ఆ వంశీకుల పాలనలోనే ఈ కోట టిప్పు సుల్తాన్‌కు దక్కింది. 1791లో ఇది ఆంగ్లేయుల పాలనలోనికి వచ్చింది. కోట ప్రాధాన్యత పోయింది. ప్రస్తుతం ఈ కోట కేంద్రపురావస్తు శాఖ ఆధీనంలో ఉంది.



### కోటలోనికి పోతే..

ఎత్తైనకోట ప్రధాన ద్వారం. దాని తర్వాత కొంచెం ముందు మరో ద్వారం ఉంటుంది. తలుపులు ఎంతో పెద్దవి! వీటిని తెరిచి, మూయడం మన వల్ల అయ్యే పని కాదు. అప్పట్లో ఈ తలుపులు మూసి తెరవడానికి ఏనుగులను వాడే వారట. శత్రువుల ఏనుగులు వచ్చి తలుపులను ఢీకొనకుండా తలుపులకు సూది మొనలా ఉన్న ఇనుప గుబ్బలను ఏర్పాటు చేశారు. తలుపులు తీయకుండా లోపలికి బయటికి వెళ్లేందుకు పక్కనే చిన్న ద్వారా కూడా ఉంది. ఇలాంటి తలుపులు కడప జిల్లాలో ఇంకెక్కడ కనిపించవు. కొంచెం ముందుకెళ్తే తలుపులు లేని ద్వారం ఉంటుంది. పక్కనున్న రాళ్ళ మీద నుంచి కోట గోడలపైకి వెళ్ళవచ్చు. ఈ గోడలపై లోపల బయటి వైపున సైనికులు పహారా కాయటానికి వీలుగా నడక దారి ఉంది. అసలు కోటలోనికి ప్రధాన గోడల్లో ఎద్దుల బండ్లు కూడా వెళ్లేందుకు దారి ఉంది. ప్రస్తుతం ఆ దారులన్నీ మూసివేయబడ్డాయి.

### ఎత్తుగా కనిపించే వాచ్ టవర్!



నవాబులు 16వ శతాబ్దంలో దీన్ని నిర్మించారు. శత్రువుల రాకపోకలను దానిపైకి ఎక్కి దూరం నుంచి చూసే సౌకర్యం కోసం దీన్ని నిర్మించారు. 400 సంవత్సరాలు అయినా ఇది చెక్కుచెదరలేదు. టవర్ అరుగుపై కూర్చుని, నిల్చుని పర్యాటకులు ఫోటోలు తీసుకుంటారు. యుద్ధంలో వాడే మర ఫిరంగి ఉంది. కోటలో జరిగిన యుద్ధంలో దీన్ని ఉపయోగించారు. ఇప్పుడు అది పని చేయడంలేదు. ఇనుప తీగల కంచె లోపల భారీగా ఓ భవనం ఉంది. అది జైలు, అప్పట్లో దొంగలు, యుద్ధ ఖైదీలను ఈ జైలులోనే వేసేవారు. ఇందులో రెండు మూడు రకాల గదులున్నాయి. చేసిన తప్పును బట్టి ఆయా గదుల్లో బందించేవారు. లోపల అంతా చీకటి. గదుల్లోకి వెళ్లే దారి తికమకగా ఉంటుంది. వెనక కిటికీలో నుంచి చూస్తే పంట పొలాలు, దూరంగా మాధవరాయ స్వామి ఆలయ రాజగోపురం కనిపిస్తుంది. ఇక్కడ చాలా సినిమా షూటింగులు జరుగుతుంటాయి.

పాతకాలపు నాటి వీధులు, పెద్ద గుంతలు, వాటిలో నీరు, నేల బావుల్లా ఉన్నాయి. వీటిని కోటలోనికి నీటి అవసరం కోసం రాజులు తొవ్వించినటువంటివే. ఆ తరువాత వీటి నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల పాడైపోయాయి. ఇటు అటు కుడివైపు కొండ రాళ్లు. ఎదురుగా మాధవరాయ స్వామి ఆలయం రాజగోపురం శత్రువుల దాడిలో కొద్ది భాగం ధ్వంసం అయింది. గోపురం కింద ద్వారం నుండి లోపలికి వెళ్తే ఇరువైపులలా, లోనా బయట వచ్చే వారికి స్వాగతం చెబుతున్న అద్భుతమైన యువతుల నృత్య భంగిమలను పరిశీలించవచ్చు. వారు ధరించిన, వస్త్రాలు, నగలు, 1000 ఏళ్ల క్రితం నాటి సాంస్కృతి సాంప్రదాయాలను ఈ శిల్పాలలో చూడవచ్చు. గోపురం లోపల రెండు వైపులా అద్భుతమైన శిల్ప సంపద ఉంది.

నేరుగా ఆలయంలోనికి వెళ్తే ఇనుప స్వభావం కల పెద్ద పెద్ద రాతిబండలు స్తంభాలతో ఉన్న ఈ ఆలయం ఎంతటి ఎండలోనైనా చల్లగా ఉన్నట్లు హాయిగా సేద తీరుస్తుంది. ఆలయమంతా ఇలాగే ఉంటుంది. మొదటిది పెద్ద హాలులా కనిపిస్తుంది. ఈ ఆలయ నిర్మాణం జిల్లాలోని ఒంటిమిట్ట సౌమ్యనాథ స్వామి ఆలయం ఆలయాన్ని తదితరాలను గుర్తుకు తెస్తాయి. ఈ విశాలమైన హాలులో రంగమండపం అన్ని రకాల కళాప్రదర్శనలు జరిగేవి. ఆనాడు ఇదే ప్రధాన వేదికగా ఉండేది వివాదాలు వాటి విచారణలు కూడా ఇక్కడే జరిగేవి. స్తంభాలు వాటి నిర్మాణ పద్ధతి అద్భుతంగా వుంటుంది. లోనికి వచ్చేటప్పుడు ఎడమవైపు స్తంభంపై గల ఓ శిల్పాన్ని గమనిస్తే ఒకవైపు నుండి ఎద్దుగాను మరోవైపు నుండి ఏనుగులా కనిపిస్తుంది. వీటి రెండింటికి శరీరాలు వేరుగా ఉన్నాయి. తల మాత్రం ఒకటే ఏనుగు తలను మూసి చూస్తే ఎద్దులా ఎద్దు తలను మూసి చూస్తే ఏనుగులా కనిపిస్తుంది. చాలా తమాషాగా ఉంటుంది. మనం కాగితంపై కూడా గీయలేని ఇలాంటి చమత్కార శిల్పాన్ని వెయ్యి సంవత్సరాల శిల్పులు శిల్పంలా చెక్కారంటే వారి క్రియేటివిటీ, నైపుణ్యాలు ఎంత గొప్పగా ఉండేవో అర్థం చేసుకోవచ్చు. ఈ శిల్పం నమూనా గుడి బయట దారిలో మలిచి వుంటుంది. ఈ శిల్పానికి సంబంధించి నమూనా, కోటలోని కత్తుల కోనేరు గట్టుపై కూడా ఉంది. గుడి అంతరాళం. గర్భగుడి.. దేవుడి ప్రతిమలుండేవి. ఇప్పుడు ఏ ప్రతిమలూ లేవు. అంతా ఎవరో తవ్వేసినట్లుంది.

1652 ఆగస్టు 25న గండికోటను మీర్‌జుమ్లా స్వాధీనం చేసుకున్నాడు. శత్రు సైనికులు ఇంకాసేపటికి ఆలయంలోనికి వస్తారని తెలిసినా కొందరు వీరులు పెద్దల సూచనలతో గర్భాలయం వెనుక గల కొన్ని రాళ్లను తొలగించి దేవతామూర్తుల విగ్రహాలను జాగ్రత్తగా బయటకు తరలించారు. ఆలయం వెనుక ద్వారా నుంచి పెన్నా నది లోయ, ఆ నది ద్వారా మైదుకూరు ప్రాంతానికి చేర్పించి బావిలో దాచారు. వందేళ్ల తర్వాత స్థానికులు గుర్తించి వాటిని వెలికి తీసి మైదుకూరులో వాటికి ఆలయం నిర్మించారు. వాటిని మనం నేటికీ అక్కడ చూడవచ్చు.





ఆలయం వెనుకల మూడు వైపులా వసారా గదులు నేటికీ పటిష్టంగా ఉన్నాయి. ప్రాకారంలోపల పాకశాల, అంటే వంటశాల అలంకార శాల, వెనుక కళ్యాణమండపం, ఉత్తరాన ఆళ్వార్ల మండపాలున్నాయి. చుట్టూ మూడువైపులా మొత్తం 56 స్తంభాల వసారా ఉంది. అన్ని స్తంభాలతో బాటు పై కప్పులో కూడా శిల్పాలను చూడవచ్చు. స్తంభాల వరుస భలేగా కనిపిస్తుంది.

మాధవరాయస్వామి ఆలయం చూసిన తర్వాత ఉత్తరం వైపు వెళ్తే అక్కడ అందమైన జుమ్మా మసీదు ఉంది. దాన్ని ఎదురుగా కత్తుల కోనేరు ఉంది. విశాలమైన కట్టడమే జుమ్మా మసీదు. వెలుపల 32 లోపల 64 గదులు వసారాలు ఉన్నాయి. వెలుపల గదిలో గుర్రాలను ఉంచేవారు. లోపల సైనికులు, సామంత రాజులు సభ చేసేవారు. రాజపీఠం స్థానంలో అందమైన మసీదు నిర్మించారు. ఎత్తైన అరుగుపై ఉజూఖానా కూడా ఉంది. ఉత్తరం వైపు మీసదు పైకి మెట్లు ఉన్నాయి. ఎదురుగా నిలుచుని మసీదును చూస్తే హైదరాబాద్ చార్మినార్ గుర్తొస్తుంది. దీని ఎదురుగా విశాలమైన కోనేరు ఉంది. చాలా పెద్ద కోనేరు. ఒకప్పుడు ఇందులోని నీటిని గండికోటలోని వారంతా వాడేవారు. యుద్ధం తర్వాత సైనికులు ఇందులో కత్తులను కడిగేవారట. అందుకే దీన్ని కత్తుల కోనేరు అంటారు.



మరో వైపు పెద్దభవనం ధాన్యాగారం. గండికోటలోని ప్రజలందరికీ రెండు సంవత్సరాలకు సరిపోయినంత ధాన్యాన్ని ఇందులో నిలువ ఉంచేవారట. విశాలమైన హాలుతో పాటు 12 స్తంభాలతో దీన్ని పాలించిన రాజుల్లో ఒకరైన మీర్‌జుమ్లా 16వ శతాబ్దంలో నిర్మించారు. ఎదురుగా వరుసలు కట్టి ఉన్న ధాన్యం బస్తాలను సులభంగా తీసుకోవటానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఏర్పాటు చేసుకున్నారు. రెండేళ్లపాటు ధాన్యం పాడవకుండా అవసరమైన వాతావరణ ఉండేలా దీన్ని నిర్మించడం విశేషం. దీని పైకి వెళ్ళటానికి ఉత్తరం వైపు నుండి మెట్లు ఉన్నాయి. పై నుంచి చూస్తే జుమ్మమసీదు కోటలోని మరిన్ని ప్రాంతాలు కనిపిస్తాయి.

రఘునాథస్వామి ఆలయం. దీన్ని రంగనాథ స్వామి ఆలయం అని కూడా అంటారు. దీన్ని పూర్తిగా రాయల వంశీకుల వాస్తు శిల్ప శైలిలో నిర్మించారు. ఆలయం అన్ని వైపులా అపురూపమైన శిల్ప సంపద ఉంది. ప్రధానం ద్వారం దాటగానే కాస్త ఎత్తైన పీఠంపై నిర్మించిన దృశ్యం కనిపిస్తుంది. లోపల వైష్ణవ సాంప్రదాయం ప్రకారం నిర్మించారు. రంగమంటపం, ముఖ మ ఒడపం, యాగశాల, అంతరాళం, గర్భాలయం ఉన్నాయి. రంగమంటపం ప్రతిస్తంభంలో గొప్ప శిల్పాలున్నాయి. స్తంభంపై గల శిల్పాల ద్వారా నాటి సాంప్రదాయాలనూ, మహిళల ఆభరణాలు, అలంకరణలు తెలుసుకోవచ్చు.

పురాణ కథనాలు శిల్పాలు గల స్థంభాలు కూడా ఉన్నాయి. ఈ ఆలయంలో కూడా మూలమూర్తి శిల్పం లేదు. యుద్ధ సమయములో సైనికులు దాన్ని దాచారు. ఆ తరువాత అంటే ప్రస్తుతం ఆ విగ్రహం మైలవరం మ్యూజియంలో ఉంది. ఆలయం పీఠం అడుగుచుట్టూ కూడా మంచి శిల్పాలు ఉన్నాయి. యుద్ధ శిల్పాలు, వాటి పక్కన ప్రజల సంస్కృతీ సాంప్రదాయాలను తెలిపే శిల్పాలు ఉన్నాయి. యోగా చేస్తున్న వ్యక్తి శిల్పం ఉంది. అంటే అప్పట్లోనే యోగాకు అంత ప్రాధాన్యత ఉన్నట్లు అర్థమవుతుంది.

ప్రధానంగా ఆలయ ఉత్తర ప్రాకారం నుంచి పడమర వరకు గోడపై దశావతారాల రేఖాచిత్రాలు ఎంత బాగున్నాయో. మరో వైపు 1545లో నంద్యాల తిమ్మరాయ దేవ మహారాజు వేసిన దాన శాసనాలు 1557 నాటి నంద్యాల చిన్న అహోబలేశ్వర మహారాజు వేసిన దాన శాసనాలు చూడవచ్చు. గుడి బయటకు వస్తే పెద్ద పెద్ద రాళ్ళ కనపడతాయి. పెన్నా లోయ, పెన్నా నది ఇక్కడ ఈ కొండను ఢీ కొట్టి గండి కొట్టి రెండుగా చీల్చుకొని ప్రవహిస్తూ ఉంది. అందుకే ఈ కోటకు గండికోట అనే పేరు వచ్చింది. అలా ఆ నదిని చూడడం నిజంగా గొప్ప అనుభూతినిస్తుంది. ప్రపంచంలో ఇలాంటి ప్రదేశం అమెరికాలోని గ్రాండ్ కేయిన్ మినహా మరొకచోట లేదు. ప్రపంచంలోనే ఇలాంటి అద్భుతమైన సౌందర్యమైన లోయ ఇదే రెండవది, మనదేశంలోనే ఇలాంటిది ఒక్కటే ఉంది. అందుకే ఈ ప్రాంతంలోనే మన పర్యాటక రంగానికి ప్రపంచస్థాయిలో గొప్ప పేరు వచ్చింది.

త్వరలోనే అధికారులు ఇంటాక్ సంస్థ పర్యాటక ప్రియుల ప్రయత్నాలు ఫలిస్తే యునెస్కో గుర్తింపు కూడా లభిస్తుంది. ఇటు నుంచి అవతల వైపు ఒడ్డుకు త్వరలో రోప్‌వే వేసేటువంటి ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఉదయం (సూర్యోదయం), సాయంత్రం (సూర్యాస్తమయం) వేళ ఎంతో మనోహరంగా ఉంటుంది. కోటలో 101 బురుజులు ఉండేవట. కోట మొత్తం విస్తీర్ణం ఎనిమిది మైళ్ళు ఉంది. అందుకే దక్షిణ భారతదేశంలోని నాలుగు అతిపెద్ద కోటల్లో గండికోట కూడా ఒకటి.

– పంతుల పవన్ కుమార్,
ఇంటాక్ లైఫ్ మెంబర్ సభ్యుడు,
కడప

ద



# గండికోట అభివృద్ధిలో ఇంటాక్ కృషి

గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధిచెంది భారతదేశానికే తలమానికంగా నిలిచిన ప్రముఖ చారిత్రక పర్యాటక కేంద్రం గండికోట ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసే కృషిలో ఇంటాక్ అగ్రభాగాన నిలుస్తోంది. తొలి నుంచి గండికోటకు యునెస్కో గుర్తింపు తీసుకురావాలనే సంకల్పంతో అనేక పర్యాయాలు అటు అధికారులు, ఇటు పాలకుల దృష్టికి వినతుల రూపంలో తీసుకెళ్తూనే ఉంది. కొద్ది నెలల క్రితం వైయస్సార్ కడప జిల్లా మైదుకూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు గండికోట అభివృద్ధిపై ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్, గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ లయన్ కె. చిన్నపరెడ్డి వినతిపత్రం సమర్పించారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.



గండికోటలో పర్యాటక అభివృద్ధిలో భాగంగా అక్కడ మెరుగైన హోటళ్లు, రిసార్ట్‌ల నిర్మాణంపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఇటీవల గండికోటలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇంటాక్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి హాజరై రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించి ఎంఓయూ కుదుర్చుకోవడం కీలక పరిణామం. ఈ ప్రయత్నం కార్యరూపం దాలిస్తే గండికోటలో సుందర గ్రామీణ వాతావరణంలో పర్యాటక హోటళ్లు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

ఎంతో చారిత్రక ప్రాధాన్యత కలిగిన గండికోట విశేషాలను ప్రతి ఒక్కరికి చేరువ చేయాలనే సంకల్పంతో 'మన గండికోట' పేరుతో ఇంటాక్ ఆధ్వర్యంలో బుక్‌లెట్‌ను ప్రచురించి పదివేల ప్రతులను పర్యాటకులకు, విద్యార్థులకు, వివిధ వర్గాల వారికి ఉచితంగా పంపిణీ చేయడం విశేషం.

ఏటా పర్యాటక దినోత్సవం సందర్భంగా గండికోటలో ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో ఇంటాక్ పాలుపంచుకుంటోంది.

పర్యాటక ప్రాంతంగా గండికోటను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటైన గండికోట అభివృద్ధి




కమిటీలో ఇంటాక్ కన్వీనర్‌కు సైతం స్థానం కల్పించడం గండికోట అభివృద్ధి పట్ల ఇంటాక్ కనబరుస్తున్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనం.

ఇంటాక్ కడప చాప్టర్ ఆధ్వర్యంలో ప్రతినెల వెలువడుతున్న 'మన చరిత' మాసపత్రిక ద్వారా గండికోట ఘన కీర్తిని ఎలుగెత్తి చాటుతూనే ఉంది.

పురావస్తు శాఖ ఆధ్వర్యంలో గండికోట అభివృద్ధి కోసం జరిగే అనేక కార్యక్రమాల్లో ఇంటాక్ భాగస్వామ్యం పంచుకుంటోంది. హెరిటేజ్ వాక్ నిర్వహణతో పాటు యోగా దినోత్సవాన్ని సైతం గండికోటలోని మాధవరాయ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించడం విశేషం.



గండికోటను ప్రపంచంలోనే ఒక అద్భుతమైన పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ ఇన్వెస్ట్మెంట్ (సాస్కి) పథకం కింద విడుదల చేసిన రూ. 80 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనుల నిర్వహణలో అవసరమైన తగు సూచనలు, సలహాలు ఇవ్వడంలో ఇంటాక్ తన వంతు పాత్ర పోషిస్తోంది.

గండికోట చరిత్రను విద్యార్థులకు తెలియజెప్పాలనే లక్ష్యంతో పర్యాటక పర్యటనలు సైతం ఇంటాక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది.

గండికోటను పర్యాటకపరంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తూ గండికోట చరిత్రలో ఇంటాక్ సైతం తనకంటూ ఓ అధ్యాయాన్ని లిఖించు కుంటోంది.

కాగా గండికోట తో పాటు తొలి తెలుగు శాసనం వెలుగు చూసిన వైయస్సార్ కడప జిల్లాలోని కలమల్లను సైతం పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ఇంటాక్ ముందుకు సాగుతోంది.

– కంభం చిన్నపరెడ్డి
కడప – ఇంటాక్ కన్వీనర్
m : 9885566644







# చౌసత్ యోగిని ఆలయాలు

దేశంలోని పురాతన ఆలయాల్లో యోగిని ఆలయాలకు ఓ ప్రత్యేకత ఉంది. అందుకే భారత్ వివిధ రాష్ట్రాల్లో నెలకొని ఉన్న యోగిని ఆలయాలను సీరియల్‌గా పరిగణిస్తూ వాటిని యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సెంటర్‌కు సంబంధించి 2025 మార్చి 7న భారత తాత్కాలిక జాబితాలో చేర్చింది. ఈ ఆలయాలతో పాటు మొత్తం ఆరు కట్టడాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో ఉన్న ప్రముఖ యోగిని ఆలయాలపై కథనం...

చౌసత్ యోగిని దేవాలయాలలో యోగినిల 64 శిల్పాలు ఆ యోగినుల వ్యక్తిగత గదులలో ఉంటాయి లేదా మందిరంలో వృత్తాకారంగా అమర్చబడిన క్లిష్టమైన రాతి శిల్పాలతో ఉంటాయి. ఈ దేవాలయాలు ఎక్కువగా కొండలపై ఉన్నాయి. యోగిని అనేది యోగ సాధన చేసే స్త్రీని సూచిస్తుంది. చౌసత్ అనేది 64 సంఖ్యకు హిందీ పదం. యోగినిల సంఖ్య 64. అందుకే చౌసత్ యోగిని అని పిలుస్తారు. వారంతా అడవుల్లోని ఆత్మలు, మాతృ దేవతల సమూహం. తాంత్రిక శక్తులకి భయపడేవారిచే, వాటి కోసం సాధన చేసే వారిచే చౌసత్ యోగినిలు పూజలందు కుంటారు. ఈ యోగినులు ఆకర్షణీయమైన రూపంతో, బెదిరింపు లక్షణాల స్వరూపంతో ఉంటారు. అలాగే ఈ సమూహంలోని దేవతలు ఎంతో మంది తమను తాము యోగినిలుగా భావించుకుంటారు.



దేశంలో 9-12వ శతాబ్దాల మధ్య యోగినిలను ఆరాధించే తెగ చాలా శక్తివంతమైందిగా ఉండింది. మధ్య భారత దేశం లోని పాత గోండ్వానా అడవులలోని తెగల ప్రజలు చౌసత్ యోగినిల అసలు భక్తులు. కాలక్రమంలో సంప్రదాయ హిందూ దేవతలు చౌసత్ యోగినులలో కలిసిపోయారు.

ఈ ఆరాధన స్త్రీత్వాన్ని, స్త్రీ శక్తిని వేడుక చేసుకునేదిగా ఉంటుంది. ఈ ఆలయాలు సాధారణంగా వృత్తాకారంగా, ఎత్తైన నేలపై (లేదా పీఠంపై), ఆకాశానికి తెరిచి ఉన్నట్లుగా ఉంటాయి. 64 స్త్రీ రూపాల విగ్రహాలు ఆలయం చుట్టు ఉన్న గదులలో ఉంటాయి. నృత్యకారులు బహుశా మధ్య ప్రాంగణంలో నృత్యం ప్రదర్శించేవారు. భారతదేశంలో ఇటువంటి ఆలయాలు దాదాపు 13 ఉన్నాయి. వాటిలో 8 మధ్యప్రదేశ్‌లో ఉన్నాయి. వీటిలో మధ్యప్రదేశ్‌లోని ఖజురహో, భేదా ఘాట్, మితావలి, దుద్హాయ్, బాడో, హింగ్లాజ్‌గఢ్, శాదోల్, నరేసర్‌లోని చౌసత్ యోగిని దేవాలయాలు ఒడిశాలోని హిరాపూర్, రాణిపుర్ ఆలయాలు, ఉత్తరప్రదేశ్‌లోని లఖేరి, రిఖియాన్, తమిళనాడులోని కాంచీపురం ఆలయాలు ఉన్నాయి. ఈ డాక్యుమెంట్ సీరియల్ నామినేషన్ కోసం ఉంచబడిన పదమూడు దేవాలయాల వివరాలను అందిస్తుంది.

### చౌసత్ యోగిని ఆలయం, ఖజురహో

ఖజురహోలోని చౌసత్ యోగిని ఆలయం యోగినిలకు అంకితం చేయబడిన ఒక పురాతన ఆలయం. 9వ శతాబ్దం చివరలో చందేలా రాజవంశం ఆధ్వర్యంలో నిర్మించబడిన ఈ ఆలయం ఈ ప్రాంత నిర్మాణ, సాంస్కృతిక వారసత్వానికి ఉదాహరణగా నిలుస్తుంది. ఇది ప్రపంచ వారసత్వ ప్రదేశ సమిష్టిలో భాగం. ఈ ఆలయం శివ-సాగర్ సరస్సు నైరుతి దిశలో రాతి గుండ్లపై ఉంది. ఈశాన్య దిశ ముఖంగా ఉంది. ఈ ఆలయం చాలా ప్రత్యేకమైనది. భారత దేశంలో కనిపించే చాలా యోగిని దేవాలయాలు వృత్తాకారంలో ఉంటాయి. ఇది మాత్రం దీర్ఘచతుర ప్రాకారంలో ఉంటుంది.

### చౌసత్ యోగిని ఆలయం, మితావలి

మధ్యప్రదేశ్‌లోని మితావలిలోని చౌసత్ యోగిని ఆలయం 11వ శతాబ్దంలో గుర్జార-ప్రతిహార రాజ వంశం ఆధ్వర్యంలో నిర్మితమైంది. ఇది ఒక కొండపై ఉంది. ఈ ఆలయం వృత్తాకార లేఅవుట్‌ను కలిగి ఉంది. ప్రధాన దేవతకు అంకితం చేయబడిన కేంద్ర మందిరం, దాని చుట్టూ వృత్తాకార నమూనాలో 64 అనుబంధ మందిరాలు ఉన్నాయి. ప్రతి అనుబంధ మందిరంలో స్త్రీ దైవత్వం వివిధ వ్యక్తీకరణలను సూచించే ఒక్కో దేవత శిల్పం ఉంది. ప్రధాన గది మొదట దేవికి అంకితం చేయబడింది. కానీ ప్రస్తుతం అన్ని గదులలో శివుని శిల్పాలున్నాయి.

### చౌసత్ యోగిని ఆలయం, జబల్పూర్

చారిత్రక నగరమైన జబల్పూర్ లో ఉన్న చౌసత్ యోగిని ఆలయం 10వ శతాబ్దానికి చెందినది. ఈ వృత్తాకార రాతి ఆలయం కలచురి రాజవంశం కాలంలో అపార చారిత్రక, మత, కళాత్మక ప్రాముఖ్యతను కలిగి ఉంది. యోగ అభ్యాసాలతో ముడిపడి ఉన్న 64 యోగిని, స్త్రీ దేవతల ఆరాధనకు ఈ ఆలయం నిలయంగా మారింది. ఈ ఆలయం ఒక కొండపై ఉంది. చుట్టుపక్కల ప్రకృతి దృశ్యం రమణీయంగా ఉంటుంది. ఈ ఆలయం వృత్తాకారంగా ఉంటుంది. దాని చుట్టూ కేంద్రీకృత నమూనాలో అమర్చబడిన 81 అనుబంధ మందిరాలు ఉన్నాయి. మిగిలిన శిల్పాలు గణేష్, భైరవ, హనుమంతుడితో సహా బ్రాహ్మణీక దేవతలవి. చౌసత్ యోగిని ఆలయంలో ప్రాంగణం, స్తంభాల మందిరాలు, మెట్ల చెరువు వంటి ఇతర అనుబంధ నిర్మాణాలు ఉన్నాయి.



**చౌసత్ యోగిని ఆలయం, బడో**

దుదహికి దక్షిణంగా కేవలం ముప్పై మైళ్ల దూరంలో ఉన్న బడో పట్టణం ఉంది. ఈ నగరంలోనే గదర్మల్ ఆలయం ఉంది. ఇది నలభై రెండు యోగినిల మరొక ఆలయంగా కనిపిస్తుంది. ఈ ఆలయం దీర్ఘచతురస్రాకారంలో ఉంటుంది. కొన్ని జైన ఆలయాలకు ఆనుకుని ఉన్న పొడవైన, భారీ శిఖరంతో కూడి ఉంటుంది. నలభై రెండు యోగినిల శిల్పాలు ఉన్న ఈ రెండు మందిరాలు 950-1100 మధ్య కాలానికి చెందినవి కావచ్చు.

**చౌసత్ యోగిని ఆలయం, హింగ్లాజ్‌గఢ్**

రాజస్థాన్, మధ్యప్రదేశ్ సరిహద్దులోని హింగ్లాజ్‌గఢ్ ప్రదేశంలో గాంధీ సాగర్ ఆనకట్ట నిర్మాణం కోసం ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయిస్తున్నప్పుడు భారీ సంఖ్యలో శిల్ప అవశేషాలు లభించాయి. ఈ ఆలయం వృత్తాకార రూపకల్పనలో ఉంది. ఐదు వందలకు పైగా శిల్పాలలో, అనేక శకలాలు కలిగిన యోగిని శిల్పాలు, మహిషాసుర మర్దిని శిల్పం గుర్తించబడ్డాయి.

**చౌసత్ యోగిని ఆలయం, శాదోల్**

పురాతన శాసనాలలో సహస-దోల్లకా అని పిలువబడే మధ్యప్రదేశ్‌లోని శాదోల్ జిల్లా, రెండు సమూహాలుగా విభజించ బడిన యోగిని శిల్పాల పెద్ద కలెక్షన్ ను అందించింది. వీటిలో ఒకటి కూర్చున్న యోగినిల శ్రేణి, మరొకటి నిలబడి ఉన్న శిల్పాల శ్రేణి. ఈ రెండు సమూహాలు కూడా శైలీకృతంగా, పాలియో గ్రాఫికల్‌గా కలిసి ఉన్న లేబుల్స్ ను అందించాయి. దురదృష్టవశాత్తు రెండు ఆలయాల కచ్చితమైన స్థానాన్ని గుర్తించడం సాధ్యం కాదు. ఈ శాదోల్ యోగినిల శిల్పాలు నేడు మూడు వేర్వేరు ప్రదేశాలలో చెల్లాచెదురుగా ఉన్నాయి.



**చౌసత్ యోగిని ఆలయం, నరేసర్**

గ్వాలియర్ మ్యూజియంలో ఎక్కువగా ఉంచబడిన యోగినిల ఇరవై శిల్పాలు ఈ శతాబ్దం ప్రారంభంలో నరేసర్ ప్రదేశం నుండి సేకరించ బడ్డాయి. గ్వాలియర్ నుండి దాదాపు పదిహేను మైళ్ల దూరంలో, ఒక ఒంటరి సుందర లోయలో, ఒక జలపాతంలా ప్రవహించే ప్రవాహం ఉన్న నరేసర్ ఈ నిర్మాణ కార్యకలాపాలకు కేంద్రంగా కనిపిస్తుంది. నేడు ఈ ప్రదేశంలో ఇరవైకి పైగా చిన్న శైవ దేవాలయాల సమూహం ఉంది. మొదట్లో మరిన్ని పుణ్యక్షేత్రాలు ఉన్నట్లు అనిపిస్తుంది. దురదృష్టవశాత్తు ఇక్కడ యోగిని ఆలయం యొక్క పునాదులు ఏవీ లేవు, కానీ దాని స్థానానికి ఒక అవకాశం ఉన్న ప్రదేశంగా కొండ పైభాగంలో ఒక చిన్న కృత్రిమ చెరువు కనబడుతోంది. నరేసర్ యోగిని శిల్పాలు 12వ శతాబ్దం చివరి దశాబ్దాల నాటివి.

**చౌసత్ యోగిని ఆలయం, లోఖారి**

ఉత్తర ప్రదేశ్‌లోని బందా జిల్లాలోని ఒక ఒంటరి కొండ పైన, లోఖారి గ్రామం సమీపంలో, యోగిని ఆలయ గోడలను ఏర్పరచిన పెద్ద మొత్తంలోని రాతి దిమ్మెలతో పాటు ఇరవై యోగిని శిల్పాలు ఉన్నాయి. ఈ ఆలయం వర్తమాన శకం పదవ శతాబ్దం మొదటి భాగంలో నిర్మించబడిందని చెబుతారు. ఒకప్పుడు యోగిని ఆలయాన్ని కలిగి ఉన్న రాతి దిబ్బకు ఆనుకుని ఉన్న కొండవాలులో చెక్కబడిన శకలాలు ఉన్నాయి. బహుశా 10వ శతాబ్దానికి చెందిన ఆ శిల్పాలు సమీపంలో ఉన్న మరొక మందిరానికి చెందినవి కావచ్చు. యోగిని ఆలయం బహుశా అదే కాలానికి చెందిన దిగా కనిపిస్తుంది. 1980లలో లోఖారి నుండి మేక తల గల యోగిని శిల్పం మాయమైపోయింది. చివరకు లండన్‌లో అది కనుగొనబడింది, తరువాత దీనిని 2022లో భారతదేశానికి తిరిగి ఇచ్చారు.

**చౌసత్ యోగిని ఆలయం, దుదాహి**

మధ్య భారతదేశంలోని లలిత్‌పూర్ పట్టణం నుండి దాదాపు ఇరవై మైళ్ల దూరంలో దుదాహి అనే చిన్న గ్రామం ఉంది. దాని అవతల ఒకప్పుడు ఆ పేరుతో సంపన్నమైన పాత పట్టణం విస్తృతమైన శిథిలాలు చూడవచ్చు. ఇది చందేలా పాలకుల పాలనలో ఒక అభివృద్ధి చెందుతున్న కేంద్రంగా ఉండేది. అందుకే, రాజులు ఖజురాహోలో చేసినట్లుగా, ఒక కృత్రిమ చెరువు ఒడ్డున అనేక దేవాలయాలను నిర్మించడం అనేది చాలా ముఖ్యమైనది. దీనిని స్థానికంగా అఖాడ అని పిలుస్తారు.

**చౌసత్ యోగిని ఆలయం, రిఖియాన్**

ఉత్తరప్రదేశ్‌లోని బందా జిల్లాలోని ఖజురాహో నుండి దాదాపు నూట యాభై మైళ్ల దూరంలో, జుమ్నా నది దక్షిణ ఒడ్డున నిర్జనమైన రిఖియాన్ లోయ ఉంది. అక్కడ చల్లటి మంచినీటిని అందించే ఒక నీటి బుగ్గ ఉంది. ఒక రాతి గుహపై ఒక ఒంటరి ఆలయం మాత్రమే ఉంది. రిఖియాన్ యోగిని ఆలయం ఇప్పుడు లేదు, కానీ ఖజురాహో లాగా, ఇది దీర్ఘచతురస్రాకారంలో ఉందని ఊహించవచ్చు. చక్కటి పనితనం కలిగిన ఇసుకరాయి యోగిని శిల్పాల కాలనిర్ణయం అంత సులభం కాదు. హాలో లేకపోవడం, సహాయకులు, ఎగిరే జంటలు లేకపోవడం వంటి అంశాలు ఈ యోగిని శిల్పాలకు ఒరిస్సా దేవాలయాలతో గల అనుబంధాన్ని సూచిస్తుంది. ఒక అంచనా ప్రకారం రిఖియాన్ యోగిని శిల్పాలు 10వ శతాబ్దం ప్రారంభ కాలానికి చెందినవి.

**చౌసత్ యోగిని ఆలయం, కాంచీపురం**

ఈ చౌసత్ యోగిని ఆలయం తమిళనాడులోని కాంచీపురం సమీపంలోని కావేరిపాక్కంలో ఉంది. చోళుల కాలం (వర్తమాన శకం 900 సంవత్సరపు) నాటి అనేక యోగిని శిల్పాలను ఈ ప్రదేశం నుండి స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఒకటి ఇప్పుడు బ్రిటిష్



మ్యూజియంలో, మరికొన్ని మద్రాస్ మ్యూజియంలో, బ్రూక్లిన్ మ్యూజియం, మిన్నియా పాలిస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్, డెట్రాయిట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్, రాయల్ ఒంటారియో మ్యూజియంలో ఉన్నాయి. బ్రిటిష్ మ్యూజియం లోని యోగిని శిల్పం కాంచీపురానికి చెందినదిగా చెబుతారు. దాని సేకరణ స్థలం తెలియనప్పటికీ, అదే శైలికి చెందిన అనేక శిల్పాలు కావేరిపాక్కం వద్ద ఉన్న ఒక పెద్ద చెరువు వద్ద లభించాయి. ఈ నేపథ్యంలో బ్రిటిష్ మ్యూజియం లోని విగ్రహం ఇక్కడి సమీప దేవాలయాల నుండి తీసుకెళ్లినట్లు అనిపిస్తుంది.

**చౌసత్ యోగిని ఆలయం, హీరాపూర్**

హిరాపూర్ లోని యోగిని ఆలయం దేశంలోని అన్ని యోగిని ఆలయాలలోకి అతి చిన్నది. ఇది కేవలం ముప్పై అడుగుల వ్యాసం కలిగి ఉంటుంది. రాతి గోడలు కేవలం ఎనిమిది అడుగుల ఎత్తులో ఉంటాయి. ఈ మందిరం సాధారణంగా 9వ శతాబ్దం చివరి లేదా 10వ శతాబ్దం ప్రారంభంలో నిర్మించబడింది. ఈ శిల్పాల అచ్చులు ఇక్కడ సరళ రూపంలో ఉన్నప్పటికీ, ముక్తేశ్వర ఆలయంలో కనిపించే రకం III అచ్చులను పోలి ఉంటాయి. హీరాపూర్ యోగిని శిల్పాలు అసాధారణమైన అందమైన వ్యక్తులకు ప్రతిరూపంగా ఉంటాయి. దీనిని భౌమకర రాజవంశం (వర్తమాన శకం 8వ శతాబ్దం) రాణి హీరా నిర్మించింది. ఆమె పేరుమీదుగానే ఈ గ్రామానికి ఆ పేరు వచ్చింది.



**చౌసత్ యోగిని ఆలయం, రాణిపుర్**

ఒరిస్సా మారుమూల భాగంలో, సమీప పట్టణమైన టిట్లగఢ్ నుండి అనేక మైళ్ళ దూరంలో, రాణిపుర్, ఝురియాల్ అనే చిన్న గ్రామాల మధ్య ఒక రాతి ప్రదేశం ఉంది. ఈ ప్రదేశం గత కాలపు ప్రాముఖ్యతకు నిదర్శనంగా రాతిపై నిర్మించిన అనేక చిన్న రాతి ఆలయాల అవశేషాలు, సమీపంలోని ఒక పెద్ద ఇటుక ఆలయం, బౌద్ధ అవశేషాలను కలిగి ఉన్న ఒక ప్రదేశం కూడా ఉన్నాయి. రాతి దిబ్బకు కిరీటంలా అరవై నాలుగు యోగినిల వృత్తాకార ఆలయం ఉంది. దాని పాదాల వద్ద ఒక పెద్ద సహజ చెరువు ఉంది.

**వివరణ:** చౌసత్ యోగిని ఆలయాలు వాటి హైపెథ్రల్ డిజైన్, వృత్తాకార ప్రణాళిక రూపంలో ప్రత్యేకమైనవి. ఇది కాలచక్రం, విశ్వ క్రమం, నిరంతర శక్తి ప్రవాహానికి ప్రతీక.సాధారణంగా కనిపించే ఆలయం పరిధీయ నిర్మాణంలో సమాన పరిమాణంలో పలు (సాధారణంగా 64) గదులతో కూడిన వృత్తాకార లేఅవుట్, స్తంభాల పెవిలియన్ కలిగి ఉంటుంది. బయటి గోడ స్తంభాలచే మద్దతు ఇవ్వబడుతుంది. ఒక్కో వ్యక్తిగత గది (విభాగం) ఒక్కో యోగినికి ఆమె విగ్రహంతో అంకితం చేయబడి ఉంటుంది. అన్ని చోట్లా 64 మంది యోగినులు ఉండకపోవచ్చు. ఆ సంఖ్యలో మార్పు ఉంటుంది.

**అత్యుత్తమ సార్వత్రిక విలువ సమర్థన**

**నిర్మాణ వైభవం:** అసాధారణమైన డిజైన్ ఎంపిక అయిన వృత్తాకార రూపం అనేది ప్రత్యేకంగా 64 యోగినిల ఆచార, సామూహిక ఆరాధనను సులభతరం చేయడానికి ఉద్దేశించబడింది. ఈ ఆలయాలకు పైకప్పు లేకపోవడం అనేది తాంత్రిక ఆచారాలలో అంతర్భాగంగా ఉన్న సహజ అంశాలు, ఆకాశంతో వాటి సంబంధాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. రాతి శిల్పాల నైపుణ్యం, డీటైల్స్, ముఖ్యంగా యోగిని దేవతలు, 9-12వ శతాబ్దాల మధ్య కళాకారుల కళాత్మక తేజస్సు, సౌందర్య సున్నితత్వాన్ని ప్రముఖంగా చాటిచెబుతాయి.

**చారిత్రక ప్రాముఖ్యత:** ఈ దేవాలయాలన్నీ 9-10వ శతాబ్దంలో నిర్మించబడ్డాయి. ఈ చౌసత్ యోగిని దేవాలయాలు వరుసగా చందేలా, గుర్జారా-ప్రతిహార, కలచురి, కచ్ఛప-ఘట, భౌమకర రాజవంశాల కళాత్మక, సాంస్కృతిక విజయాల గురించి గణనీయమైన అంతర్దృష్టులను అందిస్తాయి. అవి వాటి నిర్మాణ పోషణ, మతపరమైన ఆచారాలు, సాంస్కృతిక వారసత్వాన్ని అర్థం చేసుకోవడానికి, గతంతో స్పష్టమైన సంబంధాన్ని ఏర్పరచడానికి దోహదపడతాయి.

**సాంస్కృతిక వారసత్వం:** చౌసత్ యోగిని దేవాలయాలు స్త్రీ శక్తిని నొక్కి చెప్పే యోగిని దేవతల ఆరాధనతో ముడిపడి ఉన్న పురాతన యోగ, తాంత్రిక పద్ధతులను సూచిస్తాయి. ఇది భక్తి, ధ్యానం, దైవిక స్త్రీ శక్తితో అనుసంధానించే ప్రదేశంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉంది.

**ప్రమాణం (iii):** వివిధ ప్రాంతాలలో వివిధ పాలకుల పాలనలో 9-12వ శతాబ్దాల మధ్య ప్రబలంగా ఉన్న పురాతన యోగ, తాంత్రిక సంప్రదాయాలకు ఈ ఆలయాలు ఒక ప్రత్యేక సాక్ష్యంగా పనిచేస్తాయి. ఇది యోగిని దేవతల ఆరాధనతో ముడిపడి ఉన్న ఆధ్యాత్మిక పద్ధతులను ప్రతిబింబిస్తుంది. పురాతన భారతీయ సాంస్కృతిక, మత సంప్రదాయాల గురించి మన అవగాహనకు దోహదపడుతుంది. ఇతర ఆలయాలు విష్ణు, శివ వంటి ప్రధాన స్రవంతి దేవతలపై దృష్టి సారిస్తుండగా, చౌసత్ యోగిని ఆలయాలు మాత్రం యోగినుల ఆరాధన, తాంత్రిక పద్ధతులపై దృష్టి సారించిన మరింత నిగూఢమైన, ఆధ్యాత్మిక అంశాన్ని ప్రముఖంగా చాటిచెబుతాయి. మతపరమైన ఆచారం, నిర్మాణ రూపం లోని ఈ వైవిధ్యం ఈ ఆలయాల ప్రపంచ ప్రాముఖ్యతను పెంచుతుంది.

**ప్రమాణం (iv):** చౌసత్ యోగిని దేవాలయాల వృత్తాకార లేఅవుట్ భారతదేశంలోని ఇతర దేవాలయాల రకాల నుండి వాటిని వేరు చేస్తుంది. ఇతర ఆలయాలు సాధారణంగా దీర్ఘచతురస్రాకారంలో లేదా చతురస్రాకారంలో ఉంటాయి. యోగిని ఆలయాల వినూత్న రూపకల్పన, ప్రకృతితో ఏకీకరణ, యోగిని కల్ట్ ఆచార ప్రాముఖ్యతతో



కలిపి, వాటిని ఒక ఆదర్శవంతమైన కళాత్మక, నిర్మాణ వైభవంగా చేస్తాయి. వాటి వృత్తాకార రూపకల్పన, కచ్చితమైన రీతిలో రాతి శిల్పాలు, ప్రారంభ మధ్యయుగ భారతదేశంలో నిర్మాణ చాతుర్యానికి సంక్లిష్ట వివరణాత్మక ప్రాతినిధ్యం వహిస్తాయి. చౌసత్ యోగిని ఆలయాలు కళాకారుల నైపుణ్యాన్ని అసాధారణంగా ప్రదర్శిస్తాయి. వృత్తాకార, పైకప్పు లేని నిర్మాణాలు దేవతలు ప్రకృతి అంశాల మధ్య సంబంధాన్ని, ముఖ్యంగా ఆకాశంతో అనుబంధాన్ని నొక్కి చెబుతాయి.



**భవిష్యత్ నామినేషన్ మొత్తానికి సంబంధించి కాంపోనెంట్ పార్ట్(లు) ఎంపిక సమర్థన:**

చౌసత్ యోగిని దేవాలయాలు ప్రారంభ మధ్యయుగ ఆలయ నిర్మాణానికి అసాధారణమైన ఉదాహరణగా నిలిచాయి. ప్రత్యేకమైన నిర్మాణ ఆవిష్కరణ, మత, ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలతో పాటు ప్రకృతితో వాటి ఏకీకరణను కలిగి ఉన్నాయి. వాటి అత్యుత్తమ సార్వత్రిక విలువ, వాటి చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతతో కలిపి, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా భవిష్యత్తులో నామినేట్ కావడానికి వాటి ఎంపికను సమర్థిస్తుంది. ఈ దేవాలయాలు భారత పురావస్తు సర్వే (ASI) కింద గుర్తించబడిన స్మారక చిహ్నాలు, జాతీయ వారసత్వ చట్టం ద్వారా రక్షించబడతాయి. కొన్ని ఆలయాలలో, ఆలయాలు, వాటి పరిసర ప్రాంతాల సంరక్షణ, పరిరక్షణ, నిర్వహణను నిర్ధారించడానికి పరిరక్షణ ప్రయత్నాలు అమలులో ఉన్నాయి, మరికొన్నింటికి వాటి అవశేషాలను సంరక్షించడానికి మరింత దృఢమైన చర్యలు అవసరం. క్రమం తప్పకుండా నిర్వహణ, కాలానుగుణ పునరుద్ధరణ, అవగాహన కార్యక్రమాలు ఈ ప్రదేశాల సుస్థిర రక్షణకు దోహదం చేస్తాయి. ఈ ఆలయాలు భారతదేశ పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలు, అవశేషాల చట్టం నిబంధనల ప్రకారం రక్షించబడుతున్నాయి. నిర్వహణ, నిర్ణయం తీసుకునే ప్రక్రియలలో స్థానిక సమూహాలు, మేధావులు, వారసత్వ పరిరక్షణ నిపుణులను ఏఎస్ఐ సంప్రదిస్తోంది.



**ప్రామాణికత లేదా సమగ్రత ప్రకటనలు**

చౌసత్ యోగిని దేవాలయాలు వాటి రూపం, పదార్థాలు, స్థానం, పనితీరు, సాంస్కృతిక ప్రాముఖ్యత పరంగా అధిక స్థాయి ప్రామాణికతను కలిగి ఉన్నాయి. పూర్తిగా శిథిలావస్థలో ఉన్న కొన్ని ఆలయాలు మినహాయిస్తే, మిగిలిన ఆలయాలు వాటి అసలు లేఅవుట్, పదార్థం, నిర్మాణ పద్ధతులను కలిగి ఉన్నాయి. శిల్పాలను తాంత్రిక ఐకానోగ్రాఫిక్ సూత్రాలను ఉపయోగించి చెక్కారు, ఇవి మనుగడలో ఉన్న శిల్పాలలో కనిపిస్తాయి. అనేక చౌసత్ యోగిని ఆలయాలు వ్యూహాత్మకంగా కొండలపై లేదా ఎత్తైన భూభాగంలో ఉంచబడ్డాయి. తద్వారా చుట్టుపక్కల ప్రకృతి రమణీయత విస్తృత దృశ్యాలను అందిస్తాయి. ఈ వాతావరణం ఆధ్యాత్మిక ఔన్నత్య భావనను ఇనుమడింపజేస్తుంది. ఇక్కడ ఆలయం అనేది లౌకిక జీవితం నుండి మనిషిని వేరుచేయడం, దైవిక శక్తి, ప్రకృతితో సహవాసం చేయించడం చేస్తుంది.

**ఇతర సారూప్య లక్షణాలతో పోలిక**

చౌసత్ యోగిని దేవాలయాలన్నీ వేర్వేరు రాజుల పోషణలో నిర్మించబడ్డాయి. భారతదేశంలోని ఏకైక దీర్ఘచతురస్రాకార చౌసత్ యోగిని దేవాలయాలు ఇవి. అమరావతి మహాచైత్యం అనేది ఆచారాల్లో ప్రదక్షిణ కోసం ఉపయోగించే వృత్తాకార రూపకల్పన కలిగిన పురాతన బౌద్ధ స్థూపం. చౌసత్ యోగిని దేవాలయాల మాదిరిగానే, స్థూపం వృత్తాకార కదలిక, విశ్వ ప్రతీకవాదాన్ని నొక్కి చెబుతుంది, అయినప్పటికీ ఇది తాంత్రిక ఆరాధనతో కాకుండా ప్రారంభ బౌద్ధ పద్ధతులతో ముడిపడి ఉంది. కామాఖ్య ఆలయం భారతదేశంలోని శక్తి ఆరాధనకు అత్యంత ముఖ్యమైన ప్రదేశాలలో ఒకటి. ఇది స్త్రీ దేవత (శక్తి) అవతారమైన కామాఖ్య దేవతకు అంకితం చేయబడింది.

తారాపీఠ్ ఆలయం తాంత్రిక దేవత తారకు అంకితం చేయబడిన శక్తి ఆరాధనకు సంబంధించిన మరొక ముఖ్యమైన ప్రదేశం.

ప్రపంచవ్యాప్తంగా, చైనీస్, జపనీస్, ఆఫ్రికన్ వంటి పురాతన నాగరికతలలో పవిత్ర, తాంత్రిక పద్ధతుల ఉదాహరణలు కనిపిస్తాయి. అయినప్పటికీ చౌసత్ యోగిని వంటి నిర్మిత నిర్మాణ దృగ్విషయం లేదు. నేపాల్‌లోని బజ్రయోగిని ఆలయం కూడా ఇలాంటిదే కానీ చౌసత్ మందిరాల సమిష్టి లేదు. బౌద్ధమతంలోని కొన్ని రూపాల్లో కూడా తాంత్రిక పద్ధతులు ఉన్నాయి. ఈ రకమైన అభ్యాసాన్ని 'ఎసోటెరిక్ బౌద్ధమతం' లేదా వజ్రయాన అని కూడా పిలుస్తారు. తూర్పు ఆసియా, హిమాలయాలు, టిబెట్, నేపాల్, చైనాలకు యాత్రికులు, తాంత్రిక గురువులు ఈ రహస్య రూపాన్ని వ్యాప్తి చేశారు.

ఈ సంప్రదాయాలతో ముడిపడి ఉన్న అనేక ప్రదేశాలు యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ వారసత్వ సంపదలో చోటు సంపాదించుకున్నాయి. చౌసత్ యోగిని దేవాలయాలు సజీవంగా ఉన్నప్పటికీ, అసలు సందర్భం కంటే పూజా పద్ధతులు, కారణాలను మార్చాయి. భారతదేశంలో కనిపించే చౌసత్ యోగిని దేవాలయాల సమిష్టి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకమైనది.

– అనువాదం: వంశీ మోహన్ నర్ల
m : 98489 02520

## మరచిపోయిన సంప్రదాయానికి పునర్జన్మ:

# చెక్క బొమ్మలాట

చెక్క బొమ్మలాట లేదా కోయ్య బొమ్మలాట తెలంగాణలో పుట్టిన అరుదైన, ప్రాచీనమైన తీగల బొమ్మల కళారూపం. ఇది కేవలం వినోదం మాత్రమే కాకుండా ఒక ఆచార విధానం కూడా. సుమారు 400–500 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సంప్రదాయం గ్రామ చౌరస్తాలలో, దేవాలయ ప్రాంగణాలలో వెలుగొందేది. రంగులు వేసిన చెక్క బొమ్మలు సంగీతం, కథనం, ప్రతీకాత్మక కదలికలతో పురాణాలు, సామాజిక వ్యంగ్యం, పూర్వీకుల స్మృతులను ప్రదర్శించేవి.

అమ్మాపురం గ్రామంలోని బొమ్మలోలు కుటుంబాలు తోలు బొమ్మలాట, యక్షగానం–వీధి భాగవతం పక్కన ఈ కళను తరతరాలుగా కాపాడుతూ వచ్చాయి. ఒకప్పుడు ఈ మూడు కళారూపాలూ సమానంగా ప్రాచుర్యం పొందినా, కాలక్రమేణా తోలు బొమ్మలాట మరుగునపడింది, యక్షగానం మాత్రం నేటికీ కొనసాగుతోంది. చెక్క బొమ్మలాట మాత్రం అస్తిత్వం కోల్పోతున్న అంచున నిలిచింది. తెలంగాణ అంతటా విస్తరించిన బేధ బుడిగ జంగం సమాజం కూడా చెక్క బొమ్మలాట ద్వారా మౌఖిక కథా సంప్రదాయాన్ని నిలబెడుతోంది.





ఈ కళారూపానికి ప్రత్యేకత కలిగించే అంశం చెక్క బొమ్మల పరిమాణం. నాలుగు–ఐదు అడుగుల ఎత్తు, 10–15 కిలోల బరువున్న భారీ కలప బొమ్మలు ఇతర ప్రాంతీయ శైలులకు భిన్నమైన ప్రత్యేక వారసత్వాన్ని సూచిస్తున్నాయి. ఒక్కొక్క బొమ్మను కదిలించడం కోసం అపారమైన శక్తి, క్రమశిక్షణ అవసరం.

ఈ వారసత్వాన్ని తన భుజాలపై మోసిన వ్యక్తి మోతే జగన్నాథం. జనగామ జిల్లా నేరేమెట్ట సమీపంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన ఆయన చెక్క బొమ్మలాటలో ఐదవ తరం సూత్రధారి. ఆయన కేవలం కళాకారుడు మాత్రమే కాదు, ఒక నడిచే గ్రంథాలయంలా, ఒక యుగాన్నంతా తన గళంలో మోసుకొచ్చినవారు.

తెలుగు విశ్వవిద్యాలయం ఫోక్ ఆర్టిస్ట్ అవార్డు గ్రహీత అయిన జగన్నాథం, ఐదు అడుగుల ఎత్తు, 15 కిలోల బరువున్న బొమ్మలను దేశవ్యాప్తంగా ప్రదర్శించారు. ఆయన బొమ్మలకు దేవతలు, ఋషులు, వీరులు జీవం పొందేవారు. ఆయన ప్రతిభ చెక్క బొమ్మలాటకే పరిమితం కాలేదు. యక్షగానం–వీధి భాగవతం లోనూ తన ముద్ర వేశారు. శాస్త్రీయ రాగాలు, కావ్య సంభాషణలు, భక్తి నృత్యాలను మేళవించి ఆధునిక ప్రేక్షకులను అలరించారు.

జగన్నాథం బృందంలో 10–12 మంది కళాకారులు ఉండేవారు. వారిలో ఎక్కువ మంది 75 ఏళ్లకు పైబడినవారే. ఇద్దరు మహిళలు కూడా తమ ప్రాణం పెట్టి ఈ కళను కొనసాగించారు. ప్రతి ఒక్కరూ గాయకులు, వక్తలు, సంగీతకారులు, బొమ్మల ఆటగాళ్లు. ఒకేసారి బొమ్మలను కదిలిస్తూ, పద్యాలు పాడుతూ, సంగీత లయను పాటిస్తూ ప్రదర్శనలు ఇవ్వడం వారి ప్రత్యేకత.

మొత్తం 16 నాటకాలను 12–16 చెక్క బొమ్మలతో ఆడేవారు. సంభాషణలు, పాటలు అన్నీ మౌఖిక శిక్షణ ద్వారా బృంద సభ్యులకు నేర్పేవారు. జగన్నాథం గళం మైక్ లేకుండా వందలాది మంది ప్రేక్షకులను ఆకట్టుకునేది.


జగన్నాథం కళాకారుడిగా మాత్రమే కాకుండా గురువుగా, దూరదృష్టి కలిగిన సంస్కృతి పోషకుడిగా కూడా గుర్తింపు పొందారు. ఢిల్లీలోని నేషనల్ మిషన్ ఆఫ్ మాన్యుస్క్రిప్ట్స్ కింద వర్క్‌షాప్‌లు నిర్వహించారు. విద్యార్థులకు, పరిశోధకులకు సంప్రదాయ కథన శైలిని బోధించారు. గోల్కొండ కోట నేపథ్యంపై ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చి పూర్వ వైభవాన్ని ఆధునిక సమాజానికి అనుసంధానం చేశారు.

2024 డిసెంబర్ 24న 75 ఏళ్ల వయసులో హృదయ సంబంధిత సమస్యలతో జగన్నాథం కన్నుమూశారు. ఆయన మరణం కేవలం ఒక కళాకారుడి ప్రస్థానం ముగిసినట్టే కాదు, చెక్క బొమ్మలాట భవిష్యత్తుకు మలుపు కూడా. కరోనా మహమ్మారి తరువాత అమ్మాపురం బృందంలోని 5–6 మంది మూల కళాకారులు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు జగన్నాథం లేకుండా ఈ కళ అంతరించిపోతున్న అంచున నిలిచింది.

చెక్క బొమ్మలాటను కాపాడడం అంటే కేవలం ఒక సంప్రదాయాన్ని నిలబెట్టడం కాదు, తిరిగి స్వాధీనం చేసుకోవడం. ఇది కొత్త తరం చేతుల్లోనే ఉంది. వారు ముందుకు వచ్చి దీన్ని వారసత్వంగా స్వీకరించకపోతే తీగలు శాశ్వతంగా మౌనమైపోతాయి.

అయితే జగన్నాథం చేతుల్లో నాట్యమాడిన ప్రతి తీగలోనూ, ఆయన పాడిన ప్రతి పద్యంలోనూ ఆ సంప్రదాయ ఆత్మ ఇంకా మెదులుతూనే ఉంది. ఆయన కేవలం సంప్రదాయ రక్షకుడు మాత్రమే కాదు, ఆ సంప్రదాయానికి హృదయం, శ్వాస, ప్రతిధ్వని.

– కట్టా ప్రభాకర్, m : 8106721111
e: akumarkatta@gmail.com




# ఉమ్మడి కర్నూలు జిల్లా శిలా మరియు ఖనిజ సంపద

ఉమ్మడి కర్నూలు జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నైరుతి భాగంలో కలదు. ఇది 17,658 చదరపు కిలోమీటర్లలో విస్తరించి యున్నది. ఈ జిల్లాలో రెండు ఫిసియో గ్రాఫిక్ ప్రాంతాలు కలవు. ఉదాహరణకు ఎత్తు పల్లాలతో కూడిన ప్రాంతం పశ్చిమంలో కలదు. మరియు తూర్పులో సెడిమెంటరీ టెర్రేన్‌లో స్ట్రక్చరల్ ప్లాటూస్, హెూమోక్లైనల్ రిడ్జెస్‌తో కూడి వుంటుంది. ఈ ప్రాంతం గుండా కృష్ణా మరియు తుంగభద్రా నదులు ఉత్తరంలో పారుతవి.

ఈ ప్రాంతంలో రెడ్ శాండీ సాయిల్, బ్లాక్ సాయిల్స్ కలవు. సీస్మిక్ స్టడీ ప్రకారం ఈ జిల్లాలోని ప్రాంతం జోన్-1గా నిర్ధారించబడినది. ఈ జిల్లా యొక్క పశ్చిమ ప్రాంతంలో ఆర్క్యన్ పీరియడ్‌కు చెందిన గ్రానైట్ నైసెస్, మిగ్మటైట్స్, గ్రానిటాయిడ్స్‌ని చూడగలము. వీటిని పెనిన్సులర్ నైసిక్ కాంప్లెక్స్ యొక్క శిలలుగా నిర్ధారించబడినది. ఈ నైసిక్ కాంప్లెక్స్‌లో మధ్య మధ్యలో పొడుగాటి, సన్నటి గ్రీన్ స్టోన్ బెల్ట్స్ గద్వాల, జోన్నగిరి ప్రాంతాలలో ధార్వార్ సూపర్ గ్రూప్‌కు చెందినవి. వీటిలో మెటావాల్కానిక్స్, బయోటైట్ -క్లోరైట్ శిస్ట్, ఆంఫిబొలైట్, హార్న్ బ్లెండ్ శిస్ట్, బ్యాండెడ్ ఫెర్రుజినస్ క్వార్ట్‌జైట్, అగ్లామరైట్ మరియు అల్ట్రాహాఫిక్స్ కలవు. ఉత్తర ప్రాంతంలో పి.జి.సి మరియు శిస్ట్ శిలలో పొటాషియం రిచ్ గ్రానైట్స్‌ని చూడగలము. ఇవి వీటిలో ఇన్‌ట్రూసివ్స్‌గా నిర్ధారించారు మరియు క్లోస్‌పెట్ గ్రానైట్‌తో కొరిలేట్ చేయబడినది. పశ్చిమ ప్రాంతంలో బేసిక్‌డైక్స్, కార్ట్‌జ్‌వీన్స్ NW - SE, NE - SW దిశలలో విస్తరించియున్నవి. కడప సూపర్‌గ్రూప్‌కు చెందిన సెడిమెంటరీ శిలలు పి.జి.సి. పైన అన్‌కన్‌ఫర్మబుల్‌గా విస్తరించినవి. ఈసెడిమెంటరీ శిల్‌ల్లో కంగ్లామరేట్, క్వార్ట్‌జైట్ శేల్, లైమ్‌స్టోన్, డోలమైట్ మరియు చెర్ట్ కలవు. వీటితో పాటు బేసిక్ వాల్‌కానిక్ ఫ్లోస్, సిల్స్ కూడా ఉన్నది. ఈ శిలలు మీసో ప్రోటిరోజోయిక్ పీరియడ్‌కు చెందినవి. వీటిపైన కర్నూల్ గ్రూప్‌కు చెందిన నియొ ప్రొటిరో జోయిక్ సెడిమెంట్స్ అన్‌కన్‌ఫర్మెబుల్‌గా ఉన్నవి. వీటి శిలలు క్వార్ట్‌జైట్ లైమ్‌స్టోన్ మరియు శేల్. ఈ ప్రాంతంలో ముఖ్యమైన స్ట్రకచర్స్ ఫోల్డ్స్, ఫాల్ట్స్. కడప సెడిమెంట్స్‌లో డబ్లీప్లంజింగ్ యాంటిక్లైన్స్, సిన్‌క్లైన్స్‌ని తూర్పు ప్రాంతంలో చూడగలము. ఈ శిలలన్నిటి గుండా వెళ్తున్న ఘని - కాల్వ వెల్దుర్తి ఫాల్ట్ ENE-WSW దిశలో చూడగలము.

**ఖనిజ సంపద:** ఈ జిల్లాలో గోల్డ్, డైమండ్, ఫ్లక్స్‌గ్రేడ్ లైమ్‌స్టోన్, డోలమైట్, కాపర్, స్పెకులర్ హెమటైట్, ఫాస్ఫోరైట్ ఓకర్స్, బెరైటీస్, డైమెన్శన్ స్టోన్స్ నిక్షేపాలు పుష్కలంగా కలవు.

**గోల్డ్:** ఈ బంగారు నిక్షేపాలు 25 కి.మీ. పొడవు 5 కి.మీ. వెడల్పు గల జొన్నగిరి శిస్ట్ బెల్ట్‌లో సల్ఫైడ్‌తో కూడిన క్వార్ట్జ్ వీన్స్‌లో చూడగలము. ఈ వీన్స్ మెటాబసాల్ట్, మెటా రయో డయో సైట్, శియరడ్ గ్రానోడైయొరైట్ మరియు మెటాటుఫ్స్‌లో కలవు. ఈ ప్రాంతంలో పురాతన మైనింగ్ సైట్స్ కలవు. దోనా టెంపుల్ బ్లాక్ జొన్నగిరికి ఈశాన్యంలో వున్నది. ఈ బ్లాక్‌లో గోల్డ్ నిక్షేపాలు 1700 మీటర్ల పొడవు 1.13 మీటర్ల వెడల్పుగల జోన్‌లో 0.64 నుండి 6.58 గ్రామ్స్ పర్‌టన్ గోల్డ్ కలదు.

దోనా ఈస్ట్ బ్లాక్‌లో గోల్డ్ శియర్డ్ గ్రానో డయో రైట్‌లో గోల్డ్ మినరలైసేశన్ ఉన్నట్లు నిర్ధారించారు. జి.ఎస్.ఐ వీటి నిక్షేపాలు 7.77Mt, 1.79g/t చొప్పున 31.2 మీటర్ల తిక్‌నెస్‌తో 180 మీటర్ల లోతు వరకు వున్నట్లు నిర్ధారించబడినది. దోనా నార్త్ బ్లాక్‌లో 0.0098Mt, 3.92g/t చొప్పున 1.81 మీ తిక్‌నెస్‌తో 335 మీటర్ల పొడవు గల ప్రాంతంలో ఉన్నట్లు నిర్ధారించారు జి.ఎస్.ఐ. దోనా సౌత్ బ్లాక్‌లో 1.104Mt గ్రేడ్ 1.16 నుండి 6.28,g/t 1.22 మీ నుండి 5.38 మీటర్ల తిక్‌నెస్‌తో 170మీ నుండి 480 మీ పొడవు గల జోన్‌లో గోల్డ్ నిక్షేపాలు కలవు. జొన్నగిరికి ఉత్తరంలో ఒక కొత్త శిస్ట్ జోన్ అస్పరి ప్రాంతంలో కనుగొన్నారు. జి.ఎస్.ఐ. ఈ జోన్ 3.5 కి.మీ. పొడవు, 2.7 కి.మీ. వెడల్పు గల జోన్‌లో గోల్డ్ వ్యాల్యూస్ 30ppb నుండి 451ppb వరకు ఉన్నట్లు నిర్ధారించారు. గద్వాల శిస్ట్‌బెల్ట్‌కు దక్షిణంలో చెట్లమల్లాపురం ప్రాంతంలో కొన్ని వ్యాలూస్‌లో గోల్డ్ 2ppm మరియు కాపర్ 2.6 శాతం ఉన్నట్లు నిర్ధారించారు.

**డైమండ్:** తుంగభద్రా కింబర్ లైట్ ఫీల్డ్ ఈ జిల్లాలో రాయి చూరు కింబర్‌లైట్ ఫీల్డ్ (RKF)కు 25 కి.మీ. దక్షిణంలో ఉన్నది. ఈ జోన్‌లో ఏడు పైప్స్ మంత్రాలయం, బాగాపురం, నడిగడ్డ, మల్కాపూర్, ఎమ్మిగనూరు ప్రాంతాలలో కనుగొన్నారు జి.ఎస్.ఐ.

పురాతన డైమండ్ మైన్ వర్కింగ్స్ బంగనపల్లి కంగ్లామరేట్, క్వార్ట్‌జైట్‌లో చూడగలము. రెండు ప్రముఖమైన కంగ్లామరేట్ బెల్ట్‌లు ఎక్కడైతే పురాతన మైన్ సెట్స్ 1) 30 కి.మీ. పొడవుగల బనగానపల్లి – నేరెడు చెర్ల ప్రాంతంలో మరియు 2) రామల్లకోట–యాంభవి ప్రాంతంలో కలవు. ఇవి కాకుండా ఇరత ముఖ్యమైన ప్రాంతాలు బనగానపల్లి, వజ్రగిరి, మునిమడుగు, రాచర్ల, గట్టిమనికొండ, రామల్లకోట, బాలాపూరు, పెండెకల్లు, విరాయపల్లి, యాంభవి మరియు తిమ్మరాజిపల్లి. కృష్ణానది బ్యాంక్స్‌లో పంచలింగ మరుగట్టి వద్ద గ్రావెల్స్‌లో మరియు కుందేర్‌వేలి, హంద్రీనదిలో సాగిలేరు నది ప్రాంతాలలో డైమండ్స్, గ్రావెల్స్‌లో రికవర్ చేసినట్లు రిపోర్ట్ చేయబడినది.

**లైమ్‌స్టోన్:** ఈ జిల్లాలో సిమెంట్‌గ్రేడ్ లైమ్‌స్టోన్ నిక్షేపాలు పుష్కలంగా నార్జి ఫార్మేషన్‌లో ఉన్నవి. ప్రముఖమైన ప్రాంతాలు ఔక్– బోగసముద్రం, పాన్యం, బనగానపల్లి, బేతంచర్ల, శివరామపురం, మల్యాల, కోయిలకుంట్ల, యెన్నకొండ్ల, జలదుర్గం, జి.ఎస్.ఐ. అంకిరెడ్డిపల్లి ప్రాంతంలో ఫ్లక్స్‌గ్రేడ్ లైమ్‌స్టోన్ మరియు సిమెంట్‌గ్రేడ్ లైమ్‌స్టోన్ నిక్షేపాలలో 42 నుండి 53 శాతం CaO, 2శాతం MgO, 16 శాతం $SiO_2$, $AiO_3$ 2 నుండి 4 శాతం $Fe_2O_3$ తో కూడి యున్నది. ఈ బెల్ట్ 25 కి.మీ. వెడల్పు, 25 కి.మీ. పొడవుగల బెల్ట్‌లో ఉన్నది.

**డొలమైట్:** డొలమైట్ నిక్షేపాలు వెంపల్లి ఫార్మేశన్‌లోని డొలమైటిక్ లైమ్‌స్టోన్‌లో దొరుకుతుంది. ఈ నిక్షేపాలు డోన్‌కు వెల్దుర్తి ప్రాంతాల మధ్య కలవు. ఫ్లక్స్ గ్రేడ్ డోలమైట్ నిక్షేపాలు మల్కాపురం, చిన్న మల్కాపురం, కోలమలపల్లి సంగమేశ్వరం వద్ద వున్నవి.

**కాపర్:** వీటి నిక్షేపాలు ENE - WSW ట్రెండింగ్ ఘని కాల్వా ఫాల్ట్ ప్రాంతంలో క్వార్ట్జ్ వీన్స్‌లో తాడిపత్రి, ఘని, కాల్వా పరిసరాలలో 1.37 శాతం కాపర్ 100 మీటర్ల లోతు వరకు ఉన్నట్లు మరియు వీటి రిజర్వు 0.43 Mటా నిర్ధారించారు.

**స్పెకులర్ హెమటైట్:** ఐరన్ ఓర్ స్పెకులర్ హెమటైట్ రూపంలో మేజర్ ఫాల్ట్ జోన్‌లో కడప సూపర్‌గ్రూప్‌కు చెందిన శిలల్లో వెల్దుర్తి, రమళ్ళకోట ప్రాంతాలలో దొరుకుతుంది. ఇక్కడ 50–60 శాతం Fe తో 3.7Mt రిజర్వు ఉన్నట్లు నిర్ధారించారు.

**ఫాస్‌ఫొరైట్:** ఈ ఫాస్‌ఫోరైట్ నిక్షేపాలు చెలిమా, పచ్చెర్ల, పచగుండాలు, అహోబిలం ప్రాంతాలలో దొరుకుతుంది. నల్లమలై గ్రూప్‌కు చెందిన కుంభం ఫార్మేశన్‌లోని శేల్, డొలమైట్ యొక్క బేసల్ పొర్శన్స్‌లో దొరుకుతుంది. ఫాస్‌ఫొరైట్ గ్రే కలర్‌లో పెల్లెట్స్, ఫ్రాగ్‌మెంట్స్, స్ట్రోమాటోలైటిక్, నాడులర్, పెబ్లీ, లామినేటెడ్ రూపంలో ఉంటుంది. ఈ జోన్ 30 కి.మీ. పొడవు, 0.1 నుండి 2.5 కి.మీ థిక్‌నెస్‌తో ఉన్నది. $P_2O_5$ శాతం 14 నుండి 28 వరకు వున్నది.

**ఓకర్స్:** వీటి నిక్షేపాలు మల్కాపురం వద్ద వెంపల్లి డొలమైటుతో కూడియున్నది. మరియు ఐరన్ ఓర్‌తో వెల్దుర్తి వద్ద పసుపు ఓకర్ ఔక్‌శేల్‌లో రామల్లకోట పరిసమిట్ల, బేతంచ్లె, అంబాపురం, కొర్టికుండా, నేరెడుచెర్ల దిగువపాడు, లొడ్డిపల్లి, పంగిడి పరుసుట్లా మరియు వుయ్యాలవాడ ప్రాంతాలలో దొరుకును. వీటి రిజర్వు 2 Mటా నిర్ధారించారు.

**బైరైటీస్ ($BaSo_4$):** ఈ ఖనిజం బేరియంకి ముఖ్యమైన సోర్స్ మరియు 65 శాతం BaSo4తో కూడి ఉంటుంది. ఇది మాసివ్‌గా లేక క్రిస్టలైన్ రూపంలో ఉన్నది. దీని స్పెసిఫిక్ గ్రావిటి చాలా ఎక్కువ వుండడం వల్ల తొందరగా గుర్తు పట్టవచ్చును. వీటి నిక్షేపాలు చాలా వరకు వీన్‌టైప్, బెడ్డెడ్ మరియు రెసిడ్యుల్ రూపంలో దొరుకును. ఈ జిల్లాలో వెంపల్లి ఫార్మేశన్‌లో, పుల్లివెందుల క్వార్ట్‌జైట్‌లో మరియు పుల్లంపేట ఫార్మేశన్‌లో దొరుకుతుంది.

**డైమెన్షన్ స్టోన్స్:** ఈ జిల్లాలో డైమెన్శన్ స్టోన్ నిక్షేపాలు పుష్కలంగా కలవు. ఇందులో చాలా ప్రఖ్యాతిగాంచిన బేతంచెర్ల ఫ్లాగిలైమ్‌స్టోన్‌ని విస్తృతంగా క్వారీ చేస్తున్నారు. దీనిని కమర్షియల్‌గా కడప స్లాబ్ అని అందురు. దీనిని చాలా వరకు ఫ్లోరింగ్‌కి వాడతారు. వేంపల్లి డొలమైట్ కూడా క్వారీ చేస్తున్నారు. పింక్ గ్రానైట్, బిలెకల్లు, జొన్నగిరి, కృష్ణగిరి వద్ద క్వారీ చేస్తున్నారు.

– కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com



# వారసత్వ సంపద పెంబర్తి హస్తకళ

భారతదేశం, సంస్కృతి, నాగరికత యొక్క మూలాధారం, సాంప్రదాయ కళలు, చేతిపనుల యొక్క గొప్ప మూలం. ఇది శతాబ్దాలుగా కొనసాగుతూ, ప్రామాణికమైన, వినూత్నమైన, సృజనాత్మకంగా మిగిలిపోయింది. వారి అద్భుతమైన నైపుణ్యం, విలువైన ప్రాచీనతకు బహుమతిగా ఉంది. కళాత్మక వ్యక్తీకరణల రూపంలో అసాధారణమైన సంపద, వైవిధ్యమైన శైలులతో పాటు, భారతదేశంలోని ప్రతి ప్రాంతం కలప మరియు లోహం వంటి సహజ పదార్థాల లభ్యతపై ఆధారపడి ప్రత్యేకమైన చేతిపనులను కలిగి ఉంటుంది. సాంప్రదాయ హస్తకళలు వాటి స్వాభావిక విలువ, డిజైన్ యొక్క పరిపూర్ణత, ప్రతి నిర్దిష్ట ప్రాంతానికి ప్రత్యేకమైన విలక్షణమైన శైలి కారణంగా సుదీర్ఘ చరిత్రను కలిగి ఉన్నాయి. అటువంటి ప్రాచీన కళలలో ఒకటి తెలంగాణలోని వరంగల్ జిల్లాలో ఉన్న ఒక సుందరమైన గ్రామమైన పెంబర్తి యొక్క మెటల్ ఆర్ట్.



పండితులు మనకు ఇనుము తెలియని పూర్వ యుగం గురించి చెబుతారు మరియు లోహపు పనిముట్లు మరియు రోజువారీ ఉపయోగించే వస్తువులను తయారు చేయడానికి రాగి మరియు మిశ్రమాలను ఉపయోగించారు. ఆ వయస్సులో కొంత భాగం ఇప్పటికీ మనతోనే ఉంది కానీ ఎక్కువగా కళ వస్తువులలో ఉంది.

కొన్ని కారణాల వల్ల ఈ విస్తృతమైన క్రాఫ్ట్ చిన్న గ్రామమైన పెంబర్తిలో మాత్రమే మిగిలి ఉంది.

పెంబర్తి మెటల్ క్రాఫ్ట్ అనేది తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లాలోని పెంబర్తిలో తయారు చేయబడిన ఒక ప్రసిద్ధ మెటల్ హస్తకళ, ఇది సున్నితమైన షీట్ మెటల్ కళాకృతులకు విస్తృతంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ తయారు చేయబడిన క్లిష్టమైన షీట్ మెటల్ ఇత్తడి చెక్కడం మరియు కళాఖండాలు 800 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం నాటివి.

పెంబర్తి హైదరాబాద్ నుండి 80 కి.మీ దూరంలో ఉన్న గ్రామం. 500 సంవత్సరాల పాటు సాగిన కాకతీయ సామ్రాజ్య కాలంలో ఈ ప్రాంతం వైభవాన్ని సంతరించుకుంది. పెంబర్తికి మెటల్ కార్మికులు లేదా 'విశ్వకర్మల' యొక్క అత్యుత్తమ పనితనం యొక్క గొప్ప చరిత్ర ఉంది.

అందువల్ల, అనేక హిందూ దేవాలయాల విగ్రహాలు (విగ్రహాలు) అలాగే వాహనాలు (రథాలు) అలంకరించబడినందున షీట్ మెటల్ పని ప్రక్రియ ప్రజాదరణ పొందింది. కాకతీయ రాజ్యంలో దేవాలయాలకు గొప్ప ఆదరణ లభించడంతో, పెంబర్తి షీట్ మెటల్ పని దేశం నలుమూలల నుండి దృష్టిని ఆకర్షించింది.

తెలంగాణ ప్రాంతంలోని చాలా పురాతన దేవాలయాలు కాకతీయ పాలకుల ఆధ్వర్యంలో నిర్మించబడినందున, ఈ దేవాలయాలు పెంబర్తి కళాకారుల సంతకం శైలిని కలిగి ఉన్నాయి. మాస్టర్ హస్తకళాకారులు ప్రదర్శించిన ఉన్నత స్థాయి నైపుణ్యాలను అనుసరించి మెటల్ క్రాఫ్ట్ పరిపూర్ణత యొక్క పరాకాష్టకు చేరుకుంది. ఈ ప్రాంతంలోని విశ్వకర్మలు ఈ రకమైన లోహ శిల్పంలో వారి అరుదైన నైపుణ్యాలకు ప్రసిద్ధి చెందారు. దీనిని పెంబర్తి బ్రాస్‌వేర్ అని కూడా పిలుస్తారు. ప్రతి హస్తకళ ప్రదర్శనలో ఇది ఒక ముఖ్యమైన కళాఖండంగా మారింది మరియు తెలంగాణ కళాత్మక




వారసత్వానికి పర్యాయపదంగా కూడా మారింది.

ముస్లిం పాలన వచ్చిన తర్వాత, పెంబర్తి హస్తకళాకారులు తమ కళా శైలిని అభివృద్ధి చేసుకున్నారు. తమలపాకులు లేదా పాందాన్‌లు, పరిమళ ద్రవ్యాల పాత్రలు లేదా ఇత్తర్ కుండలు, వేలాడే మెటల్ షాండ్లియర్‌లు లేదా జుమ్మర్లు, కుండీలు, ప్రత్యేక ఫలకాలు, మెమెంటోలు వంటి వ్యక్తిగత వస్తువులను అలంకరించారు.

ఈ నైపుణ్యం రాజకీయ పరిస్థితుల ఎదురుదెబ్బల నుండి బయటపడింది, అయితే స్వాతంత్ర్యానంతర యుగం మారిన డిమాండ్ విధానాలకు అనుగుణంగా ఈ కళ యొక్క పునరుజ్జీవనాన్ని చూసింది. అన్యదేశానికి అదనంగా ప్రయోజనాత్మక అంశం మీద ఎక్కువ ప్రాధాన్యత ఉంది. పెంబర్తి బ్రాస్‌వేర్, సంవత్సరాలుగా హిందూ మరియు ముస్లిం ప్రభావాల యొక్క ముఖ్యమైన సూక్ష్మ నైపుణ్యాలను సంగ్రహించింది, ఇది రెండు సంస్కృతులలో సజావుగా మిళితం చేయబడింది. క్రాఫ్ట్ ఫారమ్ ప్రతిష్టాత్మకమైన భౌగోళిక సూచికను పొందింది. ఇది నిజంగా క్రాఫ్ట్‌కు గౌరవం.



### మెటల్ ఆర్ట్‌వేర్– ది ప్రైడ్ ఆఫ్ పెంబర్తి

మెటల్ క్రాఫ్ట్ అత్యుత్తమమైనది మాత్రమే కాదు, 5,000 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం నాటి భారతీయుల అత్యంత ప్రాచీనమైన చేతిపనులలో ఒకటి. లోహం, కాంస్య – ఇత్తడి వంటి మిశ్రమాలు పురాతన సమాజాలలో నిల్వ చేయడానికి లేదా అలంకరణ కోసం పాత్రలను తయారు చేయడానికి ఉపయోగించబడ్డాయి. ఇవి సాధారణ పాత్రల నుండి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళల వ్యసనపరులు ఇష్టపడే అత్యంత సంక్లిష్టంగా రూపొందించిన కళాఖండాల వరకు మొత్తం శ్రేణి వస్తువులను కవర్ చేస్తాయి. తెలంగాణలోని పెంబర్తి గ్రామం దాని లోహ కార్మికులు లేదా 'విశ్వకర్మల' యొక్క అత్యుత్తమ పనితనం ఒక చరిత్రను కలిగి ఉంది. ఇది కాకతీయ రాజ్యం యొక్క వైభవం, వైభవాన్ని గుర్తించవచ్చు. మాస్టర్ హస్తకళాకారులు ప్రదర్శించిన ఉన్నత స్థాయి నైపుణ్యంలో మెటల్ క్రాఫ్ట్ పరిపూర్ణత యొక్క పరాకాష్టను సాధించింది. పెంబర్తిలోని విశ్వకర్మలు రాతి, లోహ శిల్పాలలో అరుదైన నైపుణ్యానికి ప్రసిద్ధి చెందారు. ఆలయ నిర్మాణం, 'విగ్రహాలు' – దేవతల విగ్రహాలు, 'వాహనాలు' – రథాలు, ఆలయ శిల్పకళకు సంబంధించిన ఇతర కళాత్మక ఉపకరణాలను రూపొందించడంలో పాలకులచే ఆదరణ పొందారు. దక్షిణ భారతదేశంలోని అనేక ప్రసిద్ధ దేవాలయాలను అలంకరించే అచ్చు హస్తకళలు, 'కీర్తి ముఖ', 'ప్రభ' – పినాకిల్స్‌కు ఉదాహరణగా ఉన్న అద్భుతమైన విగ్రహాలలో వారి కళాత్మకత యొక్క ప్రకాశం స్పష్టంగా కనిపిస్తుంది.

### కళాత్మక సృజనాత్మకతకు మరింత విలువను జోడించడం.

కాకతీయుల కాలం నాటి వైభవం క్రమంగా నిజాం ఆధిపత్యానికి దారితీసింది. పెంబర్తి కళారంగంలో మార్పు వచ్చింది. నిజాం కాలంలోని విశ్వకర్మలు, పాందర్లీలు, నగర్దార్లీ లు, ఇత్తర్ కుండలు, శంగర్దార్లీ లు, వెండి – బంగారంతో తయారు చేసిన గృహోపకరణాలు, గృహ వినియోగానికి సంబంధించిన వస్తువులను రూపొందించారు. ఈ అద్భుతమైన కాలంలో పెంబర్తిలో కళాకారుల కుటుంబాల సంఖ్య 600కు పైగా పెరిగిందని చెబుతారు. హస్తకళాకారులు మెటల్ క్రాఫ్ట్‌లో వారి ప్రతిభావంతులైన పనితనానికి ప్రసిద్ధి చెందారు. మరియు గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యానంతర యుగం కళ యొక్క పునరుజ్జీవనానికి సాక్ష్యమిచ్చింది. ఇది అన్యదేశానికి బదులుగా ప్రయోజనాత్మకతను నొక్కిచెప్పిన, మారిన డిమాండ్ నమూనాను తీర్చడానికి తనను



తాను లక్ష్యంగా చేసుకుంది.

**విశ్వకర్మ బ్రాస్, కాపర్ అండ్ సిల్వర్ ఇండస్ట్రియల్ కోఆపరేటివ్ సొసైటీ ఒక యునైటెడ్ అచీవ్‌మెంట్**


ఒకే కో-ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేయడం, ఒక ఉమ్మడి సౌకర్యాల కేంద్రం, అద్భుతమైన పెంబర్తి కళాఖండాల ప్రదర్శన కోసం ఒక అద్భుతమైన షోరూమ్ ఏర్పాటు చేయడం ఒక ముఖ్యమైన మైలురాయి. సహాయం కోసం ప్రభుత్వాన్ని సంప్రదించడంలో శ్రీ అయిలా ఆచారి యొక్క నిజాయితీ ప్రయత్నాలే ఈ కళను ప్రస్తుత వైభవంలో వర్ధిల్లేలా చేసింది. సిల్వర్ - గోల్డ్ నుండి బ్రాస్ మెటల్ వేర్‌కు మారడం ఈ మాస్టర్ క్రాఫ్ట్‌మ్యాన్ ద్వారా ప్రారంభించబడింది. పెంబర్తి ఇత్తడి చేతివనులను అలంకార, గృహ, ప్రయోజనాల కోసం పరిచయం చేయడంలో మార్గదర్శకుడు.



సంఘం యొక్క ఉమ్మడి బలం, సహకార పనితీరు 60 కంటే ఎక్కువ మంది హస్తకళాకారుల కుటుంబాలకు ఆదర్శవంతమైన పని పరిస్థితులను అందించగలిగింది. వారి ఆర్థిక పురోభివృద్ధికి, కళ మరింత అభివృద్ధి చెందడానికి గణనీయంగా దోహదపడింది. నేడు సృజనాత్మక, గొప్ప వినూత్న కళగా అభివృద్ధి చెందుతోంది. ఆధునిక పోకడల ప్రాధాన్యతలకు అనుగుణంగా, విశ్వకర్మ కళాఖండాల యొక్క విస్తారమైన శ్రేణి విస్తృత శ్రేణిని కలిగి ఉంది. వీటిలో వేలాడే దీపపు ఛాయలు, అలంకార మొక్కల కుండలు, దశావతార ప్యానెల్‌లు, నవగ్రహ - అష్టలక్ష్మి ప్యానెల్‌లు, దీర్ఘచతురస్రాకార మరియు గుండ్రని ఆకారాలు, క్లిష్టమైన చెక్కిన ఇలస్ట్రేటెడ్ ప్యానెల్‌లను వర్ణిస్తాయి. మహాభారతం, రామాయణం నుండి దృశ్యాలు, అత్యంత చిత్రించ బడిన నక్షి పనితో సృష్టించబడ్డాయి. చిహ్నాలు, ఉత్సవ్ విగ్రహాలు, వాహనాలు, ఆలయ అలంకరణ వస్తువులు కూడా ఘనమైన ఇత్తడి యొక్క క్లిష్టమైన అచ్చులలో రూపొందించబడ్డాయి.

విశ్వకర్మ మెటల్ హస్తకళలు తెలంగాణలోని గోల్కొండ హస్తకళల ఎంపోరియంలు, దేశ వ్యాప్తంగా హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా విక్రయించబడుతున్నాయి.

-సువేగా, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



# అశోకుడు బౌద్ధ మతము స్వీకరించిన ప్రథమ శాసనం ఆంధ్రప్రదేశ్‌లో!

అశోకుని శాసనములు రమారమి 40 కలిగి ఉన్నాయి. ఈ శాసనంలు 50 విభిన్న ప్రదేశములలో ప్రత్యేకించి ఈ శాసనములను ఆంధ్ర, కర్ణాటక Hnn ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, బీహార్, ఢిల్లీ, నేపాల్, మధ్యప్రదేశ్ మరియు పాకిస్తాన్ నందు సైతం గమనించగలము.

అశోకుడు ధర్మ మహామాత్రులు, స్త్రీ మహా మాత్రులు, అరణ్య మహామాత్రులు, నాగలక మహామాత్రులు, రాజుకులు మరియు యుక్తులు అన్న రకాల వారీగా విభజన చేసి వారికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఆ ప్రక్రియలో భాగంగా, అధికారులు (సేనాధిపతులు, మహామాత్రులు) అశోకుని ఆజ్ఞలననుసరించి పర్వతాలపైన రాళ్లపైన మరియు స్తంభాలపైన అశోకుని ఆదేశాలను తెలియపరిచినారు. ఈ ప్రక్రియలో భాగంగానే కర్నూలు జిల్లా పత్తికొండ నియోజక వర్గానికి చెందిన రాజుల మందగిరి గ్రామము నందు గల గుట్టపైన అశోకుని ఆదేశాలను లిఖించినారు. సామ్రాట్ అశోకుడు బౌద్ధమును స్వీకరించినట్టు తెలిపే తొలి శాసనం రాజుల మందగిరి నందు కలదని తెలియుచున్నది. అశోకుని శాసనంలను Minor rock edicts (MRE-1)గాను Major Rock edicts(MRE-2) గాను, pillar edits, queen edicts మరియు ప్రత్యేక శాసనములు గాను గమనించగలము.

ఈ శాసనంల ద్వారా అశోకుడు తన రాజ్యాభిషేకం అయిన రెండున్నర సంవత్సరముల తర్వాత బౌద్ధ మతం స్వీకరించినాడని తెలుస్తుంది. స్వీకరించినప్పటికీ ఏమాత్రము శ్రద్ధ వహించలేదని ఈ శాసనము ద్వారా అర్థం అవుతుంది.

కర్నూలు జిల్లా నందలి పత్తికొండ నియోజకవర్గం నకు 5.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజుల మందగిరి నందలి గుట్టమీద ఉన్న Minor Rock edit ద్వారా తెలుస్తుంది. భారతదేశంలో, అశోకుడు బౌద్ధ మతము స్వీకరించినాడని తెలిపే తొలి శాసనం ఇదే. ఇటువంటి రాతి శాసనములను రాజుల మందగిరి నందే గాక కర్నూలు జిల్లా నందలి పత్తికొండకు సమీపమున గల ఎర్రగుడి నందు సైతం గమనించగలరు. అశోకుని శాసనంలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము నందు, కర్నూలు జిల్లాలో గల పత్తికొండ నియోజకవర్గంలో మాత్రమే చూడగలము. అదేవిధంగా ఇటువంటి శాసనములను కర్ణాటక రాష్ట్రం నందలి Maski, Brahmagiri మరియు Siddapur నందు గమనించగలము.

అశోకుడు తన అభిషేకం అయిన రెండున్నర సంవత్సరముల తర్వాత 256 రాత్రులలోనే, ధర్మంతో ఉండాలని నిశ్చయించుకున్నాడని అర్థమవుతుంది. అంతేకాకుండా కలింగ యుద్ధం తర్వాత మరింతగా ధర్మంతో స్థిరపడ్డాడని తెలుస్తుంది. భిక్షువులు, భిక్షునీలు మరియు గృహస్తులు అందరు కూడా ధర్మవచనాలను తరచుగా వినాలి మరియు ఆచరించాలి అని ఆజ్ఞాపించాడు. ఎవరు చదివి, విని మరియు ఆచరిస్తారో వారు ధర్మంలో స్థిరపడతారు అని శాసనముల ద్వారా ఆజ్ఞాపించారు.

మునిగాథలు, మౌనియస్థితి ఉపతిస్స ప్రశ్నలు మరియు ధర్మ గాథలు అందరికీ చేరేలా చూడాలని ఈ ధర్మ శాసనాలను పర్వతాల యందు రాతిగుట్టల యందు ఏర్పాటు చేయాలని అధికారులకు, సేనాధికారులకు మరియు మహామాత్రులకు అశోకుడు ఆదేశించారు. ఇటువంటి రాతి శాసనంను రాజుల మందగిరి నందు గమనించవచ్చు.

ప్రత్యేక శ్రద్ధ వహించకపోవడం వల్ల రాతి మీద చెక్కబడి





ఉన్న బ్రాహ్మిలిపి అక్షరాలు కనపడకుండా పోతున్నాయని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. సామ్రాట్ అశోకుడు బౌద్ధమతం స్వీకరించినట్టుగా తెలియజేసే ప్రథమ శాసనం రాజుల మందగిరి లో ఉండడం గర్వంగా భావిస్తున్నట్టు ఈ ప్రాంతము ప్రజలు తెలియచేస్తున్నారు. అంతేకాకుండా రాజుల మందగిరి గుట్టలో అద్భుతమైన పురాతనమైన శివాలయములను గమనించవచ్చు. భిన్నమైనటువంటి సూర్య విగ్రహం వీరుల శిలలను అనేకములైన నాగులను గమనించగలం. ఇదే గుట్టకు ఎదురుగా ఉన్న కొండమీద అప్పటి రాజుల కోట లాంటి నిర్మాణం సైతం కూడా చూడగలము. మరెన్నో రాక్ షెల్టర్స్‌ను కలిగి రాతియుగ మానవుని ఉనికి సైతం తెలుపుతున్న ఈ ప్రాంతము పర్యాటకాభివృద్ధి చేయవలెనని అందరూ కోరుకుంటున్నారు.

–డా॥ జి.యస్.రామయ్య
ఇంటాక్ సభ్యులు-కర్నూలు, ఆంధ్రప్రదేశ్
m : 898 555 0007

# ఉజ్వల భవిష్యత్తు కోసం శక్తివంతమైన బాలికలు

## అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ప్రపంచవ్యాప్తంగా ఆడబిడ్డలపై ఉండే వివక్షతను, హింసను, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించేందుకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆడబిడ్డల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఐక్యరాజ్య సమితి ఈ కార్యక్రమాన్ని ఏటా చేపడుతుంది.

ప్రతీ ఏటా అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఏదో ఒక ప్రత్యేక థీమ్‌తో నిర్వహిస్తుంటారు. ఈ ఏడాదికిగాను "ఉజ్వల భవిష్యత్తు కోసం బాలికలను శక్తివంతం చేయడం" అనే థీమ్‌తో నిర్వహించనున్నారు. బాలికలకు విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు వ్యక్తిగత వృద్ధిలో సమాన అవకాశాలను అందించడం యొక్క ప్రాముఖ్యతను ప్రత్యేకంగా చేస్తుంది. సమాజంలో వారి పాత్రను మరియు వారు అభివృద్ధి చెందడానికి సమగ్ర మద్దతు అవసరాన్ని ప్రముఖంగా చెబుతుంది.




ప్రపంచవ్యాప్తంగా బాలికలు విద్య, శారీరక, మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. వీటన్నంటిపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలనే లక్ష్యంతో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని జరుపుతున్నారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలికలకు సంబంధించిన స్ఫూర్తిదాయకమైన కథనాలను, వీడియోలను అందరితో పంచుకోవాలని ఐక్యరాజ్య సమితి ప్రజలకు పిలుపునిచ్చింది.


**చరిత్ర ఏంటంటే..**

అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించడం వెనకాల పెద్ద చరిత్రే ఉంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ డిసెంబర్ 19, 2011న, అక్టోబర్ 11ని అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ప్రకటించడానికి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అక్టోబర్ 11న జరిగే కార్యక్రమంలో ప్రధానంగా ప్రపంచవ్యాప్తంగా అమ్మాయిలు ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించి, వారి మానవ హక్కులను నెరవేర్చే దిశగా వారిని శక్తివంతం చేయడంపై దృష్టి సారించింది. అణగారిన బాలికల హక్కుల తరఫున గొంతు కావాలనేదే ఈ దినోత్సవం ప్రాముఖ్యత. బాలికలకు మెరుగైన ఆరోగ్య సేవలు, విద్యలో సమాన అవకాశాలు, లింగ-ఆధారిత వివక్ష, బాలికలపై హింసలేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

# గాంధీ మహాత్ముడు బయలుదేరగా...

పత్రికలు అపుడపుడే ప్రాచుర్యంలోకి వస్తున్న రోజులవి! దక్షిణాఫ్రికా కూడా భారతదేశంలాగా బ్రిటీష్ పాలనలో చిక్కుబడి పోయింది. ఒక బడుగు నిరాయుధుడైన భారతీయుడు దక్షిణాఫ్రికా వలస భారతీయుల కష్టాలను కడతేర్చాడనే విషయాలు కథలు, గాథలుగా ఈ నేల వినిపించ నారంభించినాయి! పురాణ కథలతో పులకితమయ్యే ఈ సమాజం, వేర్వేరు భాషలు మాట్లాడినా సహజ స్పందనలలో మాత్రం ఒకేలా నినదిస్తుంది. ఆర్థికంగా అంతంత మాత్రంగా సాగే జీవితంలో, ఎటువంటి పోరాట సామగ్రి లేకుండా సాధించిన దక్షిణాఫ్రికా మహావిజయం గురించి తెలిసి ఆ నాయకుడిని ఆ మహావిష్ణువుగా భావన చేయడంలో ఎంత మాత్రం ఆశ్చర్యంలేదు!




1914 జూలై 18న గాంధీజీ దక్షిణాఫ్రికా విజయచరితను లిఖించడం పూర్తి చేసుకుని ఆ ప్రజలకు వీడ్కోలు పలికారు. అక్కడి నుండి నేరుగా లండన్ వెళ్ళి, చికిత్స పొందుతున్న తన గురువు గోపాలకృష్ణ గోఖలే (9 మార్చి 1866-19 ఫిబ్రవరి 1915) ను కలిసి, అదే సంవత్సరం డిసెంబరు 19న అక్కడి నుండి మన దేశం వైపు పయన మయ్యారు. 1915 జనవరి 9న ఓడలో గాంధీజీ బొంబాయి చేరారు. అదే సం॥ మే మాసంలో అహమ్మదాబాదు దగ్గర కొచ్రాబ్ సత్యాగ్రహ ఆశ్రమాన్ని ప్రారంభించారు. గోఖలే సలహాననుసరించి భారతదేశమంతటా రైలు మూడవ తరగతి బోగీలో సుమారు ఒక సంవత్సరంపాటు పర్యటించి, గాంధీజీ ఈ ప్రజలనూ, వారి తీరునూ అధ్యయనం చేశారు. అదే సమయంలో ఆయనను ఈ భారతీయ సమాజానికి పరిచయం చేసినట్టయ్యింది కూడా. భాష తెలియని చోట, అంచనాలు ఎక్కువయిన వేళ పురాణ సాదృశ్యమైన భావాలు విరివిగా రెక్కలు విప్పడం సహజమే! కనుక ఈ కారణంగా కూడా ఉత్తరాది కన్నా దక్షిణాదిలో గాంధీజీ ప్రభావం ఎక్కువని సూత్రీకరించినా మనం ఆశ్చర్య పడనక్కర లేదు! లేకపోతే భరత ఖండపు పశ్చిమతీరపు ఉత్తర కొస మనిషి శాంతి, అహింసల మురళీనాదానికి, ఇటు దక్షిణతీరపు దక్షిణ కొస ప్రజల మనసులు ఎలా మేళవించి బృందగానం చేస్తాయి?

1915లో సబర్మతి ఆశ్రమంలో ఒక సంఘటన జరిగింది. నెల్లూరుకు దగ్గరలో ఉన్న పల్లిపాడు గ్రామ నివాసి, గోఖలే స్థాపించిన 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా' సభ్యులు అయిన చతుర్వేదుల వెంకట కృష్ణయ్య అతివాదులైన బాలగంగాధర తిలక్, ఆయన తెలుగు ప్రాంతపు అనుచరులు వెన్నెలకంటి రాఘవయ్య మొదలైనవారితో ప్రగాఢమైన అనుబంధం కలిగి ఉన్నారు. పోరాటశీలి పొణకా కనకమ్మ బ్రిటీషు పోలీసుల కన్నుగప్పి, తమ మందుగుండు సామగ్రి దాచుకోవడానికి 14 ఎకరాల భూమిని పల్లిపాడులో పినాకిని (పెన్నానది) ఒడ్డున కొన్నారు. కలకత్తాకు దగ్గర గంగానది ఒడ్డున ఉన్న మణిక్ టోలా గార్డెన్ సంగతులు అప్పట్లో సంచలనం రేపాయి. ఈ విషయమే పొనకా కనకమ్మను ప్రేరేపించాయని అంటారు. అయితే బ్రిటిష్ పోలీసుల దాడి బాగా పెరిగినపుడు, వెంకట కృష్ణయ్య ఈ తీవ్రవాద కలాపాలు తగ్గించి 1915లో పూనా వెళ్ళిపోయారు. అప్పుడు గోఖలే 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ' సభ్యుడైన దిగుమర్తి హనుమంతరావును వెంకట కృష్ణయ్య అనుకోకుండా కలిశారు. పిమ్మట గాంధీజీ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై సి.వి. కృష్ణయ్య సబర్మతీ ఆశ్రమంలో చేరారు. ఆ సమయంలో మళ్ళీ తనకు తెలిసిన ప్రకృతి వైద్య నిపుణులైన దిగుమర్తి హనుమంతరావును అక్కడ కలిశారు. దాంతో వారి మిత్రత్వం బలపడింది. ప్రఖ్యాత చిత్రకారుడు దామెర్ల రామారావు చెల్లెలు బుచ్చి కృష్ణవేణమ్మను అప్పటికే హనుమంతరావు వివాహం చేసుకుని ఉన్నారు. ఆమె కూడా సబర్మతి ఆశ్రమంలో ఉన్నారు.

మరొకవైపు నెల్లూరు ప్రాంతం పొట్లపూడి గ్రామానికి చెందిన పొణకా కనకమ్మ 1918లో మద్రాసులో రాజగోపాలా చారి ఇంట్లో గాంధీజీని కలిసి సత్య, అహింసల పట్ల గౌరవం పెంచుకున్నారు. ఆమె ప్రారంభించిన 'సుజనరంజని' సభ కార్యకలా పాలలో కట్టమంచి రామలింగారెడ్డి, రాయప్రోలు సుబ్బారావు, దీపాల పిచ్చయ్య శాస్త్రి, కొమర్రాజు లక్ష్మణరావు, వెన్నెలకంటి రాఘవయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు వంటి వారు పాల్గొనేవారు. ఈ జాబితాలోని ప్రముఖుల జీవిత కృషిని ఒకసారి పరిశీలించి మననం చేసుకుంటే, ఆ కార్యక్రమాలు ఎంత ఉత్కృష్టమైనవో బోధపడ్తుంది. సి.వి. కృష్ణయ్య, పొణకా కనకమ్మ, దిగుమర్తి హనుమంతరావు, దామెర్ల బుచ్చి కృష్ణవేణమ్మగార్ల కలయిక తెలుగునాట కొత్త చైతన్యానికి సరికొత్త పునాది అయ్యింది.

దిగుమర్తి హనుమంతరావు, కృష్ణవేణమ్మ, చతుర్వేదుల వెంకట కృష్ణయ్య, పొణకా కనకమ్మ సహకారంతో సబర్మతి తర్వాత


గోపాలకృష్ణ గోఖలే


దిగుమర్తి హనుమంతరావు


బుచ్చి కృష్ణవేణమ్మ


పొణకా కనకమ్మ

పినాకిని ఒడ్డున దేశంలో రెండవ గాంధీ ఆశ్రమాన్ని 1921 ఏప్రిల్ 7న మహాత్ముడు ప్రారంభించారు. అతివాద కార్యక్రమాల కోసం మొదలైన పల్లెపాడు ఆయుధ కురుక్షేత్రం; సత్యాగ్రహ, అహింసల ఆశ్రయ ఆశ్రమంగా మారింది. అదే ఇపుడు శతాబ్దపు చరిత్ర కలిగిన పల్లెపాడు 'పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం'గా పేరుగాంచింది. ఈ ఆశ్రమాన్ని ప్రారంభించడానికి గాంధీజీ కోరికను అనుసరించి అంటరానితనాన్ని నిష్ఠగా పాటించే పల్లిపాడు బ్రాహ్మణులు తమ వీధుల గుండా హరిజనులతో ఊరేగారు. తర్వాతనే ఆశ్రమాన్ని గాంధీజీ ప్రారంభించారు. కనుక పల్లిపాడు పినాకిని ఆశ్రమం కారణంగా నెల్లూరును తెలుగు ప్రాంతాలలో గాంధేయ తత్వానికి, ఆచరణకు ఒక ముఖద్వారంగా పరిగణించాలి.


1915లో తొలిసారి, 1919 మరియు 1920 సంవత్సరాలలో ఒక్కోసారి చొప్పున రైలు ప్రయాణం చేస్తూ మార్గమధ్యంగా తెలుగు ప్రాంతాలను సందర్శించారు. కాగా 1921లో రెండుసార్లు 1929, 1933, 1934, 1946 సంవత్సరాలలో ఒక్కోసారి పర్యటనల మీద వచ్చారు. పదిరోజులు, పద్నాలుగు రోజులు ఇలా పరిశీలిస్తే మొత్తం 90-100 రోజులు గాంధీజీ మూడు దశాబ్దాల కాలవ్యవధిలో తెలుగు ప్రాంతంలో నివసించారు. మరోవైపు 1885 తొలి కాంగ్రెస్ సమావేశానికి అనంతపురం జిల్లా గుత్తి కేశవ పిళ్లై కూడా హాజరయ్యారు. 1905లోనే బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి పర్యటనకు వస్తే గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఆయన ప్రసంగాన్ని అనువదించారు. కనుక గాంధీజీ 1915లో భారతదేశానికి తిరిగి రాకమునుపే ఇక్కడి ప్రజానీకం స్పందించడం ప్రారంభించింది.


1910లో 'ఆంధ్రభారతి' పత్రికలో భోగరాజు పట్టాభి సీతారామయ్య, 'మోహన్ దాస్ కరంచంద్ గాంధీ' పేరుతో ఆయన దక్షిణాఫ్రికా విజయాలనూ, పోరాట విధానాన్ని, నిర్మాణాత్మక వైఖరిని వివరించారు. 1914లో ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో కాశీనాథుని నాగేశ్వరరావు 'గాంధీగారి త్యాగము' అనే వ్యాసం, రాయప్రోలు సుబ్బారావు రాసిన 'భగవాన్ మోహన్ దాస్ కరుణాసాంద్ర గాంధీ' పేరిట రాసిన వ్యాసం కనబడతాయి. 'ఆంధ్రపత్రిక' 1914లోనే బొంబాయి నుంచి మద్రాసుకు తరలి వచ్చింది. గరిమెళ్ళ సత్యగోదావరి శర్మ రాసిన 'సత్యాగ్రహం' తొలి కవితా ఖండిక కూడా 'ఆంధ్రపత్రిక' ఉగాది సంచికలోనే వెలువడింది. 1916లో వావిళ్ళ వారు ప్రచురించిన 'మోహన్ దాస్ కరంచంద్ గాంధీ' గ్రంథాన్ని ఎస్.వి. రంగాచార్యులు, అదే సంవత్సరం బొడ్డపాటి శేషగిరిరావు గాంధీజీ గురించి మరో జీవిత చరిత్రను రాశారు. మళ్ళీ 1920లో పి. నరసింహారావు, 1921లో మానికొండ సత్యనారాయణ శాస్త్రి, ఇంకా ఆత్మకూరు గోవిందాచార్యులు గాంధీజీ జీవిత చరిత్రలను రాశారు. కనుక వార్తాపత్రికల ద్వారా మాత్రమే కాక, నోటిమాటగా చేరిన సమాచారంతో గాంధీజీ ప్రభావం ఈ నేల మీద బాగా పడింది.


1920లో కలకత్తా నుంచి మద్రాసు వెళ్ళడం, మళ్ళీ బొంబాయి తిరిగి వెళ్ళడంతో మార్గమధ్యంలోనూ రైలు మారినపుడు కొందరు నాయకులు, ఎందరో ప్రజలు గాంధీజీని కలిసే వారు. 1921 మార్చి-ఏప్రిల్ మాసాలలో బెజవాడ కాంగ్రెస్ సభల కారణంగా దాదాపు రెండు వారాల పాటు మన తెలుగు తీరప్రాంతాలలో పర్యటించారు. మళ్ళీ 1921 సెప్టెంబరులో మరో రెండు వారాలపాటు బళ్ళారి, కడప, అనంతపురం, తిరుపతి ప్రాంతాలలో పర్యటించారు. 1925, 1927 సంవత్సరాలలో రెండుసార్లు రైలు ప్రయాణం చేస్తూ కొందరు ప్రజలను రైలుస్టేషన్లలో కలిశారు. తర్వాత 1929 ఏప్రిల్‌లో ఒక వారం పాటు హైదరాబాదు, విజయవాడలలో ఉన్నారు.

విదేశీ వస్త్ర బహిష్కరణ, సహాయ నిరాకరణ ఉద్యమాలు తారస్థాయిలో ఉండగా, 1922 ఫిబ్రవరి 4న చౌరీచోరాలో అల్లర్లు పెద్ద ఎత్తున జరిగి ఆ ప్రాంతం రక్తసిక్తమైంది. దాంతో హింసను ఎంత మాత్రమూ నచ్చని గాంధీజీ, అది మరింత ప్రజ్వరిల్లితే ఇంకా వినాశనమని తలంచి ఉద్యమాన్ని పూర్తిగా ఆపివేయడం చరిత్ర! ఈ చర్యలోని అంతఃసూత్రానికీ 1925 ఫిబ్రవరి 4న రాజమండ్రికి 25 కి.మీ. దూరంలో ఉండే సీతానగరంలో జరిగిన


సి.వి.కృష్ణయ్య


వెన్నెలకంటి రాఘవయ్య


గాడిచర్ల హరిసర్వోత్తమరావు


భోగరాజు పట్టాభి సీతారామయ్య

'గౌతమి సత్యాగ్రహ ఆశ్రమం' ప్రారంభానికి సంబంధం ఉంది. అహింసాత్మకంగా మన జీవితాన్ని, ఉద్యమాన్ని ఎలా మలచు కోవాలనే రీతిని తెలియజెప్పడానికి ఈ గౌతమీ 'సత్యాగ్రహాశ్రమం' మొదలైంది.

అల్లూరి సీతారామరాజు సహాధ్యాయి మద్దూరి అన్నపూర్ణయ్య, బ్రహ్మ జోశ్యుల సుబ్రహ్మణ్యం, క్రొవ్విడి లింగరాజు, ధరణిప్రగడ శేషగిరిరావు, చందుపట్ల హనుమంతరావు, మానాప్రగడ వెంకట్రావు, రామచంద్రుని వెంకటప్ప మొదలైన వారితో చరిత్ర సృష్టింప చేసిన ఈ ఆశ్రమాన్ని బులుసు సాంబమూర్తి ప్రారంభించారు. ఈ ఆశ్రమం నుంచి అన్నపూర్ణయ్య 'కాంగ్రెస్' పత్రికను వెలువరించారు. అల్లూరి సీతారామరాజును బ్రిటీషు వారు చంపిన తీరును వివరిస్తూ ఈ పత్రిక 1927 జూలై 16న ప్రత్యేక సంచికను ప్రచురించింది. గాంధీజీ ఉద్యమం అన్ని రకాల ప్రజలను అంతర్భాగం చేస్తూ, వారి జీవనవిధానం మెరుగయ్యే కార్యక్రమాలతో కలిసి సాగింది. కనుక అది ఏ ఒక వర్గానికో పరిమితం కాలేదు.

– డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732392
e : venunagasuri@gmail.com

# అంతరించిపోతున్న జాతులం

ప్రపంచ జంతు దినోత్సవం (అక్టోబర్ 4) సందర్భంగా అంతరించిపోతున్న జాతుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా, వాటిని ఎలా కాపాడుకోవాలో నేర్పుతారు. ఈ రోజు జంతు హక్కుల కోసం ప్రపంచవ్యాప్తంగా చొరవ చూపుతారు. జంతు దినోత్సవం ప్రధాన లక్ష్యం జంతు సంక్షేమం కోసం మెరుగైన ప్రమాణాలను నిర్ధారించడం. ప్రపంచ జంతు దినోత్సవాన్ని క్రమంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. జంతు రక్షణ కదలికను ఏకం చేయడంతోపాటు.. ప్రోత్సహిస్తుంది. జంతు సంరక్షణ ఆశ్రయం, జంతు సంక్షేమానికి కొంత సహకారం అందించడమే కాకుండా, ప్రజలు జంతు దినోత్సవం రోజున అనేక ఇతర కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు.



ఈ జంతు దినోత్సవాన్ని తొలిసారి 1931లో ఇటలీ దేశంలోని ఫ్లోరెన్స్ పట్టణంలో జరుపుకున్నారు. పర్యావరణ పరిరక్షకుడుగా ఖ్యాతిగడించిన సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అసిసి అక్టోబరు 3, 1226న చనిపోగా, ఆయన చనిపోయిన మరుసటి రోజును పెద్ద పండుగగా జరుపుకుంటారు. ఈ పండుగనే ప్రపంచ జంతు దినోత్సవంగా ప్రకటించి జరుపుకుంటారు.

వాస్తవానికి ఈ భూమిమీద ఎన్నో రకాలైన జంతువులు మనుషులతో పాటు జీవిస్తున్నాయి. అయితే, భూమిమీద మనుషుల కంటే ముందు నుంచే జంతువులే ఉన్నాయని సైన్స్ చెబుతోంది. అయితే, భూమి ఆవిర్భవించిన తర్వాత అనేక అరుదైన జంతువుల జాడ కనిపించకుండా పోయింది. నేటి ఆధునిక యుగంలోనూ అనేక జంతువులు అంతరించిపోతున్నాయి.

**థీమ్:** "జంతువులను రక్షించండి, గ్రహాన్ని రక్షించండి!". ఈ థీమ్ ప్రపంచ జంతు దినోత్సవం యొక్క 100వ వార్షికోత్సవాన్ని సూచిస్తుంది. జంతు సంక్షేమం, గ్రహ ఆరోగ్యం యొక్క పరస్పర సంబంధాన్ని ప్రధానంగా తెలుపుతుంది. జంతువులను రక్షించడం భూమిని రక్షించడంతో కలిసి ఉంటుందని ప్రత్యేకంగా తెలుపుతుంది.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

# జమానత్ కథ వెనుక కథ

'అతను దోషి కాబట్టి జైలులో లేడు
ఏదైనా శిక్ష విధించప డినందు కు అతను జైలులో లేడు విచారణ నుండి తప్పించుకునే అవకాశం ఉంది కాబట్టి అతను జైలులో లేడు
ఒకే ఒక కారణం వల్ల అతను జైలులో ఉన్నాడు – ఎందుకంటే అతను పేదవాడు... అందుకే అతను జామీను పెట్టు కోలేక పోయాడు."

ఈ మాట లని సుప్రీంకోర్టు మో తీ రామ్ కెస్ లో చెప్పింది బేయిలు గురించి కథలు ఎన్నో –
అలాంటిదే. జమానత్ కథ.

ఓ చిన్న సంఘటన ఒక వ్యక్తి హత్యకు ఎలా దారి తీసిందన్న విషయం నా మనసులో చాలాకాలం అలజడి రేపింది. అది జామిను ఇవ్వలేని వ్యక్తి కథ. ఆ సంఘటన చివరికి ఓ కథగా రూపుదిద్దుకుంది.

– నా స్వీయానుభవం నుంచి పుట్టిన ఆ కథే.

నా కథలు చాలా వరకు నా అనుభవం నుంచి వచ్చినవే. కొన్ని కథలు ఇతరుల అనుభవాల నుంచి వచ్చినవి. నా ఆలోచనలనుంచి నుంచి ఊడిపడ్డవి చాలా తక్కువ. నా వ్యక్తిగత అనుభవం నుంచి వచ్చిన అనుభవాలకి కథా రూపం ఇవ్వడం నేను ఎక్కువగా చేసిన పని.

నేను న్యాయవాదిగా పనిచేశాను. మేజిస్ట్రేట్‌గా పనిచేశాను. చీఫ్ మెట్రొపాలిటన్ మేజిస్ట్రేట్‌గా పని చెసాను. కొంతకాలం డిప్యుటేషన్ మీద పోలీస్ అకాడమీలో పని చేశాను. చాలా మంది పోలీస్ అధికారులకు ప్రాసిక్యూటర్ లకి శిక్షణని ఇచ్చాను. ఆ తర్వాత ఫ్యామిలీ కోర్టు జడ్జిగా పనిచేశాను. జిల్లా జడ్జిగా పనిచేశాను. జ్యుడీషియల్ అకాడెమిలో డైరెక్టర్‌గా, ఫాకాల్టీ మెంబర్‌గా పని చేశాను. ఇలా ఎన్నో రకాల అనుభవాలు. వీటిలో నుంచి వచ్చినవే నా కథలు. అవి 'జింబో కథలు', 'రూల్ ఆఫ్ లా కథలు', 'నేను,.. నా నల్లకోటు కథలు', 'ఆమె కోరిక కథలు'

జమానత్'కథ కూడా అలాంటిదే. ఇది నా అనుభవం లోనిది.

నేను 11వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా సికింద్రాబాద్‌లో పని చేస్తున్నప్పుడు ఓ సంఘటన జరిగింది. అది ఓ కేసు రూపంలో నా దగ్గరికి వచ్చింది.

ఓ వ్యక్తిని చంపి కాల్చివేసిన సంఘటన సికింద్రాబాద్ ప్రాంతంలో జరిగింది. ఎవరి శవమో కూడా తెలియదు.

ఫుట్ పాత్ వ్యాపారుల నుంచి మామూళ్లు వసూలు చేసే వ్యక్తి లడ్డూ. ఆ హత్య అతను చేశాడన్న సంగతి చాలా రోజులకు పోలీసు దర్యాప్తులో తేలింది. ఆ సంఘటన చూసిన వ్యక్తుల స్టేట్ మెంట్‌ని నమోదు చేయమని పోలీసులు తమ అభ్యర్థనను నా ముందు దాఖలు చేశారు. అదేవిధంగా వారి వాంగ్మూలాలను నమోదు చేశాను.

ఒక చిన్న సంఘటన ఒక వ్యక్తి మరణానికి ఎలా దారి తీసిందిన్న విషయం నా మనసులో చాలాకాలం అలజడి రేపింది. చివరికి అదే కథగా రూపుదిద్దుకుంది.

బట్టలు ఆరేసుకోవాల్సిన విషయంలో ఒక మురికివాడలోని లక్ష్మికి, జయమ్మకి గొడవ జరుగుతుంది. ఇద్దరూ బాగా తిట్టుకుంటువుంటారు.

లక్ష్మిని నీచంగా జయమ్మ తిడుతుంది. తన భార్య లక్ష్మిని అత్యంత నీచంగా తిట్టడం గమనించిన లడ్డూ జయమ్మను ఓ దెబ్బ వేస్తాడు. ఆమెకు గాయమై రక్తం కూడా కారుతుంది. జయమ్మ ప్రియుడు



రామ్మూర్తి . అతనికి ఓ హెడ్ కానిస్టేబుల్ తో స్నేహితం వుంటుంది. అతని ప్రోద్భలంతో పోలీసులకి ఫిర్యాదు చేస్తుంది జయమ్మ. పోలీసులు అతన్ని అరెస్టు చేసి కోర్టుకు పంపుతారు.

ఐదు వేల రూపాయల చొప్పున ఇద్దరు వ్యక్తుల జమానత్ ఇస్తే బెయిల్ మీద విడుదల చేస్తున్నట్టుగా ఉత్తర్వులు జారీ చేస్తాడు మేజిస్ట్రేట్. కానీ అంత జామీను ఇచ్చే స్తోమత లడ్డుకి లేదు. దాంతో అతను జైల్లో మగ్గాల్సి వస్తుంది.

ఓ సారి వాయిదాకు కోర్టుకు అతన్ని తీసుకొని వచ్చినప్పుడు అంత జామీను ఇవ్వలేనని కొంత తగ్గించమని మేజిస్ట్రేట్ కు మొర పెట్టుకుంటాడు లడ్డు. మేజిస్టేట్ వినిపించుకోడు.

లడ్డూకి ఇద్దరు భార్యలు. జామీను ఇచ్చే వ్యక్తుల కోసం ఇద్దరూ చాలా ప్రయత్నాలు చేస్తారు. కానీ ఫలితం లేకపోతుంది. లడ్డూ అలా జైల్లో వుండిపోతాడు.

ఓ రెండు నెలలు గడుస్తాయి. మళ్లీ ఒక రోజు లడ్డూని కోర్టుకు తీసుకొని వస్తారు. జామీనిచ్చేవారు దొరకలేదని లక్ష్మి విచారంగా అతనికి చెబుతుంది. లడ్డూకి దిక్కుతోచదు. ఆ సమయంలో కేసు నుంచి బయట పడటానికి సలహా చెప్పమని ఓ కానిస్టేబుల్ అడుగుతాడు లడ్డూ.

"రెండు రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేయబోతున్నాం. విజయమ్మతో రాజీపడితే కేసు కొట్టేస్తారు. నీ భార్యను జయమ్మ తో మాట్లాడమని చెప్పు" అంటాడు ఆ కానిస్టేబుల్.

లడ్డూకి ఆ సలహా నచ్చదు. "అలాగైతే మరిన్ని నెలలు జైల్లో

వుండాల్సివుంటుంది" అంటాడు ఆ కానిస్టేబుల్.

గత్యంతరం లేని పరిస్థితి లడ్డూది. ఆ మాటే భార్య లక్ష్మితో చెబుతాడు. లక్ష్మి ఏమి చేయలేక "సరేనని" అంటుంది.

కష్టంగా ఆ రోజు సాయంత్రం జయమ్మ ఇంటికి వెళ్తుంది లక్ష్మి. అప్పుడు అక్కడ జయమ్మ ప్రియుడు రామ్మూర్తి ఉంటాడు. లక్ష్మీ మీద అతని కన్ను పడుతుంది.

లక్ష్మి వచ్చిన పని తెలుసుకొని–'దాందేముంది. అలాగే రాజీ పడదాం 'అని చెబుతాడు. రెండు మూడు సార్లు జయమ్మ ఇంటికి తిప్పుతాడు. చివరికి ఒక రోజు సారా తాగిస్తాడు. ఆ తర్వాత జయమ్మ సహాయంతో లక్ష్మిని దారుణంగా అనుభవిస్తాడు. కానీ లడ్డూ విడుదలకు ఏ మాత్రం ప్రయత్నం చేయడు.

"రేపు కోర్టుకు వెళ్దాం. లడ్డూను విడిపించుకుని వద్దాం" అని మరోమారు ఆశ పెట్టి మళ్ళీ తన కోరికను తీర్చుకుంటాడు రామ్మూర్తి. లడ్డూ విడుదల కోసం అతను ఏమీ ప్రయత్నం చేయడం లేదన్న విషయం లక్ష్మికి అర్థమవుతుంది.

చివరికి తన సవతి పుష్పతో కలిసి ఉన్నదంతా ఊడ్చి జామీను డబ్బులు కట్టి లడ్డూని విడుదల చేయిస్తుంది. లడ్డూ విడుదలైన తర్వాత అతనికి మొత్తం విషయం చెబుదామని అనుకుంటుంది. కానీ లడ్డూ కొడతాడన్న భయంతో చెప్పదు.లడ్డు ఎలా రియాక్ట్ అవుతాడోనని భయపడుతుంది.

లడ్డూ లేని రోజున, లడ్డూకి జరిగిన విషయం చెబుతానని బెదిరించి మళ్ళీ లక్ష్మిని అనుభవిస్తాడు రామ్మూర్తి. అన్యాయంగా ఆతని కోరికకు బలి కావల్సి వస్తుందని లక్ష్మి ఆవేదన చెందుతుంది.

"ఇంకొకసారి అతడిని నా దగ్గరకు తీసుకుని రాకు. జరిగిందేదో జరిగింది. నా మానాన నన్ను బతకనివ్వు" అని జయమ్మని అభ్యర్థిస్తోంది లక్ష్మి.

తన భార్య జయమ్మ ఇంటి దగ్గర ఆమెతో మాట్లాడటం లడ్డూ చూస్తాడు. అతనికి విపరీతమైన కోపం వస్తుంది. కోపంతో లక్ష్మిని విపరీతంగా కొడతాడు. చివరికి జరిగిన విషయం అంతా లడ్డుకి చెబుతుంది లక్ష్మి.

రాజీ పేరుతో తన భార్యను వంచించిన వ్యక్తి పేరు రామ్మూర్తి. అతడి అంతం చూడటానికి నిశ్చయించుకుంటాడు లడ్డూ. అనుకున్నట్లుగానే జాగ్రత్తగా ప్లాన్ చేసి అతన్ని చంపి కాల్చి బూడిద చేస్తాడు. నెల రోజుల తర్వాత లడ్డూకి సాయం చేసిన ఇద్దరు వ్యక్తులను ఆటో డ్రైవర్ ను పోలీసులు కనుక్కుంటారు. తగు రీతిలో విచారిస్తారు. జరిగిన విషయం వాళ్ళు పోలీసులకి చెబుతారు. వాళ్ళ స్టేట్ మెంట్లని నమోదు చేయమని పోలీసులు దరఖాస్తు పెడతారు.

ఇది నిజ జీవిత గాథ. ఈ క్రమంలో ఇలా వాళ్ళందరి స్టేట్ మెంట్లని నమోదు చేశాను. కానీ నేను ఆలోచిస్తూ ఉండి పోయాను. హో ఒక చిన్న సంఘటన ఎన్ని గొడవలకు దారి తీసింది అన్న ఈ ఆలోచన చాలా రోజులు నా మనసులో ఉండిపోయింది.

లడ్డూ స్టేట్ మెంట్ నమోదు చేయాల్సిన అవసరం వుండదు. అతను నాకు స్టేట్ మెంట్ ఇస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన మెదిలింది. అతని స్టేట్ మెంట్ ని నమోదు చేసి ఆ సంఘటనని కథగా మార్చాను.

ఈ కథలో రచయిత కథ చెప్పడు. ఒక్కో పాత్ర వచ్చి కథ తన కథ చెప్పి వెళ్లిపోతుంది. కథ చెప్పడంలో ఇది ఒక కొత్త ప్రయోగం. అద్భుతం అన్న వాళ్ళూ ఉన్నారు. ఏం ప్రయోగం అని పెదవి విరిచిన వాళ్ళూ ఉన్నారు. నాకు మాత్రం అన్ని విధాలుగా నచ్చిన కథ ఇది.

కథలో లడ్డు పాత్ర కథ చివరలో ఇలా స్టేట్మెంట్ ఇస్తోంది.

"కాంప్రమైజ్ గురించి నా భార్య జయమ్మ దగ్గరకు పోతే దాన్ని రామ్మూర్తి అలుసుగా తీసుకుని ఆమెను మత్యుపెట్టి సారా తాగించి అనుభవించాడు. అది ఒక్కసారి కాదు. నాలుగు సార్లు. అంతే కాదు. నేను జైలు నుంచి వచ్చాక కూడా నేను లేనప్పుడు ఆమెను బెదిరించి లొంగదీసుకున్నాడు. ఇలాంటి వాడిని నేను ఎలా వదిలి పెట్టాలి? అందుకని ఒక రోజు రామ్మూర్తి ని తాగడానికి తీసుకపోయి, మిత్రుడు సుధాకర్ రెడ్డి సహాయంతో ముక్కలు ముక్కలుగా నరికాను. గోనెసంచిలో ప్యాక్ చేసి చిట్టీ, వెంకట్రావుల సాయంతో కాల్చి బూడిద చేశాను.

**"కాంప్రమైజ్ గురించి నా భార్య జయమ్మ దగ్గరకు పోతే దాన్ని రామ్మూర్తి అలుసుగా తీసుకుని ఆమెను మత్యుపెట్టి సారా తాగించి అనుభవించాడు. అది ఒక్కసారి కాదు. నాలుగు సార్లు. అంతే కాదు. నేను జైలు నుంచి వచ్చాక కూడా నేను లేనప్పుడు ఆమెను బెదిరించి లొంగదీసుకున్నాడు. ఇలాంటి వాడిని నేను ఎలా వదిలి పెట్టాలి? అందుకని ఒక రోజు రామ్మూర్తి ని తాగడానికి తీసుకపోయి, మిత్రుడు సుధాకర్ రెడ్డి సహాయంతో ముక్కలు ముక్కలుగా నరికాను. గోనెసంచిలో ప్యాక్ చేసి చిట్టీ, వెంకట్రావుల సాయంతో కాల్చి బూడిద చేశాను.**

నన్ను జైలు నుంచి విముక్తి చేస్తానని చెప్పి నా భార్యని బలవంతంగా అనుభవించిన రామ్మూర్తిని చంపడం తప్పా? నా విడుదల సాకుతో మళ్ళీ మళ్ళీ ఆమెను వంచించిన వాడిని ముక్కలు ముక్కలుగా నరకడం సమంజసం కాదంటారా? నేను జైలు నుంచి వచ్చాక కూడా బెదిరించి ఆమెను లొంగదీసుకుని నీతిమాలిన వాడిని పెట్రోల్ పోసి కాల్ చేయడం న్యాయబద్ధం కాదంటారా? మరి ఏది న్యాయం? చిన్న దెబ్బ కొట్టినందుకు నన్ను లాకప్ లో ఉంచి చితక్కొట్టిన పోలీసులది న్యాయమా? చిన్న నేరానికి విచారణ లేకుండా రెండు మాసాలు జైల్లో ఉంచిన కోర్టుది న్యాయమా? నా ఆర్థిక స్తోమత చూడకుండా, నేను చెప్పేది వినకుండా ఐదు వేల రూపాయలతో ఇద్దరు జమీన్ దారులను తెచ్చుకొమ్మన్న మేజిస్ట్రేట్ ది న్యాయమా?నా స్తోమతకి తగ్గ జామీను ఉంటే –కేసు కాంప్రమైజ్ గురించి జయమ్మతో మాట్లాడమని నా భార్యకి చెప్పేవాడినా? అప్పుడు ఆ రామ్మూర్తి గాడి కళ్ళు నా భార్య మీద పడేవా? వాడు ఇంత పని చేసే వాడా?

కోర్టుని ఈ జమానత్ ని ముక్కలు ముక్కలుగా నరికలేక వాడిని నరికేసాను. పూర్తిగా తగలబెట్టాను. బూడిద చేసాను. నేను చేసింది తప్పా? " అని నిలదీస్తాడు లడ్డూ.

ఇది అతని స్టేట్ మెంట్, ఒకవేళ అతను ఇస్తే.?అతని స్టేట్ మెంట్ తో ఆ సంఘటన కథగా మారి పోయింది.

'జమానత్ ' కథ వెనుక కథ.

–మంగారి రాజేందర్ (జింబో)

m : 9440483001

e : rajenderzimbo@gmail.com



పార్థివేశ్వరాలయం, రాయపోలు

# రాయపోలు అనే రాజనగరంలో

సిద్ధిపేట జిల్లాలోని ఒక మండల కేంద్రం రాయపోల్. పూర్వం రావిప్రోలుగా శాసనాల్లో పేర్కొనబడిన ఈ గ్రామం ఒక ప్రాచీననగరం, ఒకప్పటి అగ్రహారం కూడా. కల్యాణి చాళుక్యుల సామంతుల రాజధాని నగరం. ఈ గ్రామంలో కళ్యాణీ చాళుక్యులకాలంనాటి 4 శాసనాలు దొరికాయి. అందులో కళ్యాణీ చాళుక్య సామ్రాజ్య పాలకులు త్రైలోక్యమల్లుని కాలానివి రెండు, భువనైక మల్లదేవర కాలానివి రెండు శాసనాలు ఉన్నాయి. ఈ గ్రామం ఒకప్పుడు చిన్న రాజధానిగా వుండేదని, రాయపోలు ప్రభువుగా విష్ణయరాజు వుండేవాడని దొరికిన శాసనాల వల్ల తెలుస్తున్నది.

గ్రామంలో ఎక్కడ చూసినా పూర్వనగరపు చారిత్రక శిథిలాలు కనిపిస్తాయి. దేవతల శిల్పాలు విడిగా లభిస్తున్నాయి.

**గణపతి దేవాలయం:**


గ్రామంలో నూతనంగా కట్టిన ఒక చిన్న దేవాలయం ఉంది. ఈ గుడిలో దాదాపు 6 అడుగుల పైనున్న గణపతి విగ్రహం ఉంది. చేటచెవులు, దండ రెట్టలకు సర్పాలు ఉన్నాయి. కాళ్ళకు కడియాలు ఉన్నాయి. ఉదరం మీద నాగబంధంతో కనిపిస్తున్న ఈ వినాయకుడు తొలితరం చాళుక్యశైలి శిల్పం. ఈ ఆలయం ముందు ఒక పెద్ద రాతి స్తంభం ఉంది. దానిపైన ఒక శాసనం చెక్కబడి ఉంది. ఇది కళ్యాణీ చాళుక్య చక్రవర్తి ఆహవమల్ల 1వ సోమేశ్వరుని ఏలుబడి కాలంలో క్రీ.శ.1048లో వేయబడింది. ఈ శాసనంలో పేర్కొన్న వివరాల ప్రకారం 'రావిప్రోలు'గా పిలువబడిన ఈ గ్రామంలో గావుండ హువిన కొడుకు జువ్విరడ్డి గణపతి ప్రతిష్ట, చేసి హనుమంతునికి గుడి నిర్మాణం, అగ్రహార విద్యార్థులకు బసది కల్పన చేయించాడని వుంది. ఆ శాసనంలో జువ్విరెడ్డి ప్రతిష్ఠ చేశాడని చెప్పే గణపతి విగ్రహం ఇదే అని శాసన ఆధారంగా చెప్పవచ్చు.



చాళుక్యశైలి గణపతి

**పార్థివేశ్వరాలయం:**

ఈ గ్రామంలోని దేవుని చెరువుకట్టపై ఉన్న పార్థివేశ్వరుని గుడిని పరిశీలించినపుడు అది పూర్వం ఒక జైన దేవాలయం అని తెలుస్తుంది. గుడి బయట జైన నిశీధి, పాదాలు మాత్రమే మిగిలి ఉన్న పార్శ్వనాథుని విగ్రహశకలం, కుడిపక్కన చామరధారిణితో కనిపిస్తుంది. దేవాలయ బయటి ద్వారశాఖ(శేరె)లకు రెండువైపుల కలశాలు చెక్కి వున్నాయి. ప్రవేశ ద్వారానికి కలిపికట్టిన గోడలో ఉన్న రెండు స్థంబాలలో కుడివైపు స్తంభం మీద శిశువు తలమీద చేయిపెట్టి నిల్చున్న తల్లి శిల్పం (జైనయక్షిణి అంబిక), మధ్యలో హంసలు, పైన చతుర్భుజ గణపతి విగ్రహం, ఎడమవైపు స్తంభం మీద కింద కుడిచేతిలో చామరం, ఎడమచేతిలో ఫలంతో జైన యక్షిణి, మధ్యలో హంసల డిజైన్, పైన పైచేతులలో పాశం, అంకుశం, కిందిచేతులలో అక్షమాల, పుస్తకాలను ధరించిన సరస్వతి


చాళుక్యశైలి శివలింగం


చాళుక్యశైలి నంది


సప్తమాతృకలు


జైనపాదాలు

శిల్పాలున్నాయి. గుడి ముందరి మంటప స్తంభాలు రాష్ట్రకూట శైలిలో వున్నాయి. కొత్తగుడి ప్రవేశానికి పక్కన రెండు ఎర్లీ కాకతీయ స్తంభాలున్నాయి. ప్రస్తుతం ఉన్న దేవాలయం తిరిగి కట్టబడినట్లు తెలుస్తోంది. పార్శ్వనాథ దేవాలయంలో లింగ ప్రతిష్టచేయబడ్డది. జైనశిల్పాలను ఎక్కడో పడేసినట్లున్నది. గర్భగుడి ద్వారశాఖల మీద లకులీశ మతానుగుణంగా శైవద్వారపాలకులు, పరిచారకులు, స్తంభికలు, ఏనుగులపైన సింహాలపంక్తి, వజ్ర స్తగితమైన ద్వారబంధాలు, పైన పతంగం(ఉత్తరాశి) మీద మంగళఫలకం లేదా లలాటబింబంగా గజలక్ష్మి చెక్కబడ్డాయి. గర్భగుడిలో వర్తులాకారం, అంచులున్న చాళుక్యశైలి పానవట్టం, దానిలో శివలింగం ప్రతిష్ట చేయబడి ఉంది. అక్కడే ఒక మూల బ్రహ్మ, విష్ణు, రుద్రభాగాలతో రెండడుగులు మించివున్న సమలింగం అగుపిస్తున్నది. మరొకపక్క 10వ శతాబ్దపు గణపతి శిల్పముంది. దేవాలయం ముందర రాష్ట్రకూటశైలిలో చెక్కిన 8స్తంభాల మంటపం వుంది. పక్కన చాళుక్యశైలి నంది గంటలపట్టెడలతో అలంకరించబడివుంది. దేవాలయం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం చాళుక్యశైలిదే.

**విడి శిల్పాలు:**

గుడి బయట చాలా విగ్రహాలూ ఉన్నాయి. అక్కడ ఉన్న విడి విగ్రహాలలో కార్తికేయుని మిథునశిల్పం ఉంది. మూడు పద్మపత్రాల వలయాల మధ్య చెక్కిన జైనపాదాల రాతిబిల్ల ఒకటి ఉంది. సప్తమాతృకల ఫలకాలు రెండున్నాయి. అందులో ఒకటి రెండు ముక్కలుగా కనిపిస్తున్నది. వీటి మీద రాష్ట్రకూటుల కాలంనాటి శైలిలో చెక్కిన 7గురు మాతృదేవతలున్నారు. మరొక శిల్పఫలకం మీద గణపతిసహిత అష్టమాతృకలున్నారు. నాలుగైదు నాగశిలలు వరుసగా నిలిపివున్నాయి. భైరవుని శిల్పం కూడా విడివిగ్రహాలలో ఒకటి. మల్లన్నగా కొలుచుకునే ఆసనస్థిత మైలారుదేవుని శిల్పం అందంగా చెక్కబడ్డది. కాకతీయానంతర శైలి శిల్పం ఇది. దాని పక్కన చిన్న అర్ధమూర్తి ద్విభుజి అయిన చాముండ విగ్రహం వుంది. చాళుక్యశైలి లింగపీఠం, శివలింగం, ద్విభుజి చాముండ శిల్పమొకటి, చేతులు, కాళ్ళు విరిగిన సూర్యుని శిల్పం, కేశవమూర్తులుగా కనిపించే రెండు ద్వారపాలకుల శిల్పాలున్నాయి. ఈ విగ్రహాలను చూస్తుంటే అక్కడెక్కడో వైష్ణవాలయం కూడా వుండి వుండాలనిపిస్తున్నది. శివాలయం నుండి చెరువు కట్ట మీదుగానే కొంచెం ముందుకు వెళ్తే చతుర్భుజుడైన చాళుక్య శైలి భైరవుడు త్రిశూలం, ఢమరుకం, కత్తి, రక్తపాత్రతో ఉన్నాడు. అక్కడే మరొక అమ్మదేవత శిల్పం చతుర్భుజాలతో మట్టిలో కూరుకొని కనిపిస్తుంది.

రాయపోలులో లభించినవి 4శాసనాలు. ఇవి కళ్యాణీచాళుక్యుల ఏలుబడికాలానికి చెందినవి. రాయపోలు ఒకప్పటి అగ్రహారమని శాసనాలవల్ల వెల్లడౌతున్నది.

**ఒకటవ శాసనం:**

రాయపోల్ లోని గణేశునిగుడి ధ్వజస్తంభం మీదున్న శాసనం క్రీ.శ.1048 ఏప్రిల్ 21న వేయబడ్డది. ఈ శాసనం రావిప్రోలు అగ్రహారం గావుండ హువిన కొడుకు జువ్విరెడ్డి గణపతి ప్రతిష్ట, హనుమంతుని గుడి నిర్మాణం, బసతి(సత్రం) కట్టించాడని తెలియజేస్తున్నది.

**రెండవ శాసనం:**

రాయపోల్ లోని మైసమ్మ గుడి దగ్గర వున్న స్తంభ శాసనం 1వ సోమేశ్వరుడు, త్రైలోక్యమల్ల పాలనాకాలం క్రీ.శ.1061లో జైనధర్మానికి చెందిన మూలసంఘం, సరస్వతి గణం జైనగురువు కనకనంది సిద్ధాంతదేవర, అసగబుకవైర శిష్యుడు దండుబకనిళ రుక్షకేశుని ప్రస్తావించింది.

ఒకప్పుడు రాయపోలులో జైనమతానికి సంబంధించిన బసది


జైన సరస్వతి


సప్తమాతృకలు


గజలక్ష్మి లలాటబింబం

|  |  |  |  |  |  |
|---|---|---|---|---|---|
| హనుమద్దేవాలయం | ఆత్మాహుతి వీరగల్లు | గడతల వీరగల్లు | జైన యక్షిణి అంబిక | కేశవమూర్తి | మైలారుదేవర 15వ శ. |

వుండేదని చెప్పడానికి ఈ శాసనమొక ఆధారం. అట్లే జైనపాదాలు, జైనయక్షిణి శిల్పాలు కూడా రుజువులే.

**మూడవ శాసనం:**

రాయపోలులోని శివాలయం ముందరున్నది 3వ శాసనం. పశ్చిమచాళుక్య చక్రవర్తి భువనైకమల్లదేవ కంపిలి నెలవీడు నుంచి పాలిస్తున్న కాలంలో క్రీ.శ.1073 ఏప్రిల్ 22వ తేదీన వేయబడిన ఈ శాసనం రావిపోల ప్రభువు విష్ణయరాజు పార్థివదేవకు నిత్యపూజలకు, సాధువులకు ఆహారానికి పాండనచెరువు, భాగీనది తీరం, తోట, ఆకు చెరువు, తంగళ్ళకుట్టి వంటి చోట్ల 108 మర్తురుల భూదానం చేసినాడని, ఈ భూమిని యమ, నియమ, స్వాధ్యాయ, ధ్యాన, ధారణ, మౌనానుష్టాన, జప, సమాధి సంపన్నుడైన పూజారి లకులాగమ సమయ సముద్ధరణుడైన పూండియ నకరేశ్వర ఆరాధకుడు లోకాభరణ పండితునికి అప్పగించాడని వివరిస్తున్నది.

**నాలుగవ శాసనం:**

మరొక చివరి క్రీ.శ.1074నాటి శాసనం భువనైకమల్లదేవ కళ్యాణీ నెలవీడులో వున్నపుడు రావిప్రోలు ప్రభువు విష్ణయరాజు పాండవ తటాకం, పూలతోటల కొరకు 290 గద్యాణాల ధనం, 50 మర్తురుల భూమిని దానం చేసినట్లు తెలియజేస్తున్నది. ఈ శాసనంలో పేర్కొన్న పాండవతటాకం ఇప్పటి గ్రామంలోని చెరువునానుకొని అక్కడక్కడ కనిపిస్తున్న మట్టి దిబ్బలు 5 చోట్ల ఉన్నాయి. వీటిని స్థానికులు పాండవుల గెరెలి(కెఱియ=చెరువు) దిబ్బలు అని పిలుస్తారు. ఈ మట్టి దిబ్బలు ఒకప్పటి రావిప్రోలుకోట శిధిలాలు కావొచ్చు. చెరువులో నీళ్ళు తగ్గినప్పుడు ఆ దిబ్బలని పరిశీలించవలసిన అవసరం ఉంది.

**వీరగల్లులు:**

ఈ గ్రామంలో మూడు వీరగల్లు శిల్పాలు ఉన్నాయి. వాటిలో విరిగిన శిల్పాలు రెండు ఉన్నాయి. ఇక్కడ ఉన్న అన్ని శిల్పాలు ఆత్మహుతి శిల్పాలె. విరిగిన రెండు శిల్పాలు కాక అక్కడే ఉన్న మరొక వీరగల్లు విగ్రహం ప్రత్యేకమైనది. రాష్ట్రకూటుల కాలానికి చెందినది ఈ శిల్పం ఆత్మాహుతి వీరగల్లు. రెండంతస్తులున్న ఈ వీరగల్లులోని మొదటి అంతస్తులో ఒక వీరుడు కూర్చుని ఉన్నాడు. ఆయన పట్టుకున్న పరికరమేదో రంగులు వేయడం వల్ల సరిగా కనిపించడం లేదు. వీరుని నడినెత్తిన కొప్పు ఉంది. వంచిన వెదురుగడకు వీరుని తల తెగి స్పష్టంగా కనిపిస్తుంది. ఇటువంటి విగ్రహాన్ని 'గడతల' వీరగల్లు అంటారు. రెండవ అంతస్తులో ఆత్మాహుతి చేసుకున్న వీరున్ని దేవలోకానికి తీసుకొని పోతున్న ఇద్దరు చామరధారిణులైన అమరాంగనలు కనిపిస్తున్నారు శైవభక్తులు ఆత్మబలి దానాలను ధర్మకార్యంగా, శివుని సన్నిధికి చేర్చే తక్షణమార్గంగా ఎంచుకున్నారు.

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

|  |  |  |  |  |
|---|---|---|---|---|
| వల్లిసమేత సుబ్రహ్మణ్యం | చాముండి 8, 9వ.శ. | నాగశిలలు | బైరవుడు | ఆదిత్యుడు |



# స్మృతులు-ఐక్యతకు చారిత్రక చిహ్నం

## మహా చింతచెట్టు క్రింద స్మారక సభ

ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ (FBH) ఆధ్వర్యంలో, సెంటర్ ఫర్ దెక్కన్ స్టడీస్ (CDS) మరియు పలు పౌరసమాజ సంస్థల సహకారంతో, వార్షిక జ్ఞాపక-ఐక్యత సభ సెప్టెంబర్ 25న ఉస్మానియా జనరల్ హాస్పిటల్, అఫ్జల్‌గంజ్‌లోని చారిత్రక చింత చెట్టు కింద నిర్వహించబడింది. 1908లో మూసీ వరదల సమయంలో దాదాపు 150 మందికి ప్రాణాధారం అయిన ఈ చెట్టు, మానవతా సేవకు ప్రతీకగా, స్మృతులు-ఐక్యతకు చారిత్రక చిహ్నంగా చింతచెట్టు స్మరించబడింది.

కార్యక్రమంలో FBH అధ్యక్షుడు Er. వేదకుమార్ మణికొండ అధ్యక్షత వహించి ప్రసంగించారు. వేదకుమార్ మాట్లాడుతూ.. 2008లో ప్రారంభమైన ఈ జ్ఞాపక సభ ప్రతి సంవత్సరం నిరంతరంగా కొనసాగుతోందని గుర్తుచేశారు. గత ఇరువై సంవత్సరాలుగా FBH మూసీ నదిపై చేపట్టిన అధ్యయనాలు, ప్రభుత్వానికి అందజేసిన సూచనలు వివరించారు. హైదరాబాదు నగర ప్రణాళికలోని సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏకీకృత మాస్టర్ ప్లాన్ అవసరమని, అలాగే మురుగు నీటి ప్రణాళిక అత్యవసరమని ప్రభుత్వాన్ని కోరారు. కవి సంఘమిత్ర చెట్టు ఔదార్యాన్ని, మూసీ విషాదాన్ని పాట రూపంలో ఆలపించారు. ప్రముఖ సినీ దర్శకురాలు అఫ్సాన్ మూసీ విపత్తు జ్ఞాపకాలను మళ్లీ ప్రజలలో మేల్కొల్పుతున్న FBH కృషిని కొనియాడారు. ప్రసిద్ధ సాహితీవేత్త అంబటి వెంకన్న నగర ప్రణాళికలో పౌరసమాజాన్ని కలుపుతూ వెళ్ళిన వేదకుమార్ మణికొండను కొనియాడి, హైదరాబాద్ వారసత్వాన్ని తన గీతాలాపన ద్వారా ఆలపించారు.

సామాజిక, మానవతా దృక్పథంతో బ్రదర్ వర్గీస్, పునరా-వాసం లేకుండా మూసీ ప్రజల తరలింపును ఖండించారు. 1997లో నందనవనం ప్రాజెక్ట్‌లో జరిగిన లోపాలను విచారించారు. మానవ హక్కుల కార్యకర్త జీవన్‌కుమార్, పౌరసమాజం నిర్లక్ష్య పరిపాలనను ప్రశ్నించాలని, ప్రజలను నగరాభివృద్ధిలో భాగస్వాములుగా చూడాలని పిలుపునిచ్చారు. డా. జయకృష్ణ, ఉస్మానియా ఆసుపత్రి చీఫ్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్, "ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్" కృషికి నిరంతర సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. భూగర్భ జల నిపుణుడు సుభాష్ రెడ్డి, నగరం నీటమునిగి పోవడంపై, వర్షపు నీటి సక్రమ నిర్వహణలో వైఫల్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. తన సిఫార్సులను FBH ద్వారా ప్రభుత్వానికి అందజేస్తానన్నారు. అనిల్ OSCIA ప్రతినిధి, విద్యార్థులను పర్యావరణహిత అలవాట్లు అలవరచు కోవాలని సూచించారు.

ప్రొ. అన్వర్‌ఖాన్, FBH గత 17 సంవత్సరాలుగా ఈ సభ పట్ల చూపుతున్న అంకితభావాన్ని గుర్తుచేసి, పర్యావరణ-సామాజిక కాలుష్యాలను ఎదుర్కోవడంలో సంఘీభావం అవసరమని వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొ. జయశ్రీ, మతం-వర్గం తేడా లేకుండా ప్రాణాలను కాపాడిన చింత చెట్టు విశిష్టతను ప్రశంసించారు. సభ ఆరంభంలో పండిట్ పరాశర్ మూసీ వరదలకు అంకితమైన హృద్యమైన లావణి గానం చేశారు.

సభ ముగింపులో, 1908 మూసీ వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరిస్తూ, హైదరాబాద్ పర్యావరణ-సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు.

FBH ఉపాధ్యక్షుడు ఎం.హెచ్.రావు సభకు స్వాగతం పలికారు. FBH ప్రధాన కార్యదర్శి శ్రీమతి శోభా సింగ్, సభకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. జి.రామేశ్వర్‌రావు (డైరెక్టర్, ESIC), బి.నారాయణ (రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్, హెరిటేజ్ తెలంగాణ), నర్సారెడ్డి (TRSMA), ఆకుల రవీందర్, శంకర్ (జై భీమ్), రామరాజ్, ఇలియాస్, శ్రీహరి, సయ్యద్ ఖలీద్, శ్రీలత, సయ్యద్ ఖైజర్ భాషా మరియు CHATRI, COVA, MSI, SRD, APSA, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

-ఖైజర్, m : 9030 6262 88
e:desk.deccan@gmail.com



సంస్థాన ద్వారం



లోకపల్లి సంస్థాన సైన్యాధిపతి రఘోజీ భోంస్లే



లోకపల్లి మొదటి నారాయణరావుగారు

# లోకాయపల్లి సంస్థానం

పాలమూరు జిల్లా అనేక గొప్ప సంస్థానాలకు నిలయం. ఇందులో ప్రధానంగా ఆత్మకూరు, కొల్లాపూర్, గద్వాల, గోపాల్ పేట, జటప్రోలు, లోకాయపల్లె, వనపర్తి వంటి సంస్థానాలు తెలంగాణ సంస్థాన చరిత్రలో ప్రసిద్ధమైనవిగా గుర్తింపబడ్డాయి. తెలంగాణలోని ప్రాచీన సంస్థానాలలో లోకాయపల్లి సంస్థానం ఒకటి. ఇది క్రీస్తు శకం 16 శతాబ్దంలో పాలమూరు జిల్లాలో వర్ధిల్లిన సంస్థానం. తెలంగాణను పాలించిన పశ్చిమ చాళుక్యరాజ్యం అంతరిస్తున్న దశలో దేవగిరిని రాజధానిగా చేసుకొని మహారాష్ట్రులు, ద్వారసముద్రాన్ని రాజధానిగా చేసుకొని కన్నడిగులు, ఓరుగంటిని రాజధానిగా చేసుకొని ఆంధ్రులు స్వతంత్రులయ్యారు. ఒక విధంగా ఇవి ఆనాడు భాషాప్రయుక్త రాష్ట్రాలుగా చెప్పవచ్చు. దీనిలో మరాఠశాఖ మళ్ళీ రెండుగా చీలిపోయింది. రత్నగిరి రాజధానిగా సేవణవంశం, దేవగిరిని రాజధానిగా యాదవ వంశం దక్షిణ ప్రాంతాన్ని పరిపాలించాయి. వీరిది మధ్యయుగపు భారతదేశ రాజవంశం. ఈ వంశం తమ పరిపాలన అత్యున్నత స్థాయిలో ఉండగా ఉత్తరాన ఉన్న నర్మదానది నుండి దక్షిణాన ఉన్న తుంగభద్రానది మధ్యన ఉన్న పశ్చిమ దక్కన్ ప్రాంతాన్ని పరిపాలించారు. యాదవరాజ్యంలో వెలసిన సంస్థానమే లోకాయపల్లి అదే నారాయణపేట సంస్థానంగా పిలవబడ్డది. ఇది మగతల పరగణాలో ఉండేది. మగతలకు 'మఖస్థలి' అని సంస్కృత వ్యవహారం. 'ముఖ' అనగా యజ్ఞం, 'స్థలి అనగా స్థలం. యజ్ఞాలను నిర్వహించే స్థలమని అర్థము. దీన్ని దేవగిరి యాదవ రామచంద్రుని సామంతుడు స్థాణుచమూపతి పాలించాడు.



ఈ మగతల పరగణాలో గురుమిటికెల (గురు మఠగల్), చంద్రకి (చంద్రక) కాన్కుర్తి (కర్ణకుటీర), కాన్గడ్డ, మద్దూరు, కోసిగి (కౌశికి) కోయలకొండ, కోటకొండ, ధన్వాడ, ఊటుకూరు, మక్తల్( మఖస్థలి), ఉజ్జలి (ఉజ్జయిని) గ్రామాలన్నిటిలో కలిపి 365 అగ్నిహోత్రాల కుటుంబాలుండేవి. ఈ అగ్నిహోత్రులతో పాటు ఇంకా నిత్యకర్మానుష్టా పరులైన స్మార్తులు, ఔదుంబర వ్రతస్థులైన వానప్రస్థులు, జైనులు, లోకాయతులు తమకొరకు ఆ పరగణాలో వేర్వేరు పల్లెలు కట్టుకొని నివసించారు. వానిలో లోకాయతులు కట్టుకున్న పల్లెనే లోకాయపల్లె పేర ఒక సంస్థానానికి రాజధానియై క్రీస్తుశకం 16 వ శతాబ్ది నుండి క్రీ.శ.1844 ప్రాంతం వరకు ఒక వెలుగు వెలిగింది.

క్రీ.శ.1689లో లోకాయపల్లెను పాలించిన వెంకట నారాయణ యాదవ్ తమకు దేవగిరి మగతల పరగణాలు ఉన్నట్లు తన దానపత్రంలో తెలిపిందు.



స్వస్తి శ్రీమత్ శాలివాహన శకే 1161 వ్యవహారిక చంద్రమానేనా శుక్లనామ సంవత్సర మార్గశిర శుద్ధ పంచమి సోమవారం వేదశాస్త్ర సంపన్న యాజమాన్య రాజా శ్రీ వశిష్ట గోత్రోత్పన్న ఆయాచిత విఠ్ఠలభట్టువారి పుత్రుడు భైరవ బట్టు వారి పుత్రులు త్రయంబక సోమయాజి విఠ్ఠలభట్టు కల్వర్గ వాస్తవ్యులకు వెంకటనారాయణ ఫడ్నవీస్ వమా మాలే దిల్షాదాబాద్ (ఊట్కూరు) తాటికొండ, దౌల్తాబాద్ దేశముఖ్ నాడగౌడ్ పరగణే తాటికొండ బాదేపల్లి బూర్గుల పెరగనణే వెనిజాల్ వగైరా మా నుంచి వ్రాయించి ఇచ్చిన భూదాన పత్రం. మీ పౌత్ర పరంపరగా అనుభవం చేస్తూ మా సంస్థానహిత చింతన కోరుతూ ఉండవలెను. మాకు మా సంస్థానమునకు హితచింతన చేస్తూ ఉండవలెను. (ఇది మోడీ లిపిలో దానపత్రం. దీని జిరాక్స్ ప్రతి శ్రీ ధనుంజయ దీక్షితుల దగ్గరుండగా దీన్ని బట్టల వ్యాపారస్తుడైన తుకారావు సంతపూర్ గారు మిక్కిలి శ్రమపడి చదివి పెట్టినారు).

ఈయన దానపత్రాలన్నీ ఆనాటి మోడిలిపిలోనే ఉన్నవి. లోకాయపల్లె సంస్థాన పాలకుడైన మొదటి వెంకటనారాయణ రావు 'పళ్ళ'లోని త్రియంబకభట్టు, విఠలభట్టు సోదరులకు నిరంతరం యజ్ఞయాగాదుల నిర్వహణకు కొంత భూమిని దానం చేశాడు. మొదటి వెంకటనారాయణ రావు గారి కాలంలో ఈ సంస్థానంలో దిల్షాదాబాద్ (ఊటుకూరు), తాటికొండ, దౌలతబాద్ (దేవగిరి), బాదేపల్లి, బూరుగుల మరియు వెనిజాల పరగణాలు ఉండేవి. ఇది తూర్పున తాటికొండ, దక్షిణంగా కలువకుర్తి, పడమట కాకులహారం (గురిమెటికెల దగ్గర), ఉత్తరంగా శాలిబండ (హైదరాబాద్) వరకు వ్యాపించి ఉండేవి. ఈ పరగణాల విషయాలను పరిశీలించి చారిత్రక అంశాలను గమనిస్తే క్రీ.శ. 1295లో దేవగిరిని యాదవ ప్రభువు రామచంద్రదేవుడు పాలించాడని తెలుస్తుంది. అతని దండనాయకుడైన స్థాణుచమూపతి మగతలలో వేయించిన శాసనం ఆధారంగా రామచంద్రదేవుని వంశం ఈ విధంగా చెప్పబడింది.

*"నా భే నారాయణ న్యాభూ ద్వి ధాతాతత్ర నార్మనః*
*తదన్వ యేస ముధ్భుతం-స్తితం యదకులంభువి"*

ఈ రామచంద్ర దేవునిది యాదవ వంశమని పై ఆధారంతో మనకు తెలుస్తుంది. అంతేకాక ఈ వెంకటనారాయణ తనది యాదవ వంశమని చెప్పుకున్నారు. ఆనాడు రామచంద్రదేవునికి ఉన్న పరగణాలే వెంకటనారాయణ గారికి చెల్లడం వల్ల (దానపత్రం ఆధారంగా), ఈ లోకాయపల్లె ప్రభువంశం ఆ రామచంద్ర దేవుని శాఖయే అని చెప్పవచ్చు. అయితే ఈ శాఖ ఎప్పుడు ఏ కారణం చేత దేవగిరిని విడిచి పాలమూరు జిల్లాలోని లోకాయపల్లెకు వచ్చిందో ఇక్కడికి వచ్చిన మూలపురుషుడు ఎవరో తెలియదు. యాదవ రామచంద్రదేవుడు తనను బ్రాహ్మణుడని చెప్పుకోలేదు. అయినా బ్రహ్మనుండి పుట్టిన వంశమే కనుక అతడు క్షత్రియత్వం అవలంబించిన బ్రాహ్మణుడు. లోకాయపల్లె వారు కూడా తాము బ్రాహ్మణులమని కానీ క్షత్రియులమని కానీ చెప్పుకున్నట్లు లేదు. వారు యాదవులయిన ఫడ్నవీస్ వంశస్థులమని మాత్రమే చెప్పుకున్నారు.

లోకాయపల్లె ప్రభువులు కాకతీయుల వలె నూతన గ్రామ నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న రుక్కమ్మపేట గ్రామ నిర్మాణం కూడా లోకాయపల్లె దొరలదే. తిమ్మాజిరావు తన పేరు మీద తిమ్మాజీపేట గ్రామాన్ని నిర్మించాడు. ఈ సంస్థాన ప్రభువులు వివిధ గ్రామాలలో స్వయం ఉపాధి కింద చేతివృత్తుల కళాకారులను ప్రోత్సహించారు. వారికి చేనేత మగ్గాలు ఇప్పించి జీవనోపాధి కల్పించారు. ఈ ప్రాంతం నుండి ఇతర ప్రాంతాలకు ప్రధానంగా నూలు, అద్దకపు పట్టు వస్త్రాలు ఎగుమతి చేసేవారు. లోకాయపల్లి ప్రభువుల నాణెములు ఔరంగాబాద్ మొదలైన దేశీయ ప్రాంతంలోనే కాకుండా విదేశీ ప్రాంతాలలో కూడా లభించాయి. ఈ సంస్థాన పాలకులలో ఒకరైన తిమ్మాజీ కొడుకు రుక్మాజీరావు జడ్చర్లలో వెంకటేశ్వర ఆలయాన్ని కట్టించాడు. ప్రస్తుతం తిమ్మాజీపేట మండలంలోని అప్పాజీపల్లె ఈ దొరలు కట్టించింది. లోకాయ





కోట బురుజు



కోనేరు



ఔదుంబర క్షేత్రం

పల్లె ప్రభువైన కామాజీరావు గూడూరు గ్రామాన్ని బ్రాహ్మణులకు అగ్రహారంగా దానమిచ్చాడు. దానిని కామాజీపురం లేక కామల్జీపురం అని పిలుస్తున్నారు. తిమ్మాజీరావు మనుమడు కామాజీరావు కొడుకు అయిన శ్యాంరావు గారి భార్య రుక్కమ్మ. వీరికి సంతానం కలగనందున శ్యామ్రావు గారు కావేరమ్మను రెండవ భార్యగా చేసుకున్నాడు. వీరి భార్యల పేరు మీద రెండు గ్రామాల నిర్మాణం జరిగింది. అవి రుక్కమ్మపేట, కావేరమ్మపేట. రుక్కమ్మపేట అమ్మపల్లెగా మారి పాతపాలమూరులో కలిసి పోయింది. కావేరమ్మపేట కౌరం పేటగా మారి జడ్చర్లలో కలిసింది. వీరి భార్యలు కూడా పరమ ధార్మికులు. రుక్కమ్మ త్రవ్వించిన పెద్ద బావి మానాజీ పేటలో ఉంది. కావేరమ్మ వేయించిన చెరువు నేరెళ్లపల్లిలో ఉన్నది. ఈ సంస్థానంలో ప్రభువులే కాక దివాన్లు కూడా జిల్లాలోని చాలా ప్రాంతాలలో నూతన గ్రామ నిర్మాణాలు, దేవాలయ నిర్మాణాలు చేసి మన సంస్కృతిని సాంప్రదాయాన్ని కాపాడారు. లోకాయపల్లె దొరల కింద బోయినపల్లి కరణాలు పెద్ద అధికారులుగా ఉండేవారు. తాడూరు, పాలమూరు, పోలేపల్లి గ్రామాల్లో వేదపండితులు ఎక్కువమంది ఉండేవారు. పోలేపల్లి వారు వేదములను పిల్లన గ్రోవిపై పలికించినారు. క్రీ.శ.1785లో భాస్కర రాయలు అనే పండితుడు లలిత సహస్రానికి భాష్యం రాశాడు.



లోకాయపల్లి లక్ష్మమ్మ దొరసాని ఈ రాజవంశంలో చివరిది. ఈమె మహిమలను ధార్మిక వర్తనను ఔదార్యాన్ని పరిపాలనను భక్తిని గురించి ప్రజలు అనేక కథలు చెప్పుకుంటారు. ఈమె దగ్గర బోయినపల్లె కరణాలు దివాన్జీలుగా ఉన్నారు. ఈమె నారాయణపేట దగ్గర ఎక్లాస్పూర్ లోనూ పాలమూరులో ఉన్న కోటతిరుమలదేవుని గుట్టపైన వెంకటేశ్వర ఆలయాలు ప్రతిష్ఠించింది. ఈమె స్థాపించిన ఆలయాలు నిరాడంబరంగా ఉండేవి. తర్వాత కొత్త మరమ్మత్తులతో వెలుగొందుతున్నవి.

తమ సంస్కృతిని కాపాడుతూ సాహిత్యాన్ని లలిత కళలను ప్రోత్సహించారు రాణి లక్ష్మమ్మ. ఆమె సంస్థానంలో దివాంజీ అయిన శేషజీరావు కల్వకుర్తి తాలూకాలోని వాడాల గ్రామంలో హనుమద్ దేవాలయం కట్టించాడు. ఇతడు తోలుబొమ్మలాటలు నాటకాలను ప్రోత్సహించాడు. కళాకారులను పోషించి నాటక రంగాన్ని ప్రోత్సహించి ప్రజాచైతన్యాన్ని కలిగించాడు. లోకాయపల్లి పతనానంతరం వాడాలలో స్థిరపడినా కళారంగాన్ని విస్మరించలేదు. జిల్లాలో కళాకారులకు నిలయంగా వాడాలా పేరు ప్రతిష్టలు పొందినది.

రాణి లక్ష్మమ్మ చివరిదశలో సంతానం లేక నాగర్ కర్నూల్ నుండి పిప్పిళ్ల వంశానికి చెందిన మాధవరావు అనే ఆయన్ని దత్తత తీసుకుందాం అనుకున్నారు. కానీ అప్పటికే దత్తు చట్టం వచ్చేసింది. కాబట్టి నైజాం సర్కార్ వీరి దత్తును అంగీకరించలేదు. రాణి లక్ష్మమ్మ నిజాం ప్రభువులకు కప్పం చెల్లించలేదని, ఝాన్సీ లక్ష్మీబాయికి ఆనాడు యుద్ధంలో పరోక్షం సహాయం అందించిందని ఉస్మాన్ అలీ ఖాన్ వనపర్తి సంస్థాన పాలకుడైన రాజరామేశ్వరరావుని యుద్ధానికి పంపగా అతడు లోకాయపల్లె కోటను ముట్టడించి జయించాడు. ఆత్మాభిమానంతో ఈమె ఆత్మార్పణ చేసుకున్నది. తరువాత లోకాయపల్లె కోట పతనమయింది. కోటలోని ప్రజలు ఊరికి ఉత్తరంగా ఒక గ్రామం ఏర్పాటు చేసుకొని జీవించారు. అదే ఇప్పుడు ఎక్లాస్పురం అయ్యింది. ఈ గ్రామ ప్రజలు రాణి లక్ష్మమ్మ దేవాలయాన్ని నిర్మించి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు.

ఈ సంస్థానానికి మూలపురుషుడు ఎవరో తెలియడం లేదు. ఈ వంశీయులు శాసనాలేవి వేయించలేదు. వీరి చరిత్రకు ఆధారాలు వీరిచ్చిన దాన పత్రాలే ఉన్నవి. ఇవి కూడా ఎక్కువగా అందుబాటులో లేవు. లోకాయపల్లె సంస్థాన ప్రభువుల పరిపాలన అనేక దండయాత్రల వలన అస్తవ్యస్తంగా సాగినందువలన ఈ సంస్థాన పాలకుల చరిత్ర సమగ్రంగా తెలియడం లేదు. పాలమూరు జిల్లా సంస్థానాల్లో ప్రసిద్ధి గాంచిన ఈ లోకాయపల్లి గురించి తగిన పరిశోధన జరిగి అనేక విషయాలు బయటకు రావలసిన అవసరం ఎంతైనా వుంది. దానికోసం విశ్వవిద్యాలయాలు సాహిత్య సంస్థలు సమిష్టిగా కృషి చేయాలి.

–డా॥ కోడోజు కృష్ణమూర్తి
m:85001 67845
e: drkmurthy75@gmail.com

# బతుకమ్మ సారూప్యత ఛట్ పూజ

మన ప్రాచీన పండుగల్లో ఛట్ పూజ ఒకటి. భూమ్మీద తమకు మనుగడ కల్పిస్తున్న సూర్యభగవానుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ, ఆయురారోగ్య, ఆనందాలను ప్రసాదించమని ప్రార్ధిస్తారు. సూర్య భగవానుడిని ఆరాధించడానికి అంకితం చేయబడిన గౌరవప్రదమైన పండుగ ఛత్ పూజ.

ఛట్ పూజ మనదేశంలో ప్రధానంగా బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలవారు జరుపుకునే పండుగ. ఛట్ పూజను నాలుగు రోజులు జరుపుకుంటారు. మొదటి రోజును నహాయ్ ఖాయ్, రెండోరోజును ఖర్నా, మూడవ రోజును పెహలా అర్ఘ్య, నాలుగవరోజును పార్నాగా పేర్కొంటారు. ఛట్ పూజ చేసేవారు అత్యంత నిష్ఠగా నహాయ్‌ఖాయ్ ఆచరిస్తారు. ఎక్కువగా మహిళలే ఈ వ్రతాన్ని ఆచరిస్తారు.



## పూజా పద్ధతి

ఈ పండగ సందర్భంగా ఇల్లంతా శుభ్రపరచుకుని, శుచిగా స్నానం చేస్తారు. వ్రతధారులే స్వయంగా పీలి మట్టితో పొయ్యి తయారుచేసి మామిడి కట్టెలను ఉపయోగించి అర్వాచావల్, శనగపప్పు, సొరకాయ లేదా అరటికాయ కూరతో తయారుచేసిన వంటకాన్ని ఆరగిస్తారు. వంటలో సాధారణంగా ఉప్పు వినియోగించరు. ఒకవేళ వాడినా సైంధవ లవణాన్ని మాత్రమే వాడుతారు. సొరకాయ ఈ రోజున వంటలో ప్రధానంగా వాడుతారు. కనుక నహాయ్ ఖాయ్ భోజనాన్ని కొందరు కద్దూబాత్‌గా పేర్కొంటారు. వ్రతధారులు రాత్రి ప్రసాదం తరువాత మరుసటి రోజు సాయంత్రం వరకు ఉపవాసముంటారు. ఈ రోజును ఖర్నాగా పేర్కొంటారు. సాయంత్రం ఖీర్, రొట్టెలను ప్రసాదంగా స్వీకరించి నిర్జల ఉపవాసాన్ని ప్రారంభిస్తారు. మూడవ రోజున అస్తమించే సూర్యున్ని పూజించి చాటలో ప్రసాదాన్ని సమర్పిస్తారు. నాలుగో రోజున ఉదయించే సూర్యునికి అర్ఘ్యప్రసాదాలు సమర్పించి వ్రత విసర్జన చేసి విందు భోజనం చేయడంతో వ్రతం పూర్తవుతుంది.

## ఛట్‌పూజ, బతుకమ్మ సారూప్యత

ఛట్ పూజ కూడా తెలంగాణలో బతుకమ్మ, ఆంధ్రప్రదేశ్ లో మకర సంక్రాంతి రోజు సూర్య దేవుని పూజ మాదిరిగానే ప్రకృతికి సన్నిహితమైనది. సకల సృష్టికి ఆధారమైన సూర్యభగవానున్ని ఈ పండుగ సందర్భంగా కొలుస్తారు. మోకాలి లోతు వరకు నీటిలో నిలబడి సూర్యదేవునికి అర్ఘ్యప్రసాదాలను సమర్పించడం ఈ పూజ ప్రత్యేకత. వెదురు గంప లేదా చాటలో పళ్లను ఉంచి అస్తమించే సూర్యునికి, ఉదయించే సూర్యునికి ప్రసాదంగా సమర్పిస్తారు. ఈ పూజలో ప్రధాన భాగం నదీతీరాన జరుగుతుంది. కాబట్టి ఈ పూజ నదుల శుద్ధీకరణలపై కూడా దృష్టిసారించేలా చేస్తుంది. పండుగ సమయంలో ప్రసాదంగా సమర్పించే బెల్లం, చెరకు, కొబ్బరి కాయలు, అరటిపళ్లు, పసుపు, అల్లం ఇత్యాది సామగ్రి ఆరోగ్యానికి కూడా మేలుచేస్తుందంటారు వైద్య నిపుణులు.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన



పెద్దలు రాసిన పిల్లల కథలు
(ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350.
తగ్గింపు ధర రూ.300
ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్
నెం.12, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
email: edit.chelimi@gmail.com
website : www.balachelimi.com

# ఇంజినీరింగ్‌కు దీటుగా డిగ్రీ

దేశంలో విద్యా రంగం కొత్త దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు ఇంజనీరింగ్ విద్య ప్రత్యేకంగా బీటెక్, పాలిటెక్నిక్ కోర్సులకే పరిమితమై ఉండేది. కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం ఈ పరిస్థితిని మార్చబోతోంది. ఇకపై సాధారణ డిగ్రీలోనే ఇంజనీరింగ్ అంశాలను చేర్చి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించనున్నారు. దీని వల్ల డిగ్రీ పూర్తయ్యే సరికి విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో సిద్ధమవుతారు.

ప్రస్తుతం ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కోర్సులు చదివే విద్యార్థులు సుమారు 40 లక్షలమంది ఉన్నారని అంచనా. కానీ వారిలో చాలామంది పరిశ్రమల్లో ఉపాధి పొందడంలో ఇబ్బందులు పడుతున్నారు. కారణం టెక్నికల్ స్కిల్స్, ప్రాక్టికల్ అనుభవం లోపించడమే. ఈ లోటును అధిగమించడానికి డిగ్రీ కోర్సుల సిలబస్‌లో 20 శాతం వరకు సాంకేతిక విషయాలను చేర్చాలని నిర్ణయించారు. ఈ మార్పులు 2025-26 విద్యా సంవత్సరంలో అమల్లోకి వస్తాయి.

డిగ్రీ విద్యార్థులు ఇకపై రోబోటిక్స్, డేటా సైన్స్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, మేనేజ్‌మెంట్ వంటి సబ్జెక్టులను కూడా నేర్చుకుంటారు. కేవలం తరగతి గదిలో మాత్రమే కాకుండా, ప్రాజెక్ట్ వర్క్, ఇంటర్న్‌షిప్, శిక్షణా కార్యక్రమాల ద్వారా ప్రత్యక్ష అనుభవం పొందుతారు. దీని వల్ల ఉద్యోగాలకు అర్హత సాధించడానికి ప్రత్యేకంగా కోర్సులు చేయాల్సిన అవసరం లేకుండా డిగ్రీలోనే తగిన జ్ఞానం, నైపుణ్యం సంపాదించవచ్చు.

ఇకపై డిగ్రీ విద్యార్థులు మాత్రమే కాకుండా ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ చదివే వారు కూడా డిగ్రీలో అడ్మిషన్ పొందే అవకాశం



కలుగుతుంది. అంటే ఒకేసారి రెండు కోర్సులు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. ఇది విద్యార్థులకు ద్విగుణ ప్రయోజనం కలిగిస్తుంది. డిగ్రీ విద్యార్థులకు ఇంజనీరింగ్ జ్ఞానం, ఇంజనీరింగ్ విద్యార్థులకు డిగ్రీ అర్హత ఒకేసారి లభిస్తుంది.

ఈ విధానం వల్ల విద్యార్థులకు లభించే లాభాలు అనేకం. పరిశ్రమల్లో తక్షణం పనిచేయగల నైపుణ్యాలు వస్తాయి. ఉద్యోగ అవకాశాలు విస్తరిస్తాయి. ఉదాహరణకు ఒక బీ.ఎస్సీ విద్యార్థి రోబోటిక్స్, డేటా సైన్స్ నేర్చుకుంటే, సాధారణంగా ఇంజనీరింగ్ చేసిన వారికే లభించే అవకాశాలను కూడా పొందగలడు. ఒక బీ.ఏ. విద్యార్థి డిజిటల్ టెక్నాలజీ లేదా మేనేజ్‌మెంట్‌లో శిక్షణ పొందితే, కార్పొరేట్ రంగంలో సులభంగా చేరగలడు.

రాష్ట్రాల వారీగా సిలబస్ రూపకల్పన జరుగుతోంది. టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డు, ఉన్నత విద్యా మండలి కలిసి పరిశ్రమల అవసరాలు, భవిష్యత్ సాంకేతిక పరిణామాలను దృష్టిలో పెట్టుకొని కొత్త సిలబస్‌ను రూపొందిస్తున్నాయి. ఇకపై డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు ఉద్యోగం కోసం అర్హత సాధించాలంటే వేరే శిక్షణ అవసరం ఉండకపోవచ్చు.

మొత్తం మీద ఈ మార్పులు విద్యార్థులకూ, పరిశ్రమలకూ లాభదాయకం. ఒకవైపు నిరుద్యోగిత సమస్య తగ్గుతుంది. మరోవైపు పరిశ్రమలకు కావలసిన నైపుణ్యం కలిగిన యువత అందుబాటులోకి వస్తారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఈ మార్పులు తోడ్పడతాయి. విద్యార్థుల భవిష్యత్తు మరింత బలపడుతుంది.

నిపుణులు ఈ విధానాన్ని స్వాగతిస్తున్నారు. డిగ్రీ విద్యార్థులు సాధారణ విద్యతో పాటు టెక్నికల్ జ్ఞానం పొందడం ద్వారా ఒకేసారి రెండు కోర్సుల ప్రయోజనం పొందుతారు. భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు దేశ నిర్మాణంలో యువత పాత్ర మరింత కీలకంగా మారుతుంది.

– కొత్వాల్. సచిన్, m : 86866 64949
e: desk.deccan@gmail.com

## లాజిస్టిక్స్ హబ్‌గా తెలంగాణ

భారతదేశ తూర్పు పడమటి పోర్టులను అనుసంధానించే లాజిస్టిక్ హబ్‌గా తెలంగాణ ఎదగనుందని తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల డైరెక్టర్ జె. నిఖిల్ చక్రవర్తి వెల్లడించారు. హైదరాబాద్‌లో జరిగిన కోల్డ్ చైన్ అన్‌బ్రోకెన్ 2025 సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లాజిస్టిక్స్ పాలసీ 2.0ను రూపొందిస్తోందని, ఇది మౌలిక సదుపాయాల లోపాలను పూడ్చి, కొత్తవృద్ధి కారిడార్లను సృష్టించేందుకు వ్యాపారాలతో కలిసి పనిచేస్తుందని ప్రకటించారు. దీనివల్ల మందులు, తాజా ఆహారం లాంటి ముఖ్యమైన వస్తువులను వేగంగా, సురక్షితంగా డెలివరీ అవుతాయని పేర్కొన్నారు. తెలంగాణ దుబాయ్, సింగపూర్ లాంటి అంతర్జాతీయ మోడళ్లతో సమానంగా లాజిస్టిక్స్ హబ్‌గా మారాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.

# సింగరేణి గనులకు అవార్డులు

## కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్




పర్యావరణ హిత చర్యలు, సంక్షేమం, సౌకర్యాల కల్పనలో ఉత్తమ కంపెనీగా ఉన్న సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరానికి జాతీయస్థాయిలో 4 బొగ్గు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్‌ను సాధించి తన ప్రతిభను మరోసారి చాటుకుంది. గురువారం (సెప్టెంబర్ 04, 2025.) ముంబయిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ ఈ అవార్డులను అందుకున్నారు.

ప్రతిష్టాత్మక ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులను అందుకున్న గనులలో రామగుండం-3 ఏరియాకి చెందిన ఆర్‌జిఓసి-1 ఎక్స్‌టెన్షన్, ఇల్లందు ఏరియాకి చెందిన జేకే-5 ఓసి, భూగర్భగనుల్లో శ్రీరాంపూర్ ఏరియాకి చెందిన ఆర్కే-6 గని, ఆర్కే న్యూటెక్ గనులు ఉన్నాయి. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారు ప్రతీ ఏడాది దేశంలో అత్యుత్తమ గనులకు స్టార్ రేటింగ్‌ను ఇస్తూ అత్యుత్తమ స్టార్ రేటు సాధించిన గనుల యాజమాన్యాలను అభినందిస్తూ అవార్డులను అందిస్తూ ఉంటారు. ఈ ప్రక్రియను స్టార్ రేటింగ్ అంటారు.

ఇలా స్టార్ రేటింగ్ ఇవ్వడం కోసం బొగ్గు గని పనితీరు, రక్షణ చర్యలు, నిర్వహణ, అక్కడ గల సౌకర్యాలు, పర్యావరణహిత చర్యలు, కార్మిక సంక్షేమం వంటి 84 అంశాలను పరిగణనలోనికి తీసుకుని మార్కులను కేటాయించడం జరుగుతుంది. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పి ఉన్న గనులలో పై 84 అంశాలను కేంద్ర బొగ్గు శాఖ నుండి వచ్చిన పరిశీలక బృందం వారు ప్రత్యక్షంగా పరిశీలించి మూల్యాంకనం జరుపుతారు.

ప్రాథమిక మూల్యాంకనం తర్వాత వీటి నుండి అత్యుత్తమ గనులను ఎంపిక చేస్తారు. ఇలా ఎంపిక చేసిన వాటిలో ఇంకా అత్యుత్తమమైన వాటిని మరో కమిటీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుంది. మొత్తం 100 మార్కుల్లో 91 కన్నా ఎక్కువ మార్కులు సాధించిన గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు. ఈ విధంగా సింగరేణి సంస్థలో ఈసారి నాలుగు గనులు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడం అభినందనీయం. ఈ గనుల నిర్వహణ, పర్యావరణ చర్యలు, సంక్షేమ కార్యక్రమాలు, ఉత్పత్తి సాంకేతికత వంటి అంశాలలో ఉత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందు వల్లే ఈ అవార్డులు సాధించుకోవడం జరిగింది. దీనిపై ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ తన హర్షం ప్రకటిస్తూ గనుల యాజమాన్యాలకు, కార్మికులకు తన అభినందనలు తెలియజేశారు. ఈ ఏడాది గతంలో ఎప్పుడూ లేని విధంగా నాలుగు గనులకు 5 స్టార్ రేటింగ్ లభించడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఇవే కాకుండా 14 గనులు 100 కు 80 నుండి 90 మార్కులు సాధించి 4 స్టార్ రేటింగు ను అందుకోవటం విశేషం. 20 గనులకు 3 స్టార్ రేటింగ్ లభించడం విశేషం. గతంలో కొన్ని గనులకు 2 స్టార్ రేటింగ్లు కూడా లభించగా.. ఈ సారి అన్ని గనులు కూడా తమ పనితీరును మెరుగుపరచుకుని 3 స్టార్ రేటింగ్ సాధించడం విశేషం.

– చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్
ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ప్రభుత్వ సంస్థ)
ప్రజా సంబంధాల విభాగం, హైదరాబాద్



# తెలంగాణలో వరి ఓవర్‌లోడ్

తెలంగాణ వరి విస్తీర్ణంలో పెరుగుదల నమోదు చేస్తున్నప్పటికీ, పంట యొక్క సన్నటి రకాలకు తన ప్రోత్సాహాన్ని పెంచుతోంది, ఇది ఆందోళనలను రేకెత్తిస్తోంది.

తెలంగాణ ప్రభుత్వం సన్న వరి సేకరణపై రూ. 500 బోనస్ ఇవ్వడం విమర్శలకు దారితీస్తోంది. ఎందుకంటే రాష్ట్రంలో ముతక రకాల కంటే దీనిని తక్కువగా సాగు చేస్తారు.

గత దశాబ్దంలో, రైతు జి. రవీందర్ రెడ్డి తన గ్రామమైన చొప్పదండిలో వ్యవసాయ మార్పును గమనించాడు. తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలోని ఈ గ్రామంలో ఖరీఫ్ (లేదా వానకాలం) మరియు రబీ (యాసంగి) సీజన్లలో వరి విస్తీర్ణం పెరిగింది.

“వరి పొలాలకు మొక్కజొన్న లాగా కాలానుగుణంగా నీరు పెట్టడం కాకుండా, నీటిపారుదల అవసరం కాబట్టి నీటిపారుదల మారిపోయింది” అని రవీందర్ రెడ్డి చెప్పారు. అతను గతంలో పత్తి, మొక్కజొన్న, వరి పండించాడు. కానీ ఇప్పుడు వరిని మాత్రమే పండించాడు. విత్తడం, కోత సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్ మరియు మహారాష్ట్ర నుండి వ్యవసాయ కార్మికులను తేగలదు ఈ గ్రామం.

ముఖ్యంగా రాష్ట్రంలో తక్కువగా సాగు చేయబడిన సన్నగింజల వరి ధాన్యాన్ని సేకరించినప్పుడు రైతులకు కనీస మద్దతు ధర (MSP) కంటే క్వింటాలుకు రూ. 500 (100 కిలోలు) బోనస్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత, తెలంగాణ అంతటా ఇటువంటి దృశ్యం కనిపిస్తుంది.


ఈ బోనస్ 2023 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలలో భాగం. దాని మ్యానిఫెస్టోలో “వరి పంటలు” మాత్రమే ప్రస్తావించబడింది. అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వం 33 సన్న వరి రకాలకు బోనస్‌ను పేర్కొంది. ప్రభుత్వం జూలై 2024లో విడుదల చేసిన ఒక నివేదిక సన్న వరిని 6 మిమీ కంటే తక్కువ సన్న వరి బలం, 2.5 కంటే ఎక్కువ సన్న వరి పొడవు-వెడల్పు నిష్పత్తి మరియు 17 శాతం తేమ శాతం కలిగిన సన్న వరిగా వర్గీకరిస్తుంది. BPT 5204 (సాంబా మహసూరి), RNR 15048 (తెలంగాణ సోనా) మరియు HMT సోనా తెలంగాణలో పండించే కొన్ని సన్న వరి రకాలు.

అయితే, ఈ బోనస్ వరి ఉత్పత్తి ప్రోత్సాహకంపై ఆందోళనలను లేవనెత్తుతుంది. ఇప్పటికే తెలంగాణలో, రెండు సీజన్లలో వరి విస్తీర్ణం సంపూర్ణంగా, మొత్తం పంట విస్తీర్ణంలో వాటాగా పెరుగుతోంది (‘ఖచ్చితమైన పెరుగుదల’ చూడండి). 2024-25లో, రాష్ట్రం ఖరీఫ్‌లో 15.35 మిలియన్ టన్నులు మరియు రబీ సీజన్లలో 12.75 మిలియన్ టన్నుల రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తిని చూసిందని నీటిపారుదల, పౌర సరఫరాల మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

అదే సమయంలో ఇతర పంటల విస్తీర్ణం తగ్గుతోంది. డిసెంబర్ 2024 నివేదిక ప్రకారం, 2013-14 మరియు 2023-24 మధ్య, తెలంగాణలో పండ్ల పంటల విస్తీర్ణం 3,00,000 హెక్టార్ల (హెక్టార్లు) నుండి 1,60,000 హెక్టార్లకు, కూరగాయలు 2,20,000 హెక్టార్ల నుండి 50,000 హెక్టార్ల కంటే తక్కువకు మరియు చెరకు 39,000 హెక్టార్ల నుండి 27,000 హెక్టార్లకు తగ్గింది. నూనెగింజల విస్తీర్ణం సగానికి తగ్గింది. ముతక

తృణధాన్యాలు, పప్పుధాన్యాలు కూడా స్వల్పంగా తగ్గాయి. పత్తి మాత్రమే 1,70,000 హెక్టార్ల నుండి 1,80,000 హెక్టార్లకు స్వల్పంగా పెరిగింది.

“మనం ఇతర పంటలకు మారకుండా సంవత్సరానికి 5 మిలియన్ హెక్టార్లకు పైగా వరిని ఎందుకు ఉత్పత్తి చేస్తున్నాము?” అని హైదరాబాద్‌కు చెందిన లాభాపేక్షలేని సంస్థ సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ (CSA) డైరెక్టర్ జివి రామాంజనేయులు అడుగుతున్నారు. రబీ సమయంలో ఉద్యానవన పంటలు, పప్పుధాన్యాలు, నూనెగింజల కోసం 1,00,000 హెక్టార్లను మళ్లించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ అల్దాస్ జానయ్య సూచిస్తున్నారు.




సన్న వరికి బోనస్ ఇవ్వడం కూడా విమర్శలకు దారి తీస్తుంది. ఎందుకంటే రైతులు ముతక వరిని ఇష్టపడతారు. ఇది విరిగిపోయే అవకాశం తక్కువ. ముతక వరికి ప్రైవేట్ వ్యాపారుల నుండి కూడా అధిక ధరలు లభిస్తాయి. తమిళనాడు, కేరళలో విక్రయించడానికి ఉడకబెట్టిన బియ్యం తయారు చేయడానికి ఉపయోగిస్తారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏప్రిల్‌లో రాష్ట్రం 31 మిలియన్ల మందికి లేదా రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి సంవత్సరానికి 3 మిలియన్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తుందని చెప్పారు. సన్న బియ్యాన్ని ఇప్పటికే ప్రజా పంపిణీ వ్యవస్థ కింద సరఫరా చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

సన్న బియ్యం పోషక విలువలపై నిపుణులు సందేహాలు లేవనెత్తుతున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్-ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ మాజీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ దయాకర్ రావు మాట్లాడుతూ.. సన్న బియ్యం ముతక బియ్యం కంటే ఎక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ (కార్బోహైడ్రేట్లు కలిగిన ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిలను ఎంత త్వరగా పెంచుతాయో ర్యాంక్ చేసే వ్యవస్థ) కలిగి ఉంటుందని, డయాబెటిస్‌కు కారణమవుతుందని చెప్పారు.

హైదరాబాద్‌లోని ఫుడ్ అండ్ న్యూట్రిషన్ కన్సల్టెంట్ సలోమ్ యేసుదాస్ ఇలా అంటున్నారు.. “సన్న బియ్యం పాలిష్ చేసిన తర్వాత అన్ని బి కాంప్లెక్స్ విటమిన్లను కోల్పోతుంది. సెమీ పాలిష్ చేసిన బియ్యం లేదా మిల్లెట్లను తీసుకోవడం మంచిది.”

ఏప్రిల్‌లో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను ప్రారంభించిందని అన్నారు. 1,00,000 టన్నుల బియ్యం మరియు 8,00,000 టన్నుల వరి, చక్కటి ధాన్యం కలిగిన IR64 మరియు MTU1010 రకాలను ఎగుమతి చేయడానికి ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేయబడింది. కానీ ఇది సరిపోకపోవచ్చు అని జానయ్య చెప్పారు. “గత దశాబ్దంలో ఫిలిప్పీన్స్ వరి పంట తగ్గింది. అందువల్ల అది 4-5 మిలియన్ టన్నులను దిగుమతి చేసుకుంటుంది. కానీ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (FCI) గోడౌన్లలో ఇప్పటికే 70-80 మిలియన్ టన్నుల బియ్యం ఉన్నాయి. నవంబర్ నాటికి కొత్త పంట 30-40 మిలియన్ టన్నులు పారవేయడానికి మిగిలి ఉంటుంది” అని ఆయన చెప్పారు. FCI కూడా ఇథనాల్ ప్లాంట్లకు కిలోకు రూ.22కి బియ్యాన్ని ఇస్తుంది. అయినప్పటికీ దీనిని కిలోకు రూ.37-39కి సేకరిస్తారు” అని ఆయన తెలిపారు.

“బియ్యాన్ని విదేశాలకు పంపడం అంటే ప్రజలను స్థానభ్రంశం చేయడం, ఆనకట్టలు నిర్మించడం ద్వారా అందుబాటులో ఉన్న నీటిని ఎగుమతి చేయడం” అని రామాంజనేయులు చెప్పారు. “ఉత్పత్తికి ముందు నుండి పంటకోత తర్వాత వరకు దాని మొత్తం విలువ గొలుసుకు ప్రభుత్వ మద్దతు ఉన్నందున వరికి ప్రోత్సాహం లభిస్తుంది. మనకు కావలసింది రైతులను ఇతర పంటలకు మారడానికి ప్రోత్సహించడం” అని ఆయన అంటున్నారు.

-జి రామ్ మోహన్
(డౌన్ టు ఎర్త్ మ్యాగజైన్) ద
అనువాదం : ఎసికె. శ్రీహరి



# పూటకూళ్ళవ్వ

(గత సంచిక తరువాయి)

(**జరిగిన కథ:** విడిదిలో బసచేసి అవ్వతో కూడా స్నేహంగా ఉన్న ఒక ఉన్నతమైన కుటుంబంతో అవ్వ కూడా బాగా కలిసిపోతుంది. వారు మాతృభాషకు ఇచ్చే ప్రాముఖ్యతకు ముఖ్య కారణం చిన్నతనంలో చదివిన "భారతీయం" అనే కథ అని, అది చదవమని అవ్వకు ఆ కథ తెచ్చిస్తారు.)

కథ చదివిన అవ్వకు అచ్చ తెలుగు సాంప్రదాయాలతో కూడిన మరో లోకంలోకి వెళ్లి వచ్చినట్టు అనిపించింది. "పరవాలేదు ఈ కాలంలో ఇలాంటి వారు కొందరైనా ఉంటే మన భాషకు, మన పద్ధతులకు ఢోకా ఉండదు". అనుకుంటూ "రోజూ నా దగ్గరికి ఆడుకోవటానికి ఓసారి, లేదంటే అప్పుడప్పుడు కథలు వినటానికి, ముచ్చట్లు పెట్టటానికి పిల్లలు వస్తుంటారు కదా! సందర్భం వచ్చినప్పుడు వాళ్లకి కూడా ఈ కథ చెప్పాలి" అని నిర్ణయించుకుంది.

వాళ్లు ఉన్న నాలుగు రోజులు తన స్వంత కుటుంబంతో కలిసి ఉన్నట్టుగా అనిపించింది. అవ్వా! వెళ్లి వస్తాం అని చెబుతుంటే ఎప్పుడూ లేనిది కొంచెం బాధగా, చిన్నబోయినట్టుగా కూడా అనిపించింది. అందుకే వాళ్లతో.. "అప్పుడప్పుడు ఈ అవ్వ కోసమైనా ఇక్కడికి వచ్చి పోండి బాబు..." అంది అవ్వ. "తప్పకుండా అవ్వా!" అంటూ వాళ్లు బయటకు వెళ్ళినప్పుడు అవ్వ కోసం తెచ్చిన చీర ఇచ్చి నమస్కరించి వెళ్లిపోయారు.

× × ×

తెల్లవారింది. ఆరోజు ఆదివారం కావడంతో రోజూ సాయంత్రం అవ్వ దగ్గరికి వచ్చే పిల్లలంతా ఉదయం 11 గంటల వరకే వచ్చారు. "వీళ్లు ఇప్పుడు రావటమే మంచిదయ్యింది. నాకు కూడా మనసు చిన్నబోకుండా కాస్త ఉత్సాహంగా ఉంటుంది" అనుకుంది అవ్వ. కానీ, పిల్లల ముఖాలు చూడగానే ఆశ్చర్యపోయింది. అందరి ముఖాల్లోనూ కొంచెం కోపం, కొంచెం బాధ కనబడుతున్నాయి. "ఎప్పుడూ లేనిది ఇలా ఉన్నారేమిటి?" అనుకుంటూ అదే విషయం పిల్లల్ని అడిగింది.

"అవ్వా! మేం ఎప్పుడైనా అల్లరి చేసామా! అమ్మా నాన్న చెప్పిన మాట వినలేదా! మమ్మల్ని ఏరోజైనా వాళ్లు కోప్పడ్డారా! ఇప్పుడు ఒకేసారి కోప్పడటమే కాదు.. కొట్టారు కూడా" ఏడుపు గొంతుతో అందరూ ఒకే విధంగా చెప్పారు.

పిల్లల్ని చూస్తుంటే అవ్వకి కూడా బాధనిపించింది. "అసలు ఏమయిందర్రా... అసలు విషయం చెప్పండి" అడిగింది అవ్వ.

కానీ పిల్లలేమీ మాట్లాడలేదు. వాళ్లని ఎలా దారికి తెచ్చుకోవాలో అవ్వకి బాగా తెలుసు. అందుకే వాళ్లని సముదాయిస్తూనే "ఏంటో ఈ అమ్మానాన్నలు అనవసరంగా పిల్లల్ని కోప్పడుతుంటారు... ఉండండి వాళ్లను మిమ్మల్ని ఎందుకు కొట్టారో

గట్టిగా అడుగుతాను" అనటంతో... పిల్లలందరికీ అవ్వ తమవైపే ఉందని అనిపించి ధైర్యంగా జరిగింది చెప్పటం మొదలుపెట్టారు.

"అది కాదు అవ్వా! అమ్మ పనిలో ఉన్నప్పుడు దుకాణం నుండి మాతోటే సరుకులు తెప్పిస్తారు కదా!" "ఈసారి కూడా మేమందరం వెళ్లి అలాగే సరుకులు తెచ్చాము. కానీ ఈసారి ఇచ్చిన డబ్బులు కంటే సరుకులు తక్కువ వచ్చాయట... ఎందుకలా తెచ్చారు? మిగతా డబ్బులు ఏం చేసారని" కోపడ్డారు. "మేమేమీ చేయలేదంటే.. అబద్ధం ఆడుతున్నారని, మీరు మా చాటుకు ఏమన్నా కొనుక్కున్నారా?" అంటూ కొట్టారు. "నిజంగా వాటిని మేం ఏమీ చేయలేదు. మొత్తం డబ్బులతో సరుకులే కొన్నాం" అంటూ పిల్లలంతా బాధగా చెప్పేసరికి అవ్వ కాసేపు ఆలోచించింది. "ఇందులో ఏదో తిరకాసు ఉంది" అనుకుంది. పిల్లల్ని కాస్త బుజ్జగించి ముందుగా అందరికీ పలహారం పెట్టింది.

"అందరూ నాతో బయలుదేరండి... మనం ఒక చోటుకి వెళ్దాం" అంటూ ముందుకు నడిచింది.

అవ్వకు వీళ్లు ఎప్పుడూ సరుకులు తెచ్చే దుకాణం తెలుసు కాబట్టి సరాసరి అక్కడికే తీసుకెళ్లింది. కాస్త దూరంలో ఉండగానే.. దుకాణంలో జరుగుతున్న గొడవను చూసి అక్కడే ఆగిపోయారు.

అక్కడ దుకాణం యజమాని, అతని కొడుకు, ఒక పోలీసు, సరుకులు కొనుక్కోవటానికి వచ్చినతను ఉన్నారు. ఒకరికొకరు గొడవ పడుతున్నారు. అవ్వ పిల్లల్ని అక్కడే ఉండమని.. తాను దుకాణం దగ్గరికి వెళ్ళింది.

"ఏమిటీ... ఏమయ్యింది?" ఆరాతీసింది అవ్వ.

"అవ్వా! నువ్వైనా చెప్పు.. నేను ఎప్పుడైనా మా దుకాణంలో మోసం చేసానా? నేను ఇప్పుడే ఊరి నుండి వచ్చాను. రాగానే ఈసారి రావలసిన సరుకుల కంటే బాగా తక్కువ వచ్చాయని గొడవ చేస్తున్నాడు ఇతను." "అలా ఎందుకు వస్తాయి?" అని నేను వాదిస్తే.. ఇటు నుండి వెళుతున్న పోలీసును కూడా పిలిచాడు." అని వాపోయాడు యజమాని. వీళ్లందరి మధ్యలో భయపడుతూ నిల్చున్న యజమాని కొడుకుని గమనించింది అవ్వ.

"ఈ బాబు నీ కొడుకే కదూ" అడిగింది అవ్వ.

"అవును... నేను ఊరు నుండి వచ్చేదాకా వీడే చూసుకున్నాడు దుకాణంను" అన్నాడు యజమాని.

(మిగతా కథ వచ్చే సంచికలో)

– మాదారపు వాణిశ్రీ
ఫోన్ : 9247286668
బొమ్మలు: కైరం బాబు

## చందాదారులుగా చేరండి... చేర్పించండి...

***పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.***

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టిఆర్‌సి 'చర్చ' సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది. స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంతో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, పర్యావరణం, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యాటకం లాంటి అంశాలపై కథనాలను వెలువరిస్తున్నది. ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లుతుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాలను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు కూడా చందాదారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ
**– మణికొండ వేదకుమార్**
సంపాదకులు

**చందా వివరాలు:**

వార్షిక చందా : రూ. 300 2 సం॥లకు : రూ. 600

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎం.ఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**చిరునామా :**

**DECCAN LAND :**
**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com
ww.deccanland.com

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

| | |
|---|---|
| Name | : DECCAN LAND |
| Bank | : KOTAK MAHINDRA BANK |
| A/c No | : 7111218829 |
| IFSC Code | : KKBK0007463 |
| Branch Code | : 007463 |



Oxford
Grammar High School
KNOWLEDGE IS POWER
OGS
JUNIORS
grow naturally
43rd
YEARS OF MERITORIOUS PERFORMANCE
We make school time the best time for your kids
At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.
• Loving atmosphere & play ground
• CCTV surveillance
• Certified teachers & caring staff
• Kids zone & play area
• Interactive & Value based Learning
CARING TEACHERS & STAFF
Your child will get the best care and attention
ECO-FRIENDLY PRACTICES
We let the children play with nature friendly material
HUGE PLAYGROUND
Your child will get lots of fresh air and playtime
INTERACTIVE LEARNING
Our trusted method helps your child communicate and learn with ease.
Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512

DECCAN LAND,
ISSN 2581-3188

Telugu Monthly Magazine Date of Publication 26th - September 2025
Postal Dates: 28th & 29th Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad-01.

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026


# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

## ప్రచురణలు

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

**38 పుస్తకాల ధర రూ.1630 • తగ్గింపు ధర రూ. 1450**

**తెలంగాణ బడి పిల్లల కథలు** — 10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



**పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)** — 10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు** — 18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహాలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

–మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

SCAN & PAY


Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar